Published by Telangana

TS-25-0034017

# సత్యమేవ జయతే

తెలుగు దినపత్రిక

- ధర్మం నిలబడాలి, సత్యం గెలవాలి, సత్యం మాత్రమే గెలవాలి జైహింద్

**విలేకరులు కావలెను**

తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా "సత్యమేవ జయతే" తెలుగు దినపత్రికలో బ్యూరో మండలాల రిపోర్టర్లు పనిచేయుటకు జిల్లాల నియోజకవర్గ స్థాయిలో ఉత్సవంతులు అయిన యువతి యువకులు కావలెను కొత్త వారికి మరియు అనుభవం ఉన్నవారికి అవకాశం ఇవ్వబడును. రిపోర్టర్లుగా అపాయింట్మెంట్ అయిన తర్వాత వారికి లైన్ అకౌంట్ కూడా ఇవ్వబడును. సంప్రదించవలసిన ఫోన్ నెంబర్ 9959479375

సంపుటి : 01 సంచిక : 10 ప్రచురణ : తెలంగాణ, ఎడిటర్ : జె. భాస్కర్, శనివారం 04-01-2025 పేజీలు : 12 వెల : 2/-

- నాగపూర్-విజయవాడ కారిడార్ కోసం భూసేకరణ ప్రక్రియ చేపట్టాలన్న సీఎం
- అటవీ శాఖ పరిధిలోని సమస్యలను వెంటనే పరిష్కరించాలన్న సీఎం
- అటవీ శాఖ, ఆర్ అండ్ బీ శాఖలు సమన్వయంతో ముందుకు వెళ్లాలని సూచన
- ప్రభుత్వానికి ఆదాయం లేకుండా పోయింది...
- ప్రతి నెల వస్తోన్న రాబడి సరిపోవడం లేదు: సీఎం రేవంత్ రెడ్డి
- ప్రతి నెలా రూ.18,500 కోట్ల ఆదాయం వస్తోంది.. కనీస అవసరాలకే రూ.22,500 కోట్లు కావాలన్న సీఎం
- సమస్యల పరిష్కారానికి ధర్నాలే అవసరం లేదు... చర్చల ద్వారా పరిష్కారమవుతాయన్న సీఎం
- సర్వశిక్షా అభియాన్ కాంట్రాక్ట్ ఉద్యోగులను రెగ్యులరైజ్ చేసే అవకాశం లేదని స్పష్టీకరణ
- రెగ్యులరైజ్ కోసం పట్టుబడితే సమస్య పెరుగుతుందన్న సీఎం

## ఆర్ఆర్ఆర్ కోసం భూసేకరణ ప్రక్రియను వేగవంతం చేయాలి



హైదరాబాద్: రీజినల్ రింగ్ రోడ్డు (ఆర్ఆర్ఆర్) కోసం భూసేకరణ ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయాలని తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి ఈరోజు అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. సచివాలయంలో ఆర్ఆర్ఆర్, ఆర్ అండ్ బీ, నేషనల్ హైవే ప్రాజెక్టులపై సమీక్ష జరిపారు. ఈ సందర్భంగా రీజినల్ రింగ్ రోడ్డుపై అధికారులకు కీలక ఆదేశాలు జారీ చేశారు. నాగపూర్-విజయవాడ కారిడార్‌కు సంబంధించి రాష్ట్రంలో అసంపూర్తిగా మిగిలిన భూసేకరణ ప్రక్రియను సంక్రాంతి లోగా పూర్తి చేయాలన్నారు. అటవీ శాఖ పరిధిలో ఉన్న సమస్యలు వెంటనే పరిష్కారమయ్యేలా చూడాలన్నారు. అటవీ శాఖ, ఆర్ అండ్ బీ శాఖలు సమన్వయంతో ముందుకు వెళ్లాలని సూచించారు. సమన్వయం కోసం ఈ రెండు శాఖల నుంచి ఒక్కో అధికారిని ప్రత్యేకంగా నియమించాలన్నారు. ఈ రెండు శాఖలు సమావేశమై సంబంధిత శాఖల పరిధిలోని భూసేకరణ ప్రక్రియను త్వరగా పూర్తి చేయాలన్నారు.

తెలంగాణలోని ప్రతి మండల కేంద్రం నుంచి ఆ మండలంలోని గ్రామాలకు బీటీ రోడ్డు ఉండాలన్నారు. భవిష్యత్తు అవసరాలను దృష్టిలో పెట్టుకొని రోడ్డు వెడల్పు కార్యక్రమాలు డిజైన్ చేయాలన్నారు. ఈ రోడ్ల నిర్మాణాల కోసం విడతల వారీగా నిధులు విడుదల చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. రోడ్డు లేని గ్రామం ఉండవద్దన్నారు. ప్రభుత్వానికి ఆదాయం లేకుండా పోయిందని, ప్రతి నెల వస్తోన్న రాబడి సరిపోవడం లేదని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. రాష్ట్రంలో ఆర్థిక పరిస్థితిలో మార్పులు తీసుకురావడానికి కాస్త సమయం పడుతుందన్నారు. తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ డైరీ, క్యాలెండర్‌ను ఆయన ఆవిష్కరించారు.

ఈ సందర్భంగా మాట్లాడుతూ... కాంగ్రెస్ అధికారంలోకి రాగానే ఉద్యోగులకు ఒకటో తేదీనే వేతనాలు చెల్లిస్తున్నామన్నారు. ఆర్థిక పరిస్థితుల వల్ల కొన్ని సమస్యలను పరిష్కరించలేకపోతున్నామని తెలిపారు. ప్రభుత్వానికి ఆదాయం లేకుండా పోయిందని, దీంతో పలు సమస్యలు అపరిష్కృతంగా ఉంటున్నట్లు చెప్పారు.ప్రతి నెలా ప్రభుత్వానికి రూ. 18,500 కోట్ల ఆదాయం వస్తోందని, అది సరిపోవడం లేదన్నారు. కనీస అవసరాలకే ప్రతి నెల రూ. 22,500 కోట్లు కావాలన్నారు. ఆర్థిక పరిస్థితుల్లో మార్పులు తీసుకురావడానికి ఇంకాస్త సమయం పడుతుందన్నారు. ఉద్యోగుల సమస్యలను

మిగతా 2లో

## ఆప్ ఢిల్లీకి 'ఆపద': పిఎం మోడీ

- నా కోసం నేనో ఇల్లు కట్టుకోలేదనే విషయం దేశానికి తెలుసు: ప్రధాని మోదీ
- గత పదేళ్లలో పేదల కోసం 4 కోట్ల ఇళ్లు కట్టామన్న మోదీ
- మేం అద్దాల మేడలో ఉండటం లేదన్న ప్రధాని
- పదేళ్లుగా ఢిల్లీని ఓ విపత్తు చుట్టుకుందన్న ప్రధాని
- బీజేపీలోనే అసలైన విపత్తు ఉందన్న కేజ్రీవాల్



ఢిల్లీ: ప్రధాని నరేంద్ర మోడీ శుక్రవారం ఆప్‌ను ఢిల్లీకి 'ఆపద'గా దుయ్యబట్టారు. ఈ 'ఆపద' గడచిన పది సంవత్సరాలుగా దేశ రాజధానిని తన గుప్పిటిలోకి తీసుకున్నదని మోడీ ఆరోపించారు. దేశ రాజధానిలో గృహవసతి, విద్యా రంగాల్లోని ప్రాజెక్టులు సహా పలు లిక వసతుల ప్రాజెక్టులను ప్రారంభించిన అనంతరం ప్రజలను ఉద్దేశించి ప్రసంగించిన ప్రధాని మోడీ ఆప్ సారథ్యంలోని నగర ప్రభుత్వంపై విమర్శనాస్త్రాలు సంధించారు. ఆ పార్టీ పాలన కనుక కొనసాగినట్లయితే దేశ రాజధానిలో పరిస్థితి అధ్వానంగా మారుతుందని ఆయన అన్నారు. కేంద్రం ఒక వైపు ఎంతో కృషి చేస్తోందని, మరొక వైపు కేంద్రపాలిత ప్రాంత ప్రభుత్వం నిర్లజ్జగా అబద్ధాలు వల్లె వేస్తోందని మోడీ పేర్కొంటూ, పాఠశాల విద్య నుంచి కాలుష్య నివారణ, మద్యం వ్యాపారం వరకు పలు రంగాల్లో అవినీతికి పాల్పడుతోందని ఆరోపించారు. వచ్చే నెల నగరంలో అసెంబ్లీ ఎన్నికలు జరగనుండడంతో ఢిల్లీ ఈ 'ఆపద'పై పోరు ప్రారంభించిందని, దీని నుంచి విముక్తి పొందాలని నిశ్చయించిందని చెప్పారు.ఆప్ పరాజయానికి మోడీ పిలుపు ఇస్తూ, 'ఆపదను సహించబోం, దానిని తొలగిస్తాం' అని నినాదం చేశారు. 'ఈ ఏడాది జాతి నిర్మాణం, జన సంక్షేమం అనే కొత్త రాజకీయాలను తీసుకువస్తుంది. అందువల్ల ఆపదను తొలగించి, బిజెపిని అధికారంలోకి తీసుకురావలసి ఉంటుంది' అని అన్నారు. కేంద్రం ప్రధానంగా చేపట్టిన ఆరోగ్య బీమా పథకం ఆయుష్మాన్

మిగతా 2లో

## ప్రపంచ మార్కెట్ కైవసం చేసుకునే స్థాయికి తెలుగు సినీ పరిశ్రమ చేరడం గర్వకారణం: చంద్రబాబు

- హైదరాబాదులో ప్రపంచ తెలుగు సమాఖ్య మహాసభలు
- హాజరైన ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు
- గిడుగు రామ్మూర్తి, రామోజీరావు వంటి పెద్దలను స్మరించుకోవాలని వెల్లడి
- వివిధ రంగాల్లో తెలుగువారు బ్రహ్మాండంగా రాణిస్తున్నారని హర్షం



అమరావతి: హైదరాబాదులో ఏర్పాటు చేసిన ప్రపంచ తెలుగు సమాఖ్య మహాసభలకు ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన తన ప్రసంగంలో తెలుగు భాష ఔన్నత్యాన్ని, వివిధ రంగాల్లో తెలుగు వ్యక్తుల ఘనతలను కొనియాడారు. తెలుగు భాషాభివృద్ధి కోసం శ్రద్ధ పెట్టిన గిడుగు రామ్మూర్తి పంతులు గారిని, రామోజీరావు వంటి పెద్దలను ఒక్కసారి స్మరించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. వీరంతా తెలుగు భాష కోసం ఎంతో కృషి చేశారని అన్నారు. "రాజకీయాల్లో నీలం సంజీవరెడ్డి, పీవీ నరసింహారావు, జీఎంసీ బాలయోగి, వెంకయ్యనాయుడు... సుప్రీంకోర్టు సీజేఐగా

మిగతా 2లో

## మొదటి హామీ నీటి మీద రాతగా మిగిలిపోయింది : హరీష్‌రావు



హైదరాబాద్: ప్రజావాణిలో తమ సమస్యలు పరిష్కారమవుతాయని ఎంతో ఆశతో ఎన్నో వ్యయ ప్రయాసలకోర్చి హైదరాబాద్ వరకు వస్తే, ఆశలు అడియాసలవుతున్నాయని, పడ్డ శ్రమ వృథా అవుతున్నదని ప్రజలు వాపోతున్నారని మాజీ మంత్రి, బిఆర్ఎస్ ఎంఎల్ఎ హరీష్‌రావు విమర్శించారు. ముఖ్యమంత్రి క్యాంపు కార్యాలయంలో ప్రతిరోజూ ప్రజాదర్బార్ నిర్వహిస్తామని కాంగ్రెస్ అభయహస్తం మేనిఫెస్టోలో డబ్బా కొట్టారని, ఆ కార్యాలయంలో ప్రజా దర్బార్‌ను జరపకపోగా పేరు మార్చి ప్రజావాణిని చేశారని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ కేవలం ఒకే ఒక్కరోజు హాజరై, 10 నిమిషాల పాటు మాత్రమే ప్రజల నుంచి వినతులు స్వీకరించారని గుర్తు చేశారు. దీన్నిబట్టి ప్రజా దర్బార్ పట్ల ముఖ్యమంత్రి చిత్తశుద్ధి ఏపాటిదో తేటతెల్లమైపోయిందని ఎద్దేవా చేశారు. ఆర్.టి.ఐ. యాక్టు ద్వారా సేకరించిన సమాచారం ఆధారంగా మాజీ మంత్రి హరీశ్ రావు ఒక ప్రకటన

మిగతా 2లో



## అల్లు అర్జున్‌కు నాంపల్లి కోర్టులో భారీ ఊరట

హైదరాబాద్: టాలీవుడ్ స్టార్ హీరో అల్లు అర్జున్‌కు నాంపల్లి కోర్టు భారీ ఊరటను కల్పించింది. సంధ్య థియేటర్ తొక్కిసలాట కేసులో షరతులతో కూడిన రెగ్యులర్ బెయిల్ మంజూరు చేసింది. రూ. 50 వేల రెండు పూచీకత్తులు సమర్పించాలని ఆదేశించింది. రిమాండ్ ముగిసిన నేపథ్యంలో ఇటీవల జరిగిన కోర్టు విచారణకు అల్లు అర్జున్ వర్చువల్ గా హాజరయ్యారు. అదే రోజున రెగ్యులర్ బెయిల్ మంజూరు చేయాలని కోరుతూ ఆయన తరపు న్యాయవాదులు పిటిషన్ వేశారు. రెగ్యులర్ పిటిషన్‌పై విచారణ జరిపిన కోర్టు శుక్రవారం తీర్పును వెలువరించింది. బన్నీకి రెగ్యులర్ బెయిల్ మంజూరు

మిగతా 2లో

## గ్రీన్ ఎనర్జీ అభివృద్ధిలో దేశానికి ఆదర్శంగా తెలంగాణ



హైదరాబాద్: తెలంగాణ రాష్ట్రం గ్రీన్ పవర్ రంగంలో అద్భుత విజయాలను సాధించి, దేశవ్యాప్తంగా ఆదర్శంగా నిలుస్తోందని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు. తెలంగాణ రాష్ట్రం సాంకేతికత, ఫార్మాస్యూటికల్స్, ఉత్పత్తి, వ్యవసాయా రంగాల అభివృద్ధికి కేంద్రంగా ఉద్భవించి ందన్నారు. శుక్రవారం హైదరాబాద్ మాదాపూర్‌లోని హైటెక్స్‌లో మీడియాతో మాట్లాడారు. స్వచ్ఛమైన శక్తి వనరుల వినియోగంలో ముందంజ వేస్తూ, తెలంగాణ 11,399 గ్రీన్ పవర్ సామర్థ్యాన్ని సొంతం చేసుకుని, 2030 నాటికి 20,000 మెగావాట్ల లక్ష్యాన్ని చేరుకునే దిశగా ముందుకు సాగుతోందన్నారు. విస్తరిస్తున్న పట్టణ జనాభా అవసరాలను తీర్చే ఆకుపచ్చ,స్థిరమైన పట్టణ పర్యావరణ వ్యవస్థ రూపకల్పనకు ఫ్యూచర్ సిటీకి శ్రీకారం చుట్టామన్నారు. హైదరాబాద్ సమీపంలో అత్యాధునిక కృత్రిమ మేధస్సు, స్మార్ట్ టెక్నాలజీలతో ఏఐ సిటీ ద్వారా ఆధునిక నగర అభివృద్ధికి కృషి చేస్తున్నామని వివరించారు. తెలంగాణను గ్లోబల్ ఫార్మాస్యూటికల్ హబ్‌గా తీర్చిదిద్దుతూ, లైఫ్ సైన్సెస్ రంగంలో అగ్రగామిగా మార్చేలా ఫార్మాసిటీ ఏర్పాటవుతోందని చెప్పారు. మెరుగైన కనెక్టివిటీ కోసం నాల్గవ నగరం రీజినల్ రింగ్ రోడ్, మెట్రో రైలు విస్తరణ, , విమానాశ్రయం, పారిశ్రామిక కారిడార్‌తో రాష్ట్రాన్ని లాజిస్టిక్స్ పవర్‌హౌస్‌గా మారుస్తున్నాయని చెప్పారు.

**పునరుత్పత్తి శక్తి సామర్థ్యాలు :** ప్రస్తుత పునరుత్పత్తి శక్తి సామర్థ్యం 11,399

మిగతా 2లో




## వైద్య కోర్సుల సీట్లు ఖాళీగా ఉండిపోరాదు: సుప్రీం కోర్టు

## కెటిఆర్‌కు ఏసీబీ నోటీసులు



హైదరాబాద్ : ఫార్ములా ఈ రేస్ కారు రేసింగ్ కేసులో బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్‌కు అవినీతి నిరోధక శాఖ (ఎసిబి) అధికారులు నోటీసులు జారీ చేశారు. ఈ నెల 6వ తేదీ ఉదయం పది గంటలకు విచారణకు హాజరు కావాలని నోటీసుల్లో ఎసిబి అధికారులు పేర్కొన్నారు. ఫార్ములా ఈ రేస్ కారు రేసింగ్ కేసులో ఎసిబి ఇప్పటికే కెటిఆర్‌ను ఎ1 నిందితుడిగా చేరుస్తూ ఎఫ్ఐఆర్ నమోదు చేసింది. అయితే ఇదే కేసులో

మిగతా 2లో

## రైతులను నట్టేట ముంచిన ప్రభుత్వమిది : కిషన్‌రెడ్డి



హైదరాబాద్: రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక కాంగ్రెస్ నేతల్లో మార్పు వచ్చింది తప్ప, తెలంగాణ ప్రజల జీవితాల్లో ఎలాంటి మార్పు రాలేదని బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి జి.కిషన్ రెడ్డి మండిపడ్డారు. ప్రజా ప్రభుత్వం కాదు, ప్రజలను మోసం చేసే ప్రభుత్వమని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. హైదరాబాద్‌లోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో

మిగతా 2లో

సత్యమేవ జయతే బార్‌కోడ్

# ఆప్ ఢిల్లీకి 'ఆపద': పిఎం మోడీ

భారత్. ఇతర కార్యక్రమాల అమలును నగర ప్రభుత్వం అనుమతించని కారణంగా తాను ఎంతగా ప్రయత్నించినప్పటికీ ఇక్కడ నివసించే ప్రజలకు పూర్తిగా సాయంచేయలేకపోతున్నట్లు చెప్పారు. రాజధానిలో రహదారుల నిర్మాణం జరుగుతోందంటే, ఢిల్లీ అభివృద్ధి ప్రాధికార సంస్థ (డిడిఎ) నిరుపేదలకు ఇళ్లు సమకూర్చగలుగుతోందంటే, ఈ రంగాల్లో 'ఆపద'కు అంతగా పాత్ర లేకపోవడమే కారణం అని ఆయన అన్నారు. ఢిల్లీ మాజీ ముఖ్యమంత్రి, ఆప్ అధిపతి అర్వింద్ కేజ్రీవాల్‌ను మోడీ తూర్పారపడుతూ, తాను తన కోసం 'అద్దాల మేడ' కట్టుకునేవాడినే అని, కానీ తన కల దేశంలో ప్రతి ఒక్కరికీ ఇల్లు సమకూరాలనేదే అని తెలిపారు. 'ఈ వ్యక్తులు అవినీతికి పాల్పడుతూ, దానిపై గప్పాలు కొడుతుంటారు' అని మోడీ పేర్కొంటూ,ఆప్‌ది సిగ్గులేనితనం అని, తప్పుడు వాగ్దానాలు చేస్తుంటుందని ఆరోపించారు,. కేజ్రీవాల్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు తన అధికార నివాసంపై భారీ మొత్తం వెచ్చించారని బిజెపి ఆరోపిస్తోంది.

ఆయన పూర్వపు ఇంటిని 'అద్దాల మేడ'గా బిజెపి అభివర్ణించింది. తాను తన కోసం ఎన్నడూ ఇల్లు నిర్మించుకోలేదని దేశానికి బాగా తెలుసు అని మోడీ చెప్పారు. 'గడచిన పది సంవత్సరాల్లో నా ప్రభుత్వం పేదల కోసం నాలుగు కోట్ల ఇళ్లు నిర్మించి, వారి కలలు నెరవేర్చింది. నేనూ ఒక అద్దాల మేడ నిర్మించుకుని ఉండేవాడినే. కానీ నా కల నా దేశవాసులకు పక్కా ఇల్లు సమకూర్చాలనేదే' అని ఆయన చెప్పారు. మురికివాడల్లో నివసిస్తున్న వారికి కాంక్రీట్ ఇల్లు సమకూర్చడం తన లక్ష్మని ప్రధాని మోడీ స్పష్టం చేశారు. 2025 భారత్‌కు కొత్త అవకాశాలు పెక్కింటిని తీసుకువస్తుందని ఆయన సూచించారు. దేశం ప్రపంచంలో రాజకీయ, ఆర్థిక సుస్థిరతకు ప్రతీకగా మారిందని మోడీ స్పష్టం చేశారు. భారత్ కొత్త సంవత్సరంలో బడా ఉత్పత్తి కేంద్రంగా మారుతుందని, వ్యవసాయ రంగంలో కొత్త రికార్డులు నెలకొంటాయని,

మహిళల సారథ్యంలో అభివృద్ధి కూడా నమోదు అవుతుందని ఆయన సూచించారు. ప్రపంచంలో భారత్ స్థానం, ప్రతిష్ఠ కూడా 2025లో పటిష్ఠం అవుతాయని ప్రధాని ఉద్ఘాటించారు. మధ్య తరగతి ప్రజలకు సొంత ఇల్లు ఉండేలా చూసేందుకు ప్రభుత్వం ఇంటి రుణం వడ్డీ రేటులో భార రిబేట్ ఇస్తోందని ఆయన తెలియజేశారు. విద్యా రంగంలో మౌలిక వసతుల పెంపునకు కేంద్రం చేస్తున్న కృషి గురించి కూడా మోడీ ప్రధానంగా ప్రస్తావించారు. మోడీ పలు అభివృద్ధి ప్రాజెక్టులను ప్రారంభించారు. మోదీ తన కోసం ఇల్లు కట్టుకోలేదన్న విషయం దేశం మొత్తానికి తెలుసని, కానీ గత పదేళ్లలో పేదల కోసం 4 కోట్ల ఇళ్లు నిర్మించి వారి కలలను సాకారం చేశామని ప్రధాని నరేంద్రమోదీ అన్నారు. ఈరోజు ఢిల్లీ డెవలప్‌మెంట్ అథారిటీ ఆధ్వర్యంలో నిర్మించిన పలు నివాస సముదాయాలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... తాము నాలుగు కోట్ల మందికి ఇళ్లు కట్టించామని... కానీ తానేమీ అద్దాల మేడలో ఉండటం లేదన్నారు.

ఢిల్లీ ప్రజలకు సౌకర్యాలు కల్పించడంలో ఆమ్ ఆద్మీ ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. ఈ ప్రభుత్వం లిక్కర్, స్కూల్, పొల్యూషన్ స్కాంలకు పాల్పడిందని విమర్శించారు. బహిరంగంగానే అవినీతికి పాల్పడుతున్నారన్నారు.

గత పదేళ్లుగా ఢిల్లీని ఓ విపత్తు చుట్టుముట్టిందని ఆమ్ ఆద్మీ పార్టీని ఉద్దేశించి అన్నారు. ఇప్పుడు ప్రజలు ఆ విపత్తుకు వ్యతిరేకంగా పోరాడేందుకు సిద్ధమయ్యారని వ్యాఖ్యానించారు.

**బీజేపీలోనే అసలైన విపత్తు: కేజ్రీవాల్**

అసలైన విపత్తు బీజేపీలోనే ఉందంటూ ప్రధాని మోదీకి మాజీ సీఎం, ఆమ్ ఆద్మీ పార్టీ అధినేత అరవింద్ కేజ్రీవాల్ కౌంటర్ ఇచ్చారు. ఢిల్లీలో విపత్తు లేదని, బీజేపీలోనే ఉందన్నారు. అసలు బీజేపీకి ఢిల్లీలో సీఎం అభ్యర్థి లేరని, ఆ పార్టీకి ఎలాంటి విజన్ లేదని, ఢిల్లీ ఎన్నికలకు సంబంధించి ఆ పార్టీకి అసలు అజెండానే లేదని కేజ్రీవాల్ మూడు పాయింట్లతో విమర్శలు గుప్పించారు. వేల కోట్లతో భవనం నిర్మించుకున్న వ్యక్తి... వేల కోట్లతో విమానంలో తిరిగే వ్యక్తి... లక్షల విలువ చేసే సూట్ ధరించే వ్యక్తి నుంచి అద్దాల మేడ ప్రస్తావన రావడం విడ్డూరంగా ఉందన్నారు.

# ప్రపంచ మార్కెట్ కైవసం చేసుకునే స్థాయికి తెలుగు సినీ పరిశ్రమ చేరడం గర్వకారణం: చంద్రబాబు

జస్టిస్ కోకా సుబ్బారావు, జస్టిస్ ఎన్వీ రమణ వంటి తెలుగు వారు తమ పదవుల్లో రాణించారు. ఇవాళ తెలుగు వారు అన్ని రంగాల్లో దూసుకుపోతున్నారు. క్రీడల్లో కరణం మల్లీశ్వరితో ప్రారంభమైన ప్రస్థానం... పుల్లెల గోపీచంద్, ద్రోణవల్లి హారిక, వీవీఎస్ లక్ష్మణ్, వెంకటపతిరాజు, పీవీ సింధు, పెంటేల హరికృష్ణ, కోనేరు హంపి, మొన్ననే సెంచరీ కొట్టిన నితీశ్ కుమార్ రెడ్డి వరకు ఎంతోమంది తెలుగువారు క్రీడల్లో బ్రహ్మాండంగా రాణిస్తున్నారు.

మరోవైపు... మొన్నటివరకు చెన్నైలో ఉన్న తెలుగు చిత్ర పరిశ్రమను హైదరాబాదుకు తీసుకురావాలని మేమంతా ప్రయత్నాలు చేశాం. ఇవాళ తెలుగు ఫిలిం ఇండస్ట్రీని చూస్తే భారతదేశంలోనే నెంబర్ వన్ చిత్ర పరిశ్రమగా తయారైంది. ప్రపంచ మార్కెట్ ను కైవసం చేసుకునే స్థాయికి తెలుగు చిత్ర పరిశ్రమ చేరుకోవడం మనందరికీ గర్వకారణం. కూచిపూడి నృత్యం గురించి చెప్పుకోవాల్సి వస్తే... ఆ కళా రూపం మన సొంతం. ఎన్నో ఏళ్లుగా తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాల్లో భాగంగా ఉన్న బతుకమ్మ కూడా ఇలాంటిదే.

పొట్టి శ్రీరాములు సంకల్పం మనలో ఉంది... టంగుటూరి ప్రకాశం పంతులు గుండె ధైర్యం మనలో ఉంది... అల్లూరి సీతారామరాజు పౌరుషం మనలో ఉంది... ఎన్టీఆర్ ఆత్మాభిమానం మనలో ఉంది... పీవీ నరసింహారావు చాణక్యనీతి, తెలివితేటలు మనలో ఉన్నాయి... ఇవన్నీ ఉండగా నా ఆకాంక్ష ఒక్కటే. 2047 నాటికి ప్రపంచంలో నెంబర్ వన్ కమ్యూనిటీ ఏదంటే... దానికి చిరునామాగా తెలుగు జాతి ఉండాలనేదే నా ఆకాంక్ష. అది జరగాలంటే ఒక సంకల్పం ఉండాలి. అందుకోసం కృషి చేయాలి.

ఒకప్పుడు హార్డ్ వర్క్ చేసేవారు... కానీ ఇప్పుడు స్మార్ట్ వర్క్ చేయాలి. ఒకప్పుడు కష్టపడి పనిచేయాలని చెప్పేవారు. కానీ ఇప్పుడు టెక్నాలజీ వచ్చింది... స్మార్ట్ గా పనిచేస్తే ఏదైనా సాధ్యమే అని చెబుతున్నా. టెక్నాలజీ వల్ల నష్టాలు ఉన్నాయి, దీని వల్ల మానవ సంబంధాలు కూడా దెబ్బతింటున్నాయని చాలామంది అంటున్నారు. అయితే టెక్నాలజీని సరైన రీతిలో ఉపయోగిస్తే ప్రపంచాన్ని కూడా శాసించే శక్తి వస్తుంది. అదే టెక్నాలజీకి బానిసగా మారి, దుర్వినియోగం చేస్తే పిచ్చి పట్టే పరిస్థితి వస్తుంది! ఇటువంటి పరిస్థితుల్లో ప్రపంచ తెలుగు సమాఖ్య మహాసభలను ఏర్పాటు చేయడాన్ని అదృష్టంగా భావిస్తున్నాను. భగవంతుడు నాకు ఎంత శక్తి ఇస్తాడో అంత శక్తినీ ఉపయోగించి... తెలుగుజాతిని నెంబర్ వన్ చేసేందుకు ఏమేం చేయాలో అవన్నీ చేస్తాను. తెలుగు జాతి అంతా ఒక్కటే... మనకు విభేదాల్లేవు. అన్ని విషయాల్లో తెలుగు వారు సమష్టిగా దూసుకుపోవాలని ఆకాంక్షిస్తున్నాను. ఇలాంటి మహాసభల వల్ల మనలో ఉన్న సంకల్పం పట్ల పునరంకితం అయ్యేందుకు అవకాశం ఏర్పడుతుంది" అని చంద్రబాబు వివరించారు.

# మొదటి హామీ నీటి మీద రాతగా మిగిలిపోయింది:హరీష్‌రావు

విడుదల చేశారు. కొండంత ఆశలు రేపి, గోరంత కూడా న్యాయం చేయక గోళ్లు గిల్లుకుంటున్నారని విమర్శించారు. మొత్తం మీద సోకాల్డ్ ప్రజాపాలన ప్రజా పీడనగా మారిందని, ప్రజావాణి ఉత్త ప్రహసనం మాత్రమే అని తేలిపోయిందని అన్నారు.

మొదటి హామీ నీటి మీద రాతగా మిగిలిపోయింది : మేనిఫెస్టోలోని మొదటి హామీ నీటి మీద రాతగా మిగిలిపోయిందని విమర్శించారు. మంత్రులు అందుబాటులో ఉంటారని మాట మార్చారు.. ఆ మాటా నిలబెట్టుకోలేదని చెప్పారు. మంత్రులకు గాంధీభవన్‌కు వెళ్లేందుకు ఉన్న తీరిక, ప్రజావాణికి రావడానికి మాత్రం ఉండటం లేదని ఆరోపించారు. దీంతో ప్రజావాణి పట్ల మంత్రుల చిత్తశుద్ధి ఏపాటిదో కూడా తేటతెల్లమైపోయిందని పేర్కొన్నారు. ముఖ్యమంత్రీ రాక, మంత్రులూ రాక, చివరకు ఔట్ సోర్సింగ్ ఉద్యోగులతో తూతూ మంత్రంగా ప్రజావాణి నిర్వహిస్తున్నారని అన్నారు. ప్రతినిత్యం నిర్వహిస్తామని మేనిఫెస్టోలో పేర్కొని, కడహీనంగా వారానికి రెండు రోజులు మాత్రమే నిర్వహిస్తున్నారని విమర్శించారు. ఆ రెండు రోజుల ప్రజావాణికి రావడం, దరఖాస్తులు సమర్పించుకోవడం ఉత్త వృథా ప్రయాసే అవుతున్నదని జనం వాపోతున్నారని పేర్కొన్నారు. ప్రజావాణికి 2024 డిసెంబర్ 9 నాటికి 82 వేల 955 పిటిషన్లు వచ్చినట్లు అధికారులు చెబుతున్నారు.

అయితే, అందులో కేవలం 43 వేల 272 పిటిషన్లు మాత్రమే గ్రీవెన్సెస్ కిందకు వస్తాయని మిగతావి గ్రీవెన్సెస్ పరిధిలోకి రావంటున్నారని చెప్పారు. ఫిర్యాదు, అన్యాయం, హక్కులకు భంగం, ప్రభుత్వ పథకాలు అందకపోవడం, అధికారులు వారి విధులు నిర్వహించకపోవడం, ప్రజలకు సిటిజన్ చార్టర్ ప్రకారం అందవలసిన సదుపాయాలు అందకపోవడం%ß% వీటినే గ్రీవెన్సెస్ కింద పరిగణిస్తామని అధికారులు గ్రీవెన్సెస్‌కు నిర్వచనం ఇచ్చారని అన్నారు. ఈ నిర్వచనం ప్రకారం భూ తగాదాలు గానీ, భూ నిర్వాసితుల సమస్యలు గానీ, నిరుద్యోగుల సమస్యలు గానీ, వివిధ వర్గాల పేదరిక సంబంధ సమస్యలు గానీ, ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల అమలు మొదలైన విషయాలు గ్రీవెన్సెస్ కిందకు రావంటూ సగం దరఖాస్తులను అధికారులు తిరస్కరించేశారని తెలిపారు. గ్రీవెన్స్ పరిధిలోకి రావని 50 శాతం ప్రజావాణి పిటిషన్లను అధికారులు తిరస్కరించినట్లు ఆర్.టి.ఐ. కింద ఇచ్చిన సమాచారం ద్వారా వెల్లడైందని అన్నారు. ప్రజావాణికి వచ్చిన మొత్తం 82 వేల 955 పిటిషన్లలో.. గ్రీవెన్సెస్‌గా గుర్తించినవి 43 వేల 272 మాత్రమే అని, వీటిని పరిష్కారం కోసం సంబంధిత అధికారులకు పంపించడం జరుగుతుందని తెలిపారని పేర్కొన్నారు. అలా పంపిన 43,272 గ్రెవెన్సులలో 27,215 మాత్రమే పరిష్కారానికి నోచుకున్నాయని చెబుతున్నారని, అయితే, 27,215 గ్రీవెన్సులు పరిష్కరించినట్లు అధికారులు చెబుతున్నప్పటికీ అది నిజం కాదని తెలిపారు. చాలా సమస్యలను పరిష్కరించకుండానే ఫైళ్లను క్లోజ్ చేశారని క్షేత్రస్థాయిలో ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నాయని వెల్లడించారు. సమస్య పరిష్కారం కాలేదని చెబుతున్నా వినిపించుకోకుండా, ఫైల్ క్లోజ్ చేశారని జనం ఆవేదన వ్యక్తం చేస్తున్నారని హరీష్‌రావు తెలిపారు.

# అల్లు అర్జున్‌కు నాంపల్లి కోర్టులో భారీ ఊరట

కావడంతో ఆయన కుటుంబ సభ్యులు, అభిమానులు ఊపిరి పీల్చుకున్నారు.

**అల్లు అర్జున్ బెయిల్ పై న్యాయవాది అశోక్ రెడ్డి కీలక వ్యాఖ్యలు**

అల్లు అర్జున్‌కు నాంపల్లి కోర్టు రెగ్యులర్ బెయిల్ మంజూరు చేయడంపై న్యాయవాది అశోక్ రెడ్డి మాట్లాడుతూ పలు కీలక వ్యాఖ్యలు చేశారు. ఈ సందర్భంగా ఆయన అల్లు అర్జున్‌కు కోర్టు షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేసిందని, రూ.50 వేల పూచికత్తుతో ఇద్దరు సాక్షి సంతాలతో కూడిన బాండ్‌ను కోర్టుకు సమర్పించాలని చెప్పినట్లు వెల్లడించారు.

అంతేగాక ప్రతీ ఆదివారం చిక్కడపల్లి పోలీసుల ఎదుట హాజరు కావాల్సి ఉంటుందని, కేసు ముగిసే వరకు విచారణకు పూర్తిగా సహకరించాల్సి ఉంటుందని కోర్టు సాధారణ షరతులు విధించినట్లు తెలిపారు. ఇక ఈ కేసులో చనిపోయిన రేవతిది ఉద్దేశపూర్వకంగా చేసిన హత్య కాదని కోర్టు నిర్ధారించిందని, అందకే బెయిల్ మంజూరు చేసిందని చెప్పారు. అలాగే అల్లు అర్జున్ క్వాష్ పిటిషన్ హైకోర్టులో ఉందని, దీనిపై ఈ నెల 21న విచారణ జరుగనుందన్నారు. అల్లు అర్జున్ క్వాష్ పిటిషన్ సక్సెస్ అవుతుందనే నమ్మకం ఉందని న్యాయవాది ఆశాభావం వ్యక్తం చేశారు.

**బెయిల్‌ను వ్యతిరేకించని పోలీసులు**

పుష్ప2 ప్రీమియర్ సందర్భంగా సంధ్య థియేటర్‌లో తొక్కిసలాట ఘటన జరిగింది. ఈ ఘటన తర్వాత చిక్కడపల్లి పోలీసులు అల్లు అర్జున్‌ను ఎ11గా చేర్చుతూ కేసు నమోదు చేశారు. వారం రోజుల తర్వాత అరెస్టు చేశారు. అప్పటికే అల్లు అర్జున్ హైకోర్టులో క్వాష్ పిటిషన్ దాఖలు చేశారు. అరెస్టు చేసిన రోజునే హైకోర్టు నాలుగు వారాల మధ్యంతర బెయిల్ ఇవ్వడంతో అల్లు అర్జున్‌కు ఊరట లభించింది. రెగ్యు లర్ బెయిల్ కోసం దిగువ కోర్టులో పిటిషన్ వేసుకోవాలని సూచించింది.

గత వారం అల్లు అర్జున్ తరపు లాయర్లు రెగ్యులర్ బెయిల్ కోసం పిటిషన్ దాఖలు చేశారు. వాదనలు కూడా పూర్తయిన తర్వాత తీర్పును రిజర్వ్ చేశారు. పోలీసులు అల్లు అర్జున్ బెయిల్ పై దాఖలు చేసిన అఫిడవిట్ లో బెయిల్‌ను వ్యతిరేకించలేదు. ఒక వేళ బెయిల్ ఇస్తే మాత్రం విచారణకు సహకరించేలా ఆదేశాలు ఇవ్వాలని నాంపల్లి కోర్టును కోరారు.

దీంతో అల్లు అర్జున్ కు బెయిల్ రావడం సులభంగా మారిందని న్యాయవర్గాలు చెబుతున్నాయి. అల్లు అర్జున్ కు రెగ్యులర్ బెయిల్ లభించడంతో టాలీవుడ్ ఊపిరి పీల్చుకుంది.

**ఇక వివాదం సద్దుమణిగినట్లే..!**

అల్లు అర్జున్ వ్యవహారం టాలీవుడ్‌లో సంచలనం సృష్టించింది. సినీ పరిశ్రమను ప్రభుత్వం టార్గెట్ చేస్తోందన్న ఆరోపణలు వచ్చాయి. ఈ వ్యవహారంలో అల్లు అర్జున్ వ్యవహారశైలిపైనా విమర్శలు వచ్చాయి. అయితే తర్వాత సినీ ప్రముఖులంతా ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ దిల్ రాజు నేతృత్వంలో సిఎంను కలవడంతో చాలా వరకూ సమస్యలు పరిష్కారమయ్యాయని భావిస్తున్నారు. సంధ్యా థియేటర్ తొక్కిసలాటలో నష్టపోయిన కుటుంబానికి సినీ ఇండస్ట్రీ నుంచి భారీ సాయం అందింది. పుష్ప టీం రూ. రెండు కోట్ల వరకూ ఇచ్చింది.

## వైద్య కోర్సుల సీట్లు ఖాళీగా ఉండిపోరాదు: సుప్రీం కోర్టు

**న్యూఢిల్లీ:** వైద్య కోర్సులలో సీట్లు ఖాళీగా ఉండిపోరాదని సుప్రీం కోర్టు శుక్రవారం స్పష్టం చేసింది. రాష్ట్రాలతో సహా సంబంధిత సంస్థలో సమావేశం నిర్వహించాలని, ఈ అంశంపై నియమించిన కమిటీ సిఫార్సులను పరిశీలించాలని కేంద్రాన్ని సుప్రీం కోర్టు కోరింది. న్యాయమూర్తులు బిఆర్ గవాయ్, కెవి విశ్వనాథన్‌తో కూడిన ధర్మాసనం ఈ వ్యవహారంపై విచారణ నిర్వహిస్తూ, 'సీట్లు ఖాళీగా ఉండిపోకూడదు' అని వ్యాఖ్యానించింది. వైద్య కోర్సులలో సూపర్ స్పెషాలిటీ సీట్లు ఖాళీగా ఉండిపోతున్న అంశాన్ని సర్వోన్నత న్యాయస్థానం 2023 ఏప్రిల్‌లో ప్రస్తావించింది. ఈ సమస్య పరిష్కారానికి ఆరోగ్య సర్వీసుల డైరెక్టర్‌జనరల్ సారథ్యంలో రాష్ట్రాలు, ప్రైవేట్ వైద్య కళాశాలల ప్రతినిధులతో సహా సంబంధిత వ్యక్తులు అందరితో ఒక కమిటీని నియమించాలని కేంద్రం అప్పట్లో ప్రతిపాదించింది. సంబంధిత వ్యక్తులతో కమిటీని ఏర్పాటు చేసినట్లు, కమిటీ ఈ అంశంపై తన సిఫార్సులు అందజేసినట్లు కేంద్రం న్యాయవాది శుక్రవారం వెల్లడించారు. కేంద్రం సంబంధిత వ్యక్తులతో సమావేశం నిర్వహించి, పటిష్ఠమైన ప్రతిపాదనతో వస్తే సముచితంగా ఉంటుందని న్యాయవాది సూచించారు.

దానితో కేంద్రం అటువంటి సమావేశాన్ని ఏర్పాటు చేయాలని బెంచ్ ఆదేశించింది. అవసరమైన చర్యలను మూడు నెలల్లోగా తీసుకోవాలని సర్వోన్నత న్యాయస్థానం సూచించి, ఈ అంశంపై తదుపరి విచారణను ఏప్రిల్‌లో నిర్వహిస్తామని తెలియజేసింది. విలువైన 1003 సూపర్ స్పెషాలిటీ సీట్లకు అడ్మిషన్లు ఏవీ జరగనందున అవి వ్యర్థం అవుతుండడం 'అత్యంత శోచనీయం' అని సర్వోన్నత న్యాయస్థానం 2023 ఏప్రిల్‌లో వ్యాఖ్యానించింద. 'ఒక వైపు సూపర్ స్పెషాలిటీ వైద్యుల కొరతను ఎప్పుడూ ఎదుర్కొంటున్నాం, మరొక వైపు ఆ విలువైన సీట్లు భర్తీ కాకుండా ఉండిపోతున్నాయి' అని కోర్టు పేర్కొన్నది.

# గ్రీన్ ఎనర్జీ అభివృద్ధిలో దేశానికి ఆదర్శంగా తెలంగాణ

మెగావాట్లు, 7,889 మెగావాట్ల సౌరశక్తి,,2,518 మెగావాట్ల జలశక్తి, 771 మెగావాట్ల పంపిణీ పునరుత్పత్తి శక్తి, 221 మెగావాట్ల ఇతర పునరుత్పత్తి శక్తి (128 మెగావాట్లు పవన శక్తి), శ్రీశైలం, నాగార్జునసాగర్ వంటి ప్రాజెక్టుల్లో పంప్డ్ స్టోరేజ్ వున్నాయని, ఫ్లోటింగ్ సోలార్ ప్రాజెక్టులు, గ్రీన్ హైడ్రోజన్ టెక్నాలజీ వంటి ఆధునిక పరిష్కారాలు పరిశీలనలో ఉన్నాయన్నారు. 54,717 మెగావాట్ల గాలివస్తు సామర్థ్యం కలిగి, దేశంలో టాప్–8 రాష్ట్రాలలో ఒకటిగా నిలుస్తోంది. విద్యు వాహన అభివృద్ధి, 872 ఈవీ ఛార్జింగ్ స్టేషన్లు ఇప్పటికే అందుబాటులో ఉన్నాయి. 2024లో గరిష్ట విద్యుత్ డిమాండ్ 15,623 మెగా వాట్ల నుండి, 2030 నాటికి 24,215 మెగావాట్లు, 2035 నాటికి 31,809 మెగావాట్ల వరకు పెరుగుతుందని అంచనా వేస్తున్నామన్నారు.

2030 నాటికి 20వేల మెగావాట్ల లక్ష్యం : ఈ డిమాండ్‌ను నెరవేర్చేందుకు స్వచ్ఛమైన, నమ్మదగిన, సరసమైన, స్థిరమైన శక్తి వనరులు ముఖ్యమైనవని చెప్పారు. తెలంగాణ 54,717 మెగావాట్లకు పైగా గాలివస్తు సామర్థ్యాన్ని కలిగి ఉందని, అదనంగా, 300 సూర్యకాంతి రోజులతో రాష్ట్రం ఫోటోవోల్టిక్ సోలార్ ప్రాజెక్టులకు అనుకూలమైన ప్రాంతంగా నిలుస్తోందన్నారు. ఈ క్రమంలో రాష్ట్ర ప్రభుత్వం ఫ్లోటింగ్ సోలార్ ప్రాజెక్టులు, గ్రీన్ హైడ్రోజన్ టెక్నాలజీ, పంప్డ్ స్టోరేజ్ వంటి ఆధునిక పద్ధతులను ప్రోత్సహిస్తోందని వివరించారు. విద్యుత్ వాహన ఛార్జింగ్ స్టేషన్ల సంఖ్య ప్రస్తుతం 872కి చేరుకుందని, పారిశ్రామికవేత్తలకు పన్ను మినహాయింపులు, చెల్లింపుల సబ్సిడీలు వంటి ప్రోత్సాహకాలు అందించడం ద్వారా పెట్టుబడిదారులను ఆకర్షిస్తోందని తెలిపారు. అంతేకాక, వ్యర్థాలను శక్తిగా మార్చడం వంటి ప్రాజెక్టులను కూడా ప్రభుత్వం ముందుకు తీసుకెళుతోందని చెప్పారు.

ప్రజలకు అందుబాటులో విద్యుత్ : తెలంగాణ ప్రభుత్వ లక్ష్యం ప్రజల జీవితాలను మెరుగుపరచడంతో పాటు శక్తి వినియోగంలో ప్రజల భాగస్వామ్యాన్ని పెంచడం. ఈ క్రమంలో రాష్ట్రం మౌలిక సదుపాయాల అభివృద్ధిపై దృష్టి పెట్టిందని భట్టి విక్రమార్క అన్నారు. తెలంగాణ పునరుత్పత్తి శక్తి రంగంలో ఇతర రాష్ట్రాల కంటే ముందంజలో ఉందని, ఈ రంగంలో రాష్ట్రం అనుసరిస్తున్న విధానాలు దేశంలోని పలు రాష్ట్రాలకు ఆదర్శంగా మారాయన్నారు. ప్రస్తుత పునరుత్పత్తి శక్తి ప్రాజెక్టుల ద్వారా వేలాది కోట్ల పెట్టుబడులు రాష్ట్రానికి వచ్చాయని, ఈ రంగంలో మరిన్ని పెట్టుబడులను ఆకర్షించడానికి రాష్ట్రం సుస్పష్టమైన విధానాలను అమలు చేస్తోందన్నారు. 2030 నాటికి 20వేల మెగావాట్ల సామర్థ్యాన్ని చేరుకోవడం మాత్రమే కాకుండా, తెలంగాణ గ్రీన్ ఎనర్జీ హబ్‌గా మారాలని ప్రభుత్వం దృఢ నిశ్చయంతో ఉందని తెలిపారు. తెలంగాణ పునరుత్పత్తి శక్తి రంగంలో సాధిస్తున్న ఈ అద్భుత విజయాలు రాష్ట్ర అభివృద్ధిని వేగవంతం చేస్తూ శక్తి వినియోగంలో స్వచ్ఛమైన మార్గాలను అనుసరించి దేశానికే ఒక దిశానిర్దేశం అందిస్తున్నాయని వివరించారు.

## ఆర్ఆర్ఆర్ కోసం భూసేకరణ ప్రక్రియను వేగవంతం చేయాలి

అర్థం చేసుకొని పరిష్కరిస్తామన్నారు. సమస్యల పరిష్కారానికి ధర్నాలే చేయాల్సిన అవసరం లేదన్నారు. చర్చల ద్వారానే సమస్యలు పరిష్కారమవుతాయని తెలిపారు. రాజకీయాల కోసం కొందరు నిరసనలను, ధర్నాలను ప్రేరేపిస్తున్నారని ఆరోపించారు. రాజకీయ నేతల ఉచ్చులో పడితే చివరకు నష్టపోయేది ఉద్యోగులే అన్నారు. ఒప్పంద ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలని ఉన్నప్పటికీ చేయలేని పరిస్థితులు నెలకొన్నాయన్నారు. సర్వశిక్షా అభియాన్ ఔట్ సోర్సింగ్ ఉద్యోగులను రెగ్యులరైజ్ చేసే అవకాశం లేదన్నారు. నిబంధనలకు విరుద్ధంగా రెగ్యులరైజ్ చేస్తే కోర్టుల్లో సమస్యలు ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు. అవకాశం లేకపోయినప్పటికీ రెగ్యులరైజ్ కోసం పట్టుబడితే సమస్య పెరుగుతుంది తప్ప పరిష్కారం కాదని గుర్తించాలన్నారు.

## కెటిఆర్‌కు ఏసీబీ నోటీసులు

మాజీ మంత్రి కెటిఆర్‌కు ఇడి అధికారులు కూడా నోటీసులు జారీ చేశారు. ఈ నెల 7వ తేదీన విచారణకు హాజరు కావాలని నోటీసుల్లో పేర్కొన్నారు. అయితే 7వ తేదీన ఇడి అధికారుల ఎదుట హాజరు కావాల్సి ఉన్న సమయంలో ఎసిబి అధికారులు ఒకరోజు ముందు నోటీసులు జారీ చేసి విచారణకు పిలవడం చర్చనీయాంశమైంది.

**ఎసిబి దర్యాప్తు ముమ్మరం...** ఫార్ములా ఈ రేస్ కేసులో దర్యాప్తును ఎసిబి ముమ్మరం చేసింది. తెలంగాణ మున్సిపల్ శాఖ, ఫార్ములా ఈ ఆపరేషన్స్ లిమిటెడ్ (ఎఫ్ఈవో)ల మధ్య జరిగిన ఒప్పందం, అందులో చోటుచేసుకున్న ఉల్లంఘనలపై అధ్యయనం చేస్తోంది. ఈ క్రమంలోనే కేసు ఫిర్యాదుదారు ఎంఏయూడీ(పురపాలక శాఖ) ముఖ్య కార్యదర్శి దానకిశోర్ నుంచి పలు విడతలుగా ఎసిబి సమాచారం సేకరించింది. ఇటీవల దానకిశోర్ నుంచి సుమారు ఏడు గంటల పాటు విచారించిన ఎసిబి పలు వివరాలను తీసుకుంది. వాటి ఆధారంగా దర్యాప్తును ముందుకు తీసుకెళ్లే పనిలో ఉంది. ఈ క్రమంలో కెటిఆర్‌కు నోటీసులు జారీ చేసింది.ప్రాథమిక దర్యాప్తు క్రమంలో ఎంఏయూడీ నుంచి సేకరించిన సమాచారం ఆధారంగా ఒప్పందంలో చోటు చేసుకున్న పలు కీలక ఉల్లంఘనలను ఎసిబి ఇప్పటికే గుర్తించినట్లు తెలుస్తోంది. వీటి కేంద్రంగా నిందితులను విచారించే అవకాశం కనిపిస్తోంది. విశ్వసనీయ సమాచారం ప్రకారం%ß%హైదరాబాద్‌లో ఫార్ములా ఈ రేస్‌ను నిర్వహించేందుకు తెలంగాణ ప్రభుత్వానికి,

లండన్ ఎఫ్ఈవోల మధ్య 2022 జనవరిలోనే ఒప్పందం కుదిరిందని, సంబంధిత దస్త్రం ఎంఏయూడీలో ఇప్పుడు అందుబాటులో లేదని గుర్తించినట్లు సమాచారం. అదే ఏడాది జులై 11న జారీ చేసిన జీవోలో మాత్రం లెటర్ ఆఫ్ ఇంటెంట్ గురించి ప్రస్తావన ఉన్నట్లు వెల్లడైంది. రేసు నిర్వహణకు సంబంధించి అధికారిక ఒప్పందంపై సంతకం చేయడానికి ముందే ఆ జీవో ఆధారంగా మున్సిపల్ శాఖ అప్పటి మంత్రి కెటిఆర్ అధ్యక్షతన నాటి ప్రభుత్వం మేనేజింగ్ కమిటీని ఏర్పాటు చేసినట్లు తేలింది. 2022 అక్టోబర్ 25న హైదరాబాద్‌లో 9,10,11,12 సీజన్‌లలో ఫార్ములా ఈ రేస్‌లను నిర్వహించేందుకు ఎంఏయూడీ, ఎఫ్ఈవో, ఏస్ నెక్ట్స్‌జెన్ ప్రైవేట్ లిమిటెడ్‌ల మధ్య త్రైపాక్షిక (మొదటి) ఒప్పందం కుదిరింది. దీనిని కుదుర్చుకునేటప్పుడు, సీజన్9 కోసం నిధులను ఖర్చు చేయడానికి అర్వింద్‌కుమార్ ప్రభుత్వంలోని కాంపిటెంట్ అథారిటీ నుంచి ఆమోదం తీసుకోలేదని, ప్రభుత్వం ఎలాంటి ఉత్తర్వులు జారీ చేయలేదని గుర్తించినట్లు సమాచారం.

ఫార్ములా ఈ రేస్ వ్యవహారంలో వరుసగా కీలక పరిణామాలు చోటు చేసుకుంటున్న సంగతి విదితమే. ఎసిబి కేసు ఆధారంగా విదేశీ సంస్థకు నిధులు బదిలీ చేయడంలో అధికార దుర్వినియోగం జరిగిందనే కోణంలో ఇడి కూడా రంగంలోకి దిగింది. ఎసిబి ఎఫ్ఐఆర్ ఆధారంగా ఎన్‌ఫోర్స్ మెంట్ కేసు ఇన్ఫర్మేషన్ రిపోర్టు నమోదు చేసి దర్యాప్తును ప్రారంభించింది. మాజీ మంత్రి కెటిఆర్‌ను ప్రధాన నిందితుడిగా పేర్కొంది. ఇందులో భాగంగానే విచారణ కోసం ఇడి కూడా నోటీసులను జారీ చేసింది. ఫార్ములా ఈ రేస్ కేసులో నిధుల మళ్లింపుపై విచారణ జరుపుతున్న ఇడి జనవరి 7వ తేదీన విచారణకు హాజరు కావాలని కెటిఆర్‌కు నోటీసులు ఇచ్చింది. అంతేకాకుండా ఈ కేసులో ఎ2గా ఉన్న సీనియర్ ఐఎఎస్ అధికారి అర్వింద్‌కుమార్, హెచ్ఎండిఎ మాజీ చీఫ్ ఇంజనీర్ బిఎల్ఎన్‌రెడ్డి(ఎ3)లకు కూడా నోటీసులు జారీ అయ్యాయి. బిఎల్ఎన్ రెడ్డి జనవరి 2వ తేదీన హాజరు కావాల్సి ఉన్నప్పటికీ గైర్హాజరయ్యారు.

ఇక ఈ కేసులో ఉన్న ఐఎఎస్ అధికారి అర్వింద్ కుమార్ కూడా తనకు మరింత సమయం గడువు కావాలని కోరారు. దాంతో వారిద్దరి విచారణను తాత్కాలికంగా వాయిదా వేసి కొత్త తేదీలలో ఇడి అధికారులు మళ్లీ నోటీసులు జారీ చేశారు. ఈ నెల 8,9 తేదీల్లో వీరిని ఇడి విచారించనుంది. హెచ్ఎండీఏ బోర్డు అకౌంట్ నుంచి బ్రిటన్‌లోని అకౌంట్స్‌కు ఎలాంటి ట్యాక్సుపు చెల్లించకుండానే రూ.45.71 కోట్లు ట్రాన్స్‌ఫర్ చేసినట్లు ఇన్‌కం ట్యాక్స్ ఆడిట్‌లో వెలుగులోకి వచ్చింది. దీంతో హెచ్ఎండీఏ బోర్డుకు ఐటి నోటీసులు ఇచ్చింది. ఇందుకు గానూ హెచ్ఎండీఏ నిధుల నుంచే రూ. 8 కోట్ల 6 లక్షల 75 వేల 404 చెల్లించాల్సి వచ్చింది. దీంతో పాటు ఇన్‌ఇంటర్నేట్ ఛాంపియన్షిప్ క్యాలెండర్ ఫీజు, పర్మిట్ ఫీజు కోసం ఫెడరేషన్ ఆఫ్ మోటార్ స్పోర్ట్స్ క్లబ్స్ ఆఫ్ ఇండియాకు మరో రూ. 1,10,51,014 హెచ్ఎండీఏ చెల్లించింది. ఇలా మొత్తంగా రూ. 54,88,87,043 హెచ్ఎండీఏ నిధుల నుంచి చెల్లింపులు జరిగినట్టుగా ఎసిబి ఆరోపిస్తోంది. రాష్ట్రాలకు ఆదర్శంగా మారాయన్నారు. ప్రస్తుత పునరుత్పత్తి శక్తి ప్రాజెక్టుల ద్వారా వేలాది కోట్ల పెట్టుబడులు రాష్ట్రానికి వచ్చాయని, ఈ రంగంలో మరిన్ని పెట్టుబడులను ఆకర్షించడానికి రాష్ట్రం సుస్పష్టమైన విధానాలను అమలు చేస్తోందన్నారు. 2030 నాటికి 20వేల మెగావాట్ల సామర్థ్యాన్ని చేరుకోవడం మాత్రమే కాకుండా, తెలంగాణ గ్రీన్ ఎనర్జీ హబ్‌గా మారాలని ప్రభుత్వం దృఢ నిశ్చయంతో ఉందని తెలిపారు. తెలంగాణ పునరుత్పత్తి శక్తి రంగంలో సాధిస్తున్న ఈ అద్భుత విజయాలు రాష్ట్ర అభివృద్ధిని వేగవంతం చేస్తూ శక్తి వినియోగంలో స్వచ్ఛమైన మార్గాలను అనుసరించి దేశానికే ఒక దిశానిర్దేశం అందిస్తున్నాయని వివరించారు.

## రైతులను నట్టేట ముంచిన ప్రభుత్వమిది : కిషన్ రెడ్డి

శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం మరోసారి తీవ్ర విమర్శలు చేశారు. కాంగ్రెస్ చేతల ప్రభుత్వం కాదని, మాటల ప్రభుత్వం, కోతల ప్రభుత్వమని, రైతు భరోసాలో కోతలు పెట్టే కుట్రలు చేస్తోందని విమర్శించారు. రైతులు, రైతు కూలీలు, కౌలు రైతులు ఎంతమంది ఉన్నదీ ప్రభుత్వం దగ్గర డేటా ఉందని, దద్దమ్మ ప్రభుత్వం కాకపోతే రైతుల నుండి దరఖాస్తులు ఎందుకు తీసుకుంటుందని ఆయన ప్రశ్నించారు. రైతులు, మహిళలు, నిరుద్యోగులకు ఇచ్చిన హామీలు, గ్యారంటీలు అమలు చేయాలని కిషన్‌రెడ్డి డిమాండ్ చేశారు. అనేక హామీలు గుప్పించి రైతులను నట్టేట ముంచే ప్రయత్నం చేస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్‌ది ప్రజాప్రభుత్వం కాదని, ప్రజలను మోసం చేసే ప్రభుత్వమని అన్నారు.

**ఫసల్ భీమా ప్రస్తావనే లేదు..**

కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న ఫసల్ బీమా ప్రస్తావనే లేదని, రైతు భరోసా కింద ఒక్క రూపాయి కూడా ఇంతవరకు ఇవ్వలేదని కిషన్ రెడ్డి విమర్శించారు. రైతుల మీద అక్రమ కేసులు పెట్టి, రైతులకు సంకెళ్లు వేస్తున్నది కాంగ్రెస్ ప్రభుత్వమని ఆందోళన వ్యక్తం చేశారు. అప్పుడు బీఆర్ఎస్ రైతులకు సంకెళ్లు వేస్తే, ఇప్పుడు కాంగ్రెస్ సర్కారు వేస్తోందని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం తెలంగాణ రైతులకు అండగా ఉందని, నవంబర్ 30న నాలుగో విడత రుణమాఫీ చేస్తున్నట్టు రేవంత్ రెడ్డి ప్రకటించారని అన్నారు. ఆ డబ్బులు ఇంకా రైతుల అకౌంట్ లలో చేరలేదని, ఇంకా నాలుగు సంవత్సరాలైనా రుణమాఫీ కాదని ఆయన సెటైర్లు వేశారు. కనీస మద్దతు ధర కొన్ని పంటల మీద 80 శాతం మోడీ ప్రభుత్వం పెంచిందని, కేంద్రం అన్ని విధాలుగా సహకరిస్తున్నా ధాన్యం కొనుగోలులో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. ఇది నేరపూరిత చర్యగా కిషన్ రెడ్డి అభివర్ణించారు. ప్రైవేట్ రైస్ మిల్లర్‌లతో ఒప్పందం కుదుర్చుకుని రైతులకు అన్యాయం చేస్తుందని, రైతు వ్యతిరేక చర్యలకు పాల్పడుతోందని ఆరోపించారు. ఈ ప్రభుత్వానికి అధికారుల మీద అజమాయిషీ లేదని కిషన్ రెడ్డి పేర్కొన్నారు.

**ఎరువుల సబ్సిడీకి కేంద్రం రూ.33 వేల కోట్ల వ్యయం..**

తెలంగాణలో ఎరువుల సబ్సిడీ కోసం కేంద్రం రూ.33 వేల కోట్లు ఖర్చు చేస్తోందని అన్నారు. ఎరువుల ధరలు పెరిగినా, కేంద్రం ఏనాడూ రైతులపై భారం వేయలేదని అన్నారు. పెరిగిన భారమంతా కేంద్రమే భరిస్తోందని తెలిపారు. కేంద్రం రైతు పక్షపాతిగా వ్యవహరిస్తోందని పేర్కొన్నారు. బీజేపీ హయాంలోనే ఎరువుల కొరత లేని పరిస్థితులు చూస్తున్నామని వివరించారు. కానీ రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను నిండా ముంచుతోందని విమర్శించారు. రైతులు పండించే పంట మొత్తాన్ని కేంద్రమే కొనుగోలు చేస్తోందని అన్నారు. కేజీ బియ్యాన్ని రూ.40కి కొనుగోలు చేసి పేదలకు ఉచితంగా ఇస్తున్నట్లు తెలిపారు. అంతేకాకుండా కేంద్రంలోని మోడీ ప్రభుత్వం విద్యుత్ కోతలు లేని పరిస్థితి తీసుకొచ్చిందని తెలిపారు.

సత్యమేవ జయతే
శనివారం 04 జనవరి 2025

## జోగులాంబ గద్వాల కేటి దొడ్డి మండల్‌లో చదువుల తల్లి సావిత్రీబాయి పూలే జయంతి సందర్భంగా చిత్రపటానికి నివాళులర్పించిన బీఆర్ఎస్ నాయకులు





**సత్యమేవ జయతే - జోగులాంబ గద్వాల :** గాజుల కృష్ణ రెడ్డి నక్క రవి ఈ సందర్భంగా గాజుల కృష్ణరెడ్డి మాట్లాడుతూసకల రంగాల్లో బహుజనులను కట్టడిచేసే సామాజిక సంప్రదాయ నిర్భంధాలను బద్దలుకొట్టి, బడుగుల అభ్యున్నతికై, స్త్రీ విద్యకై తనజీవితాన్ని దారపోసిన మహనీయురాలు సావిత్రీబాయి పూలే అని కొండాపురం గాజుల కృష్ణరెడ్డి అన్నారు.చదువుల తల్లి సావిత్రీ భాయి పూలే జయంతి సందర్భంగా వారు చేసిన సామజిక కృషిని, స్త్రీ జాతి ఔన్నత్యం కోసం, అణచివేయబడిన కులాల స్వేచ్ఛ కోసం కోసం మహాత్మా జ్యోతిరావు సావిత్రి బాయి పూలే దంపతుల త్యాగాలను కేటి దొడ్డి మండల బీఆర్ఎస్ నాయకులు గాజుల కృష్ణరెడ్డి స్మరించుకున్నారు. మారుతున్న కాలానికి అనుగుణంగా, మెజారిటీ ప్రజల జీవన విధానం మరింత గుణాత్మకంగా మార్పు చెందడానికి, వారి హక్కులు కాపాడబడటానికి, త్యాగాలు చేసిన భారతీయ మహనీయుల్లో మహాత్మా పూలే దంపతులు ముందువరుసలో వుంటారని గాజుల కృష్ణ రెడ్డి తెలిపారు.
సామాజిక రాజకీయ సాంస్కృతిక ఆర్థిక రంగాల్లో దళిత బహుజన వర్గాలను మరింత భాగస్వామ్యం చేసే దిశగా, సాధించుకున్న తెలంగాణ రాష్ట్రం అన్ని రంగాల్లో పదేండ్ల అనతికాలంలో కుదురుకున్నదని అన్నారు. మహాత్మా పూలే దంపతుల ఆశయాలకు అనుగుణంగా చేపట్టిన నాటి బీఆర్ఎస్ కార్యాచరణ నేడు ఫలితాలను అందిస్తున్నదన్నారు. దళిత బహుజన వర్గాలకు పట్టుగొమ్మలైన పల్లె తెలంగాణ నేడు ప్రగతి పథంలో పయనిస్తూ భవిష్యత్ తరాలకు బంగారు బాటలు వేసిందన్నారు.గురుకుల విద్యతో సహా, బడుగు వర్గాల బిడ్డలను భావితరాలకు ప్రతినిధులుగా తీర్చిదిద్దాలనే దార్శనికతతో,విద్యారంగంలో ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ వేసిన పునాదిలో సావిత్రీ బాయి పూలే దంపతుల ఆశయాలు ఇమిడివున్నాయన్నారు.తెలంగాణ ఆడబిడ్డల ప్రపంచ స్థాయి నాణ్యమైన విద్యను అందుబాటులోకి తేవడానికి ప్రత్యేక గురుకులాలను గొప్పగా తీర్చి దిద్దిన ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ఇంటర్మీడియట్ డిగ్రీ కళాశాలను స్థాపించమని కేసీఆర్ అని గుర్తుచేశారు.మహిళా సాధికారత కోసం నాటి బీఆర్ఎస్ ప్రభుత్వం అనేక పథకాలను ప్రవేశపెట్టి అమలు చేసిందన్నారు.అదే స్ఫూర్తిని కొనసాగిస్తూ సబ్బండ వర్గాలలో నిత్య చైతన్యాన్ని నింపడం ద్వారా మాత్రమే సావిత్రీబాయి పూలే వంటి మహనీయులకు మనమందించే ఘన నివాళి అని గాజుల కృష్ణ రెడ్డి తెలిపారు.

## స్త్రీ జాతి ఆణిముత్యం ఆమె....



**సత్యమేవ జయతే - సంగారెడ్డి :** స్త్రీ జాతి ఆణిముత్యం ఆమె కరుడుగట్టిన బ్రాహ్మనిజం కబంధహస్తాల నుంచి స్త్రీ బయటకు వెళ్ళాలంటే పరదా వేసుకోవాలని శాసించిన సమాజాన్ని చీల్చి...సమస్త భారత మహిళ లోకానికి స్వేచ్ఛ , స్వాతంత్ర్యాలు ప్రసాదించిన మానవి ఆమె. తను చదువుకుని.....సాటి స్త్రీలకు విద్య చెప్పటానికి రాళ్ళు , రప్పలు , పేడ , పిడికలు , తన మీద పడుతున్నా వాటిని పువ్వుల్లా భావించి లక్ష్య సాధనలో వెనుకడుగు వేయలేదు . పురుషులే కాదు , సాటి స్త్రీల సూటిపోటి మాటలను ఆశీర్వచనాలుగా ముందుకు సాగిన మహిమాన్విత ఆ స్త్రీ మూర్తి. మహాస్వాధ్వియే సావిత్రి భాయి పూలే....భారతదేశ తొలి మహిళా సంఘ సంస్కారిణి సావిత్రిబాయి పూలే సమాజంలోని కులతత్వం, పురుషాధిక్యత ధోరణులు కలిగిన చాలామంది పండిత మేధావులందరికీ కూడా సావిత్రిబాయి కేవలం జ్యోతిరావు పూలే భార్యగా మాత్రమే తెలుసు. కానీ సావిత్రిబాయి ఆధునిక భారతదేశంలో మొట్టమొదటి మహిళా ఉపాధ్యాయురాలు.., పీడిత ప్రజలు ముఖ్యంగా స్త్రీల విద్యాభివృద్ధికి కృషి చేసిన తొలితరం మహిళా గారి జయంతి శుభాకాంక్షలు మెదక్ పార్లమెంట్ కంటెస్టెడ్ నీలం మధు ముదిరాజ్'జిల్లా దిశా కమిటీ మెంబర్ ప్రకాష్ రాథోడ్'సురేష్ నాయక్'శ్రీనివాస్'ప్రవీణ్'తదితరులు పాల్గొనడం జరిగింది.

## శ్రీరంగాపూర్ మండల కేంద్రంలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ యువజన సంఘం కమిటీ సభ్యులు జె రాముడు సహాయ కార్యదర్శి , కే నాగేష్ సాంస్కృతిక కార్యదర్శి గారి



**సత్యమేవ జయతే - శ్రీరంగాపూర్ :** భారతదేశ మొట్టమొదటి మహిళా ఉపాధ్యాయురాలు మహిళలు చదువుకుంటూనే ఈ దేశం అభివృద్ధి చెందుతున్న అనే ఆకాంక్షతో మహిళల కోసం ప్రత్యేకంగా పాఠశాలలు ఏర్పాటు చేసి వాళ్లకు విద్యాబుద్ధులు నేర్పి వాళ్లను అభివృద్ధి వైపు నడిపించిన చదువుల తల్లి మాత శ్రీ సావిత్రిబాయి పూలే 134వ జయంతినీ పురస్కరించుకొని పూలమాలతో ఘనంగా నిర్వహించడం జరిగింది. ఇట్టి కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జి వెంకటేష్ ముదిరాజ్ గారు, యం మద్దిలేటి గారు ,జి నరేష్ జి వికాస్ జి చరణ్ జి కిరణ్ రాజ్ డీ పవన్ కుమార్ అబ్బులు కృష్ణ మరియు తదితరులు పాల్గొన్నారు.

## డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను లబ్ధిదారులకు అందించాలని బీఆర్ఎస్ దీక్ష




**సత్యమేవ జయతే - జయశంకర్ భూపాలపల్లి :** డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను లబ్ధిదారులకు వెంటనే అందించాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్ నాయకులు ఆందోళన చేపట్టారు. జయశంకర భూపాల పల్లి జిల్లా కేంద్రంలో లబ్ధిదారుల తో కలిసి జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ సెంటర్లో నిరసన దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు మాట్లాడుతూ..సామాన్యుడి సొంతింటి కలను నిజం చేయాలని నాడు కేసీఆర్ ప్రభుత్వం డబుల్ బెడ్ రూం ఇండ్లను నిర్మించిందన్నారు. రూపాయి ఖర్చు లేకుండా ఎంతో మంది పేదలకు ఇండ్లను పంపిణీ చేసిందని గుర్తు చేశారు. డబుల్ బెడ్ రూం ఇండ్ల నిర్మాణం దేశానికే ఆదర్శంగా నిలిచిందని గుర్తు చేశారు. అయితే జిల్లాలో బీఆర్ఎస్ ప్రభుత్వం నిర్మించిన 419 డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను ఎంపిక చేసిన లబ్ధిదారులకు కేటాయించకుండా కాంగ్రెస్ ప్రభుత్వం అలసత్వాన్ని ప్రదర్శిస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే వెంటనే అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# డాక్టర్.ఆర్.ఎస్.ప్రవీణ్ కుమార్ ఐపిఎస్ (వీఆర్ఎస్) గారి సందేశం...



**సత్యమేవ జయతే :** ఇలా చేస్తే పోలీసుల ఆత్మహత్య లను ఆపవచ్చు. తెలంగాణ లో గత ముప్పయి రోజుల్లోనే ఆరు మంది పోలీసులు తమ విలువైన ప్రాణాలను చేజేతులా నాశనం చేసుకున్నారు. నిన్న కూడా ఒక కానిస్టేబుల్ ఆత్మహత్య చేసుకున్నారు. ఈ పరంపర ఇంతటితో ఆగాలి. ప్రియమైన పోలీసు మిత్రులారా, గత ముప్పై సంవత్సరాలుగా నేనూ ఆయుధాల మధ్యనే బతుకుతున్నా. సర్వీసులో ఎన్నో చెప్పుకోలేని అవమానాలు, నిరాశలు, సహచరుల అకాల మరణాల్లాంటి ఎన్నో బాధలు ఎదురైనవి. కొన్ని నెలల తరబడి పోస్టింగ్ ఇవ్వకుండా నన్ను ఇంట్లో కూర్చోబెట్టారు కూడా. అయినా కూడా నేను ఎన్నడూ తాగుడుకు బానిస కాలేదు, నాకు ఎన్నడూ చావాలనిపించలేదు. భవిష్యత్తులో కూడా నాకు ఈ ఆలోచన రాదు. ఆ రహస్యం ఏంటో మీకు చెప్పాలని ఉంది. దీని వల్ల మీరు సజీవంగా, మీ కుటుంబాలు సంతోషంగా ఉంటాయనే చిన్న ఆశ నాకు ఉంది.నేను ఐపీయస్ అధికారిని ఐనా, నాదీ మీ అందరి లాంటి నేపథ్యమే. మారుమూల ప్రాంతాల్లో చదవడం, మంచి అవకాశాల కోసం నగరాలకు రావడం, ఎన్ని ఇబ్బందులు ఎదురైనా ఏదో సాధించాలనే పట్టుదల తో రాత్రింబవళ్లు చదవడం, చివరికి విజయం సాధించడం..
తరువాత పోలీసు అకాడమీలో ట్రైనింగ్ ఒక గొప్ప అనుభూతి . అది జీవితానికి ఒక గొప్ప క్రమశిక్షణ ను అలవాటు చేసింది. మూడు దశాబ్దాలుగా నాకు వచ్చిన ఈ అరుదైన అవకాశాన్ని (పోలీసు ఉద్యోగం) నిరంతరం ప్రజలకు నాకు చేతనైనంత మేలు చేయడానికే వాడాను. మీరు కూడా అలాగే వాడాలి. ఈ విషయాన్ని చాలా రోజుల తరువాత విక్టర్ ఫ్రాంకెల్ రాసిన 'అర్థం కోసం అన్వేషణ' పుస్తకం లో చదివాను. మీరు కూడా చదవండి. మీకు చావాలనిపించదు.
నేను పోలీసు ఉన్నతాధికారి కావడం వల్ల నేను పుట్టి పెరిగిన ఊరు చివర్లో ఉన్న మా కాలనీ ప్రజలకు, నా స్నేహితులకు, ఒక గుర్తింపు దొరికింది. నేను పోలీసు వాహనంలో మా ఊరికి పోయినప్పుడు మా బస్తీ ప్రజల ఆనందానికి అవధుల్లేవు. మీ అందరికీ ఇలాంటి అనుభవాలే ఎదురై ఉంటయి. మీరందరూ, మీ మీ సమూహాల్లో సెలబ్రిటీలు. మీ గురించి మీ తల్లిదండ్రులు మీకు తెలవకుండా చాలా గొప్పగా ఊర్లో చెప్పుకుంటరు. ఒక్క మాటలో చెప్పాలంటే మీరు మీ కుటుంబాలకు, మీ సమాజానికి సమూహానికి ఒక గొప్ప బలం. మనంతటికి మనం ఆత్మహత్యలు చేసుకుంటే వాళ్ళ పరిస్థితి ఏంది? ఆలోచించండి. అసలు రోజూ చావులను ఎఫ్ ఐఆర్‌లు, పంచనామాలు, పోస్టుమార్టంల రూపంలో చూసే మనకు చావాలన్న ఆలోచన రావడమే విడ్డూరంగా ఉంది! అయినా మనుషుల ప్రాణాలను కాపాడడానికి జీతం తీసుకునే మనం, మన ప్రాణాలు మనమే తీసుకొనుడేంది??

**మీకు తెలుసా?**

మన వల్ల మనకు తెలియకుండానే ఎన్నో జీవితాలు రోజూ సురక్షితంగా ఉంటాయో? గొప్ప విలువ ఉన్న ఇలాంటి జీవితాన్ని, ఒక పిరికి ఆలోచనతో క్షణికావేశంలో నాశనం చేసుకోకూడదు.
మనం చేసే చిన్న చిన్న తప్పుల గురించి రోజుల తరబడి ఆలోచించే సమయం ఎవరికీ లేదు. తప్పులను డిలీట్ చేసుకొని మనం ముందుకు సాగాల్సిందే. నిజం చెప్పాలంటే ఎవరి బతుకుల్లో వారు బిజీగా ఉన్నారు.ఆరోగ్యం బాగాలేక పోతే డాక్టర్ దగ్గరికి పోవాలి, మరో మహిళ/పురుషుడు మన జీవితాల్లోకి అక్రమంగా ప్రవేశిస్తే అర్జెంటుగా మన జీవిత భాగస్వామితో ఆ విషయాన్ని నిర్మొహమాటంగా షేర్ చేసుకోవాలి, పరిష్కారం కనుగొనాలి. అంతే గాని అందరికీ తెలుస్తదని భయపడి ప్రాణాలు తీసుకుంటే మీ పిల్లలు, తల్లిదండ్రులు రోడ్డు మీద పడరా?

**నా అనుభవంతో, కొంతమంది నిపుణులు, పోలీసు ఆఫీసర్లతో మాట్లాడి కింది సలహాలను ఇస్తున్నాను. దయచేసి చదవండి- పాటించండి.**

1. జీవిత భాగస్వామి ఎంపికలో జాగ్రత్త పడండి. డేటింగ్ చెడ్డదేం కాదు. ట్రై చేయండి. వరకట్నం ఆపండి. పెళ్లి వ్యాపారం కాదు. మీ కుటుంబం ఫోటోను మీరు పనిచేస్తున్న ప్రదేశంలో ఉంచుకోండి. మీ సెల్ ఫోన్ వాల్ పేపర్ గా మార్చుకోండి.
2. మీరు డ్యూటీ లు బాగా చేయండి, డ్యూటీ అయిపోయిన తరువాత మాత్రం కుటుంబం తో గడపండి, సెల్ ఫోన్ తో కాదు.
3. వీలయినప్పుడల్లా కనీసం రోజుకు గంట సేపు వ్యాయామం చేయండి. పోలీసు అకాడమీ రోజులను గుర్తు చేసుకోండి. బిజీ గా ఉన్నామని మాత్రం తప్పించుకోకండి.
4. బందోబస్తులో ఉన్నపుడు ఖాళీ సమయాన్ని ఫోన్లో బెట్టింగ్, ఈజీ లోన్, చాటింగ్ యాప్ లకు కేటాయించకుండా మంచి పుస్తకాలు చదవండి.
5. దయచేసి ఏదైనా ఒక గేమ్ ను (ఆన్లైన్ కాదు) అలవాటు చేసుకోండి. క్రీడాకారులు ఆత్మహత్యలు చేసుకోరు గమనించండి.
6. బెట్టింగ్, సట్టా, మట్కా, చీప్ లోన్, ఫేక్ క్రిప్టోకరెన్సీ ఇవన్నీ గంజాయి లాంటి వ్యసనాలు. వీటికి దూరంగా ఉండండి.
7. పోలీసులకు ప్రత్యేకంగా అపరిచిత వ్యక్తులతో చాటింగ్ బెడద ఉంటది. అలాగే మన దగ్గరికి నిస్సహాయ పరిస్థితి లో వచ్చిన వ్యక్తుల బాధను అర్థం చేసుకోవాలి, సహాయం చేయాలి కాని వాళ్లతో రిలేషన్స్ కంటిన్యూ చేయకూడదు
8. ఎవరైనా పై అధికారులు సైకోల్లాగా ప్రవర్తిస్తే, సెలవు పెట్టి వెళ్లండి లేదా వేరే ప్రాంతానికి బదిలీ చేయించుకోండి. తప్పనిసరి పరిస్థితుల్లోనే ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయండి
9. మానసిక ఒత్తిడి ఉన్నపుడు కౌన్సిలర్ల వద్దకు వెళ్లి మీ సమస్యలు వారికి చెప్పుకోండి. ఉపశమనం కలుగుతుంది.
10. బాగా డబ్బు సంపాదించే ఆలోచన ఉండడం తప్పు కాదు. మీ కుటుంబ సభ్యులతో ఉద్యోగం లేదా వ్యాపారం చేయించండి. వాళ్లకు మీ రోజువారీ ఉద్యోగంతో, నేరస్తులతో సంబంధం లేకుండా చూసుకోండి.
11. దయచేసి లంచాలకు, మామూళ్లకు(మంత్లీస్), అక్రమ సంపాదనకు దూరంగా ఉండండి. ఆ ఏసీబీ విజిలెన్స్ కేసులనుండి బయటపడాలంటే తీసుకున్న లంచం కన్నా వంద రెట్లు ఖర్చవుతుంది. అదెలా జరుగుతుందో మీకందరికీ తెలుసు.
12. సంవత్సరానికి ఒకసారి విపాసన (మెడిటేషన్) లేదా విహారయాత్రలకు కుటుంబంతో వెళ్లండి. మీరు పది రోజులు డ్యూటీలో లేకపోతే కొంపలేం మునగవు.
13. పక్క పోలీసు/ఇతర డిపార్ట్మెంట్ ఉద్యోగస్తులతో పోల్చుకోకండి. మనశ్శాంతి ఉండదు. కనిపించేదంతా బంగారం కాదు. ఎవరి బాధలు వాళ్లకుంటయి.
14. మీకిష్టమైన వ్యక్తుల పేరు మీద స్వచ్ఛంద సంస్థలు ఏర్పాటు చేసి పేద ప్రజలకు సేవ చేయండి.
15. మీ కిష్టమైన మంచి పేరున్న పై అధికారులను(సర్వింగ్/రిటైర్డు) మార్గదర్శులు గా తీసుకోండి. వారిని తరచుగా కలవండి.

**పోలీసు ఉన్నతాధికారులకు విన్నపం:**

1. పోలీసు ట్రైనింగ్ లో ఏదో తీవ్రమైన లోపం ఉంది. అవుట్ డోర్ ను కొంత కఠినతరం చేయండి. చాలా మందికి సెల్యూట్ కూడా సరిగా రావడం లేదు.
2. పోలీసు కుటుంబాలకు కు ఉచిత కౌన్సిలర్ సౌకర్యం కల్పించండి. సఖీ సెంటర్లు మన కుటుంబాలకు కూడా అవసరం.
3. తరచుగా పండుగల తరువాత పోలీసు కుటుంబాలతో బఢాఖానా(గెట్ టుగెదర్)లు నిర్వహించండి. వాటిని నామ్ కే వాస్తే గా పెద్దే ఆఫీసర్లు కేవలం షామియానా బిల్లులు పట్టుకొస్తరు.
4. చిన్న చిన్న తప్పులకు ఛార్జ్ మెమోలు, సస్పెన్షన్ లతో ఇబ్బంది పెట్టకండి. దయచేసి కౌన్సిలింగ్ ఇవ్వండి.
5. బెట్టింగ్,లోన్లు, మద్యం, చాటింగ్, అక్రమ సంబంధాలకు బానిసలైన ఉద్యోగుల కోసం జిల్లాలో/బెటాలియన్లలో 'డీ అడిక్షన్ సెంటర్లను' ఓపెన్ చేయండి.
6. బహుశా ఆదర్శంగా బతుకుతున్న కుటుంబాలకు గుడ్ సర్వీసు ఎంట్రీ, కమెండేషన్ లెటర్, బెస్ట్ ఫ్యామిలీ ఆఫ్ ద వీక్, మెడల్స్ ఇవ్వవచ్చేమో ఆలోచించండి.
7. ప్రతి పోలీస్ స్టేషన్ లో క్రీడలకు వెసులుబాటు కల్పించండి.
8. ఆరోగ్య భద్రత బిల్స్ రెగ్యులర్ గా వచ్చేట్లు చూడండి.
9. సరెండర్ లీవులు టీఏలు రెగ్యులర్ గా చెల్లించండి.
10. పోలీసు ఫైనాన్స్ కార్పోరేషన్ లేదా కోఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ ఏర్పాటు చెస్తే ఈజీ లోన్ల బారిన పడరు. ఆలోచించండి....

# సావిత్రిబాయి పూలే గొప్ప కవి, రచయిత్రి, చక్కటి ఆలోచనలు కలిగిన వ్యక్తి...

**సత్యమేవ జయతే -**మీ విక్రం బత్తుల సందేశం జనవరి 3 "సావిత్రిబాయి పూలే" జయంతి సందర్భంగా....
జననం : 3 జనవరి 1831 , నైగాన్, మహారాష్ట్ర
మరణం : 10 మార్చి 1897
జాతీయత : భారతీయులు
జీవిత భాగస్వామి : జ్యోతీరావ్ పులే
సావిత్రిబాయి పూలే (3 జనవరి 1831 %-% 10 మార్చి 1897) భారతీయ సంఘ సంస్కర్త, ఉపాధ్యాయిని మరియు రచయిత్రి. ఆమె నిమ్న వర్గాల అభ్యున్నతికి కృషి చేసిన జ్యోతీరావ్ పులే భార్య. కులమత భేదాలకు అతీతంగా సమాజాన్ని ప్రేమించిన ప్రేమస్వరూపిణి. ఆమె ఆధునిక విద్య ద్వారానే స్త్రీ విముక్తి సాధ్యపడుతుందని నమ్మిన సావిత్రిబాయి భర్తతో 1848 జనవరి 1న పూణేలో మొట్టమొదటగా బాలికల పాఠశాలను ప్రారంభించింది.కుల వ్యవస్థకు, పితృస్వామ్యానికి వ్యతిరేకంగా, శూద్రుల, అస్పృశ్యుల, మహిళల సకల హక్కుల కోసం పోరాటం చేయటం తమ సామాజిక బాధ్యతగా ఆ దంపతులు విశ్వసించారు. నూతన వ్యవస్థ కోసం, ప్రాణాల్ని సైతం ఫణంగా పెట్టి సమష్టిగా పోరాటం చేసారు.

**జీవిత విశేషాలు....**

ఆమె మహారాష్ట్ర సతారా జిల్లాలో నయాగావ్ అనే గ్రామంలో 1831 జనవరి 3 న జన్మించింది. ఆమెది రైతుకుటుంబం. తన తొమ్మిదవ యేట 22 యేండ్ల జ్యోతిరావు పూలెను 1840లో వివాహమాడారు. ఆ దంపతులకు స్వంత పిల్లలు లేరు. కానీ ఆ జంట యశ్వంతరావు (బ్రాహ్మణ వితంతువు కుమారుడు) ను దత్తత తీసుకున్నారు.

**సంఘ సంస్కర్తగా....**

ఆమె "జ్యోతీరావు పూలె" ప్రోత్సాహంతోనే ఇంట్లోనే అక్షరాభ్యాసం చేసి విద్యావంతురాలైంది. అట్టడుగు వర్గాలు, మహిళలకు చదువు సంపద వంటి సమస్త హక్కులు నిరాకరింపబడిన దేశంలో ఆనాటి సమాజపు కట్టుబాట్లను, సంప్రదాయాలను, ఆధిపత్యవర్గాలను ధిక్కరించి భారతదేశపు మొట్టమొదటి ఉపాధ్యాయురాలుగా పాఠశాలలు ప్రారంభించి, దళితుల, స్త్రీల విద్యా వ్యాప్తికి కృషి ప్రారంభించే నాటికి ఆమె వయస్సు 18 ఏళ్ళు మాత్రమే. వారి జీవితకాలంలో మొత్తం 52 పాఠశాలలు ప్రారంభించారు. అయితే ఈ క్రమంలో ఆమె ఆధిపత్య కులాల వారి నుంచి అనేక దాడులను, అవమానాలను ఎదుర్కొంది. ఆమె మానవ హక్కుల గురించి ఇతర సామాజిక సమస్యల గురించి స్త్రీలను చైతన్యపరచడానికి 1852లో మహిళా సేవామండల్ అనే మహిళా సంఘన్ని కూడా స్థాపించింది. జెండర్ సమస్యలకు తోడుగా, కుల పితృస్వామ్య వ్యవస్థల అణచివేతకు వ్యతిరేకంగా స్త్రీల సాధికారిత కోసం ఈ సంస్థ కృషిచేసింది. మహిళా హక్కులే మానవ హక్కులని తొలిసారిగా నినదించినది సావిత్రిబాయి పూలే.

**నేడు సావిత్రిబాయి పూలే జయంతి.**

**భారతదేశంలో మొట్టమొదటి మహిళా ఉపాధ్యాయురాలు**

భారతదేశ తొలి మహిళా సంఘ సంస్కారిణి సావిత్రిబాయి పూలే సమాజంలోని కులతత్వం, పురుషాధిక్యత ధోరణులు కలిగిన చాలామంది పండిత మేధావులందరికీ కూడా సావిత్రిబాయి కేవలం జ్యోతిరావు పూలే భార్యగా మాత్రమే తెలుసు. కానీ సావిత్రిబాయి ఆధునిక భారతదేశంలో మొట్టమొదటి మహిళా ఉపాధ్యాయురాలు.., పీడిత ప్రజలు ముఖ్యంగా స్త్రీల విద్యాభివృద్ధికి కృషి చేసిన తొలితరం మహిళా ఉద్యమకారిణి.. స్త్రీల విముక్తి కోసం అహర్నిశలు శ్రమించిన నాయకి, గొప్ప రచయిత్రి. మంచి వక్త.. కులం, పితృస్వామ్యంపై కలం యుద్ధం నడిపిన కవయిత్రి.. యుక్తవయసులోనే తన సౌఖ్యాలను వదులుకొని శూద్రులకు, దళితులకు పాఠశాలలు నడిపిన గొప్ప మానవి. స్త్రీపురుషులు కులమతాలకతీతంగా విద్యనభ్యసించడం సహజమైన హక్కు ఉంటుందని, అందుకే అందరూ చదవాలి... అందరూ సమానంగా బ్రతకాలి... అని అనునిత్యం తపించిన సామాజిక విప్లవ మాతృమూర్తి సావిత్రిబాయి. నాటి, నేటి సమాజంలో సావిత్రిబాయి ప్రాముఖ్యత చాలా గొప్పది. ఆమె తన భర్తకు తోడునీడగా నడవడం మాత్రమే కాక, స్వయంగానే ఆమె సామాజిక విప్లవ మాతృమూర్తి. ఎన్నో అవరోధాలను అధిగమిస్తూ గొప్ప సృజనశీలిగా స్ఫూర్తిదాయినిగా ఎదిగిన నాయకురాలు, 19వ శతాబ్దంలో ఆమె సాగించిన కృషి ముందు కులం, వర్గం, లింగవివక్ష వంటి శక్తులన్నీ తలవంచక తప్పలేదు. విస్తృతంగా ప్రచారం నిర్వహిస్తూ అనేక ఉద్యమాలు నడిపారు. వితంతువులకు వివాహాలు నిర్వహించారు. 1831 జనవరి 3న మహారాష్ట్రలోని సతారా జిల్లా నమ్‌గాంవ్‌లో సావిత్రిబాయి జన్మించింది. తొమ్మిదేండ్ల వయస్సున జ్యోతిరావుపూలేను వివాహమాడింది. నిరక్షరాస్యురాలిగా ఉన్న సావిత్రిబాయికి భర్త జ్యోతిరావు పూలే మొదటి గురువు. విద్యాజ్ఞానం నేర్పి సామాజికో పాధ్యాయురాలిగా తీర్చిదిద్దారు. 1847 నాటికి భర్తతో కలిసి శూద్రకులాల బాలికలకోసం పూనేలో మొదటి పాఠశాల ప్రారంభించారు. ఈ పాఠశాల నడపటం ఉన్నత, అగ్రవర్ణాలకు నచ్చలేదు. దీంతో సావిత్రీ బాయిపై వేధింపులకు, భౌతికదాడులకు పూనుకున్నారు.
పాఠశాలకు నడిచే దారిలో ఆమెపై బురద చల్లడం, రాళ్ళు విసరడం, అసభ్య పదజాలాన్ని వాడటం వంటివి చేశారు. బురదతో మలినమైన చీరను పాఠశాలకు వెళ్లిన తరువాత మార్చుకుని, మరలా వచ్చేటప్పుడు బురద చీరను కట్టుకుని వచ్చేది. ఎవరైనా అడిగినప్పుడు ధైర్యంగా 'నా విధిని నేను నిర్వహిస్తున్నాను' అని చెప్పేది. అయినా రోజూ వేధింపులకు విసిగి ఒకరోజు ఒకడి చెంప పగులకొట్టింది. పట్టు వీడక వారు సాగించిన విద్యా ఉద్యమానికి తక్కువ కాలంలోనే సహకారం గుర్తింపు లభించాయి. ఒక ముస్లిం వ్యక్తి తన ఇంటిని బడికి కేటాయించాడు. కొంత మంది పుస్తకాలు సేకరించారు. మోరోవిఠల్, వాల్వేకర్, దియోరావ్ వంటి ప్రముఖులు పాఠశాల నిర్వహణకు సహకరించారు. 1851లో మరల పాఠశాల ప్రారంభించారు. బాలికల చదువు కోసం, విద్యాభి వృద్ధి కోసం సహకరించాలని ఆమె విజ్ఞప్తి చేసింది. పిల్లల్ని కనాలనే కోరికని త్యజించి ప్రపంచమే ఇల్లుగా చేసుకొని అనాధల్ని, అక్రమ సంతానంగా పుట్టి రోడ్లపాల్కైన బిడ్డల్నే తన బిడ్డలుగా చేసుకుంది సావిత్రీబాయి. 19వ శతాబ్దంలో కుల వ్యతిరేక ఉద్యమాల్లో స్త్రీ హక్కుల పారాటంలో సావిత్రిబాయి నిర్వహించిన పాత్ర మరువలేము. నాటి సామాజికోద్యమాలలో నాయకత్వ స్థానాల్లో నిలిచిన ఏకైక మహిళ సావిత్రిబాయి. బ్రాహ్మణీయ ఆధిపత్య వర్గాల చేతుల్లోని ఉద్యమాలకు ప్రత్యామ్నాయంగా సాగిన పోరాటాల్లో శూద్రుల పక్షపాతిగా అగ్రభాగాన నిలిచి మహిళలను చైతన్యులను చేశారు. 1852లోనే మహిళాసేవ మండల్ పేరిట మహిళా సంఘాన్ని స్థాపించారు. వితంతువుల పట్ల వివక్ష, అక్రమ సంతానం పేరిట శిశువుల హత్యలకు వ్యతిరేకంగా వివిధ పోరాటాలు నడిపారు. అనాధ బాలలు, శూద్రబాలికలు అందరూ తమ బిడ్డలేనని భావించారు. 1874లో ఒక బ్రాహ్మణ వితంతువు బిడ్డను పూలే దంపతులు దత్తపుత్రుడిగా స్వీకరించారు.
ఒక బ్రాహ్మణ వితంతువు గర్భవతి కాగా ఆత్మహత్యకు ప్రయత్నించిన ఆమెను పూలే దంపతులు రక్షించి ఆమెకు కలగబోయే బిడ్డను తాము పెంచుతామని భరోసా ఇచ్చి, పుట్టిన ఆ బిడ్డకు యశ్వంత్ అనే పేరుపెట్టి పెద్దవాడిని చేసి డాక్టర్‌ను చేశారు.1873లోనే సత్యశోధక్ సమాజం మహిళా విభాగం పేరిట కులాంతర వివాహాలు అనేకం జరిపించారు. భార్యను కోల్పోయిన ఒక యువకుడికి తన స్నేహితురాలి బిడ్డతో పెండ్లి చేశారు సావిత్రిబాయి. పురోహితుడు లేకుండా ఒక వివాహం జరపడం చరిత్రలోనే మొదటిసారి.
భారతదేశ చరిత్రలోనే ఎన్నదగిన సామాజిక విప్లవకారుడిగా కీర్తించబడ్డ జ్యోతిబా పూలేకి అన్ని రకాలుగా తన అండదండల్ని చ్చింది. భర్తతోపాటు తాను కూడా అన్ని కష్టాల్ని అవమానాల్ని




సహించింది. సావిత్రీబాయి ప్రపంచ చరిత్రలోనే భర్తతోపాటు ఉద్యమ జీవితంలో కలిసి నడిచిన ఆదర్శ సహచరిగా ఆమె నిలిచిపోయింది. సావిత్రిబాయి తన వ్యక్తిగత జీవితాన్ని త్యాగం చేసి విద్యాబోధనకు, బాలికలకు అంకిత మైంది. సాంఘిక దురాచారాల నిర్మూలన కోసం పెద్దలతో ఘర్షణ పడవలసివచ్చినా బెదరలేదు. వితంతువులకు శిరోముండనం చేయబోమంటూ క్షురకులను చైతన్యవంతులను చేసింది. అనాథ స్త్రీలకు, పిల్లలకు శరణాలయాలు, ఆశ్రమాలు ఏర్పా టు చేయించింది. సత్యశోధక సమాజంలో మహిళా విభాగాన్ని ఏర్పాటు చేసి కులాంతర వితంతు వివాహాలు జరిపించింది. 1890లో భర్త జ్యోతిరావు పూలే మరణిస్తే అంత్యక్రియలు జరిపే సందర్భంలో బంధువులు, దత్తపుత్రులు ఘర్షణ పడుతుంటే తానే చితికి నిప్పు అంటించి అంత్యక్రియలు పూర్తి చేసింది.
ఆమె తెగువకు యావత్ భారతదేశం దిగ్భ్రాంతి చెందింది. 1896-97లో సంభవించిన తీవ్ర కరువు, ప్లేగు వ్యాధి మహారాష్ట్ర జనజీవనాన్ని అతలాకుతలం చేశాయి. ఈ పరిస్థితుల్లో కరువు ప్రాంతాల్లోని దళితులు పేదలకు జోలెపట్టి విరాళాలు సేకరించి అందించారు. ప్లేగువ్యాధి సోకిన పేదలకు దగ్గరుండి సేవలందించారు. 1890వ దశకంలో ప్లేగు వ్యాధి బారినపడిన పిల్లల కోసం వైద్య శిబిరాలు నిర్వహించింది. దుర్భరమైన కరువు పరిస్థితుల్లో కూడా రోజుకు 2 వేల మంది పిల్లలకు భోజనాలు పెట్టించింది. 1897వ సంవత్స రం, మార్చి 10న ఒక పిల్లవాడికి సేవ చేస్తుండగా ఆమెకు ఆ వ్యాధే సోకి మరణించింది.
సావిత్రిబాయి పూలే గొప్ప కవి, రచయిత్రి, చక్కటి ఆలోచనలు, త్యాగం, సేవ, నిబద్ధత కలిగిన మహిళ. 1854లో కావ్యపూలే అనే ఒక కవితా సంపుటి రచించారు. అభంగ్ అనే రచన ఆనాటి సామాజిక పరిస్థితులకు అద్దం పట్టేలా ఉండేది. సూటిగా, సరళంగా ప్రకృతి వర్ణన జానపద కళలు, ప్రతిబింబించే కావ్య రచనలు చేశారామె. 1891లో ప్వాన్‌కాశీ సుభోధ్ రత్నాకర్ 11 పేరిట కవితా సంపుటిని ప్రచురించారు.
పండుగలు, పబ్బాలు వంటి ఆర్భాటాలకోసం శక్తికి మించిన ఖర్చులుచేసి అప్పులపాలయ్యే వాళ్ళను విమర్శిస్తూ "కర్జ్" అనే వ్యాసం రాశారు. మూఢ విశ్వాసాలు ఆచరించినంత కాలం ప్రజల జీవితాల్లో ఎలాంటి మార్పురాదని గుర్తించి హేతుబద్ధత కవితల్లో ప్రతిబింబించేవారు. క్రాంతి బాయిగా ప్రజలందరూ పిలుచుకునే సావిత్రీబాయి పూలే ఆధునిక భారతదేశ చరిత్రలో ధ్రువతారగా వెలుగొందుతూనే ఉంటుంది.

# నిజమైన చదువుల తల్లి సావిత్రిభాయి పూలే- శ్రీకాంత్ యాదవ్




**సత్యమేవ జయతే - హన్మకొండ :** బహుజన స్టూడెంట్ ఫెడరేషన్(బి.యస్.ఫ్) ఆధ్వర్యంలో ఘనంగా సావిత్రి బాయి పూలే 194వ జయంతి కాకతీయ యూనివర్సిటీ లో బహుజన స్టూడెంట్ ఫెడరేషన్(బి.యస్.ఫ్) ఆధ్వర్యంలో బి.యస్.ఫ్ కె.యూ ఇంచార్జి,హన్మకొండ జిల్లా అధ్యక్షులు బొట్ల మనోహర్ అధ్యక్షతన చదువుల తల్లి సావిత్రి భాయి గారి 194 వ జయంతి నిర్వహించారు.ఈ కార్యకమానికి ముఖ్య అతిథిగా జర్నలిజం విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ శ్రీకాంత్ యాదవ్ హాజరై ముందుగా దూరవిద్య కేంద్రంలోని సావిత్రి బాయి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కులవ్యవస్థ మూలంగానే 10% ఉన్న అగ్రవర్ణ సమాజ ఆధిపత్య ధోరణి వల్ల రెండు వేల సంవత్సరాలుగా భారతదేశంలో 90% ఉన్న అణగారిన సమాజానికి, స్త్రీల హక్కుల కోసం విద్య కోసం మహాత్మా జ్యోతిరావు పూలే దంపతులు దేశ అగ్రవర్ణ పండితులకి అభిముఖంగా అలుపెరగని సామాజిక రాజకీయ సాంస్కృతిక పరివర్తన పోరాటం చేశారని వారి పోరాట ఫలిత మూలంగానే నేడు అణగారిన సమాజం,అగ్రవర్ణ స్త్రీలు స్వేచ్ఛ సమానత్వ సోదరభావ హక్కులు పొందుతూ చదువుకోగలుగుతున్నారుని అందులో భాగంగానే సావిత్రిబాయి పూలే కృషి త్యాగం పోరాటం మూలంగానే నేడు మహిళలు విద్యను అభ్యసించే హక్కును పొందుతున్నారని అన్నారు. నాడు సావిత్రిబాయి పూలే చేసిన కృషి, త్యాగం మూలంగానే నేడు ఆధునిక భారతదేశ చరిత్రలో తొలి మహిళా ఉపాధ్యాయురాలుగా చరిత్రకి ఎక్కడమే కాకుండా నిజమైన చదువుల తల్లిగా పిలువబడుతూ మేధావులు చేత,విద్యావంతుల చేత,సామాన్యుల చేత మన్ననలు పొందుతున్నదని మహారాష్ట్రలోని సతారా జిల్లాలో,ఖండాలా తాలూకాలోని నయాగావ్ గ్రామంలో జనవరి 3తేదీన 1831 లో సావిత్రిబాయి జన్మించిందని ఆనాటి సామాజిక కట్టుబాట్ల దృష్ట్యా తన తొమ్మిదవ యేటనే జ్యోతిరావు పూలేతో సావిత్రిబాయికి వివాహం జరిగిందని పూలే దంపతులకి వివాహమైన తదనంతరం సాంప్రదాయక జీవితంలో భాగంగా పిల్లలు కనలని ఆలోచన కలిగి లేకుండా సమాజంలో వెనుకబాటుకి గురవుతున్న పీడితులే తమ బిడ్డలుగా భావించి సొంత బిడ్డల్ని కూడా కలిగి ఉండకుండా అణగారిన సమాజం కోసం,మహిళల అభ్యున్నతి కోసం దేశంలోని అగ్రవర్ణ సమాజ పండితులు,నాయకులకి వ్యతిరేకంగా గొప్పనైన సామాజిక రాజకీయ పోరాటాలు చేశారని అందులో భాగంగానే నాడు భారత రాజ్యాంగానికి ముందు నుండి ఉన్న మనుధర్మ శాస్త్ర మూలంగా అణగారిన సమాజానికి, మహిళలకి హక్కులు లేని కారణంగా మహిళల సామాజిక రాజకీయ హక్కుల కోసం, మహిళల విద్య కోసం పూలే దంపతులు మనో సంకల్ప బద్ధులై మొట్టమొదటిసారిగా 1848 లో పూణేలో ఒక ఇంట్లో బాలికల పాఠశాలను ప్రారంభించారు. నిరక్షరాస్యులైన సావిత్రిబాయిని మహాత్మా జ్యోతిభా పూలేనే స్వయంగా విద్యావంతురాలని చేసి తాము స్థాపించిన పాఠశాలకి ప్రధాన మహిళా విద్యావంతురాలని చేశాడని వారి స్థాపించిన మొదటి పాఠశాలలో 9 మంది విద్యార్థులు చేరగా వారికి సావిత్రిబాయి పూలే గారే ప్రధానోపాధ్యాయురాలని వీరు స్థాపించిన మొదటి పాఠశాల ఆరు నెలలపాటు కొనసాగి మూతపడిందని కొన్ని నెలల తర్వాత మరొక భవనంలో మళ్లీ పాఠశాలని ప్రారంభించారని, అది నిర్వహిస్తున్నందుకుగాను నాటి సామాజిక పరిస్థితుల దృష్ట్యా అగ్రవర్ణ సమాజం నుండి తీవ్రమైన వ్యతిరేకతని పూలే దంపతులు ఎదుర్కొన్నారని స్త్రీల విద్యను వ్యతిరేకించే అగ్రవర్ణ ఛా%శీ%దాస పురుషులు గుంపుగా నిలబడి సావిత్రిబాయిని అసభ్య పదజాలంతో తిట్టేవారని ఎన్నో నెలాలపాటు ఆమె ఈ సామాజిక అవరోధాలని ధైర్యంగా ఎదుర్కొన్నదని అగ్రవర్ణ సమాజం నుండి నాయకులుగా చలామణి అవుతున్న పురుష ఛాందసవాదుల తప్పుడు మాటలను, భౌతిక దాడులని తట్టుకోలేక బోధన వృత్తిని నిరాకరిస్తానని జ్యోతిరావు పూలే కి చెప్పడంతో సావిత్రిబాయి జ్యోతిరావు పూలే ఆలోచన మేరకు సామాజిక పరివర్తనకి సంకల్ప బద్ధులై తాను పాఠశాల కి వెళ్లే మార్గంలో పాత వస్త్రాలు ధరించేది. బడుగు బలహీన వర్గాల పిల్లలకి మహిళలకి చదువు చెప్పే క్రమంలో వెళ్లే మార్గమధ్యలో అగ్రవర్ణ పురుషులు సావిత్రిబాయి పై పేడ నీళ్లు పోసేవారని రాళ్లతో కొట్టేవారని తప్పుడు మాటలు కూసేవారని వాటిని భరిస్తూ పాఠశాలకు వెళ్లాక అగ్రవర్ణ పురుష చందాసవాదులు కరాబ్ చేసిన బట్టల్ని పాఠశాలకు వెళ్లాక తన సంచిలో తీసుకెళ్లిన మరో వస్త్రాలని ధరించి పిల్లలకి చదువు చెప్పి ఇంటికి వచ్చేదని పూలే దంపతులు సామాజిక పరివర్తన కోసం స్త్రీల విద్యాభివృద్ధి కోసం చేస్తున్న పట్టుదలని జీర్ణించుకోలేని నాటి అగ్రవర్ణ పురుష చాందసవాదులు జ్యోతిరావు పూలే తండ్రి ఐన గోవిందరావు దగ్గరికి వెళ్లి పూలే దంపతులపై లేనిపోని ఆరోపణలు చేస్తూ ఫిర్యాదులు చెప్పేవారు.శూద్ర సమాజం,స్త్రీలు విద్యావంతులు అయితే సమాజం భ్రష్టు పట్టి పోతాదని మానవ సమాజంకు ముప్పు వస్తుందని అనే ఎన్నో మూఢనమ్మకాలు నాటి అగ్రవర్ణ పురుష ఆదిపత్య పండితులు,నాయకులు చెప్పేవారని అయిన వినకుండా భర్త యొక్క అడుగుజాడల్లోనే సమసమాజ స్థాపన కోసం, స్త్రీల అభ్యున్నతి కోసం సావిత్రిబాయి కూడా జ్యోతిభా పూలే తోనే మరణించేవరకు ప్రయాణించింది. అలా జ్యోతిభా పూలే ప్రోత్సాహంతో సావిత్రిబాయి 1852లో మహిళా సేవా మండల్ అనే మహిళ సంఘాన్ని స్థాపించింది. దాని ద్వారా మానవ హక్కుల గురించి, మరెన్నో సామాజిక సమస్యల గురించి, సామాజిక విలువల గురించి, స్త్రీల అభ్యున్నతి గురించి,స్త్రీలను చైతన్య పరచడానికి జ్ఞాన బోధ చేస్తూ ఎంతగానో కృషి చేసిందని అన్నారు. ఈ కార్యక్రమంలో బహుజన విద్యార్థి సంఘం నాయకులు దుర్గం మహేష్,గారే శ్రవణ్ దర్శనం అమర్,నాగమణి,హారిక, కృష్ణ వేణి, స్వాతి లహరిక, సౌమ్య,అనామిక 30 మంది విద్యార్థులు పాల్గొన్నారు.

## చలికాలంలో శరీరం వెచ్చగా ఉండాలంటే.. ఈ డ్రై ఫ్రూట్స్ తినాల్సిందే!

**సత్యమేవ జయతే -** చలికాలంలో సూర్యరశ్మి తక్కువగా ఉంటుంది. ఈ సీజన్ లో సరైన ఆహారం తీసుకోకపోతే అర్యోగం మీద ప్రభావం పడుతుంది. అంతేకాకుండా రోగనిరోధక శక్తి బలహీనపడుతుంది. చలికాలంలో జలుబు, దగ్గు, ఇన్ఫెక్షన్ వంటి జబ్బులు వెంటాడుతాయి. వీటిని



నివారించాలంటే మన శరీరాన్ని వెచ్చగా ఉంచుకోవాలి. దీని కోసం ఆహారంలో కొన్ని డ్రై ఫ్రూట్స్‌ని చేర్చుకోవచ్చు. ఈ డ్రై ఫ్రూట్స్‌లో విటమిన్లు, మినరల్స్, యాంటీఆక్సిడెంట్లు పుష్కలంగా ఉంటాయి. ఇవి జలుబు నుండి రక్షించడమే కాకుండా శరీరానికి శక్తిని ఇస్తాయి. ఈ క్రమంలో చలికాలంలో ఏ డ్రై ఫ్రూట్స్ శరీరానికి వెచ్చదనాన్ని ఇస్తాయో తెలుసుకుందాం.

**బాదం..** బాదం చలికాలంలో తినడానికి చాలా సరైనది. ఇందులో ప్రొటీన్, ఫైబర్, విటమిన్ ఇ, కాల్షియం, కాపర్, మెగ్నీషియం వంటివి పుష్కలంగా లభిస్తాయి. కావున కనీసం రోజుకు రెండు నుండి ఐదు నానబెట్టిన బాదంపప్పులను తినడం మంచిది. అందువల్ల ఇది శరీరాన్ని వెచ్చగా ఉంచుతుంది.

**వాల్నట్..** వాల్‌నట్స్‌లో ఒమేగా-3 ఫ్యాటీ యాసిడ్‌లు పుష్కలంగా ఉంటాయి. ఇది గుండె ఆరోగ్యానికి, మెదడుకు చాలా మేలు చేస్తుంది. ఇది కాకుండా.. వాల్‌నట్‌లు యాంటీఆక్సిడెంట్ల మంచి మూలం. ఇది వైరస్ ఇన్‌ఫెక్షన్లతో పోరాడడంలో ఎంతో సహాయపడుతుంది.

**ఎండిన అంజీర్..** ఎండిన అంజీర చలికాలంలో శరీరాన్ని వెచ్చగా ఉంచడంలో సహాయపడుతుంది. ఇందులో జింక్, మెగ్నీషియం, ఐరన్ వంటి పోషకాలు పుష్కలంగా లభిస్తాయి. చలికాలంలో రోజూ అంజీర పండ్లను తినడం వల్ల రోగనిరోధక శక్తి బలపడుతుంది. అంతేకాకుండా జీర్ణవ్యవస్థను కూడా మెరుగ్గా ఉంచుతుంది. దీన్ని తినడం వల్ల మలబద్ధకం నుంచి కూడా ఉపశమనం లభిస్తుంది.

**పిస్తాపప్పులు..** పిస్తాలో పీచు, ప్రొటీన్ పుష్కలంగా ఉండటం వల్ల చలికాలంలో శరీరానికి శక్తినిస్తుంది. ఇందులో విటమిన్లు, మినరల్స్ పుష్కలంగా ఉంటాయి. ఇవి రక్తంలో చక్కెర స్థాయిని నియంత్రించడంలో సహాయపడతాయి. చలికాలంలో రోజూ 3-4 పిస్తాపప్పులు మాత్రమే తినడం మంచిది.

**జీడిపప్పు...** జీడిపప్పు అనేది ప్రోటీన్, జింక్, మెగ్నీషియం వంటి ముఖ్యమైన ఖనిజాల నిధి. జింక్ రోగనిరోధక శక్తిని బలోపేతం చేయడానికి, మెగ్నీషియం కండరాలను మెరుగ్గా ఉంచడానికి పనిచేస్తుంది. రోజూ నిద్రపోయే ముందు జీడిపప్పును పాలతో కలిపి తింటే మంచి నిద్ర వస్తుంది.

## గోదావరిఖని సబ్ డివిజన్ పరిదిలో మాంజ వాడకం నిషేదం

**- నిబంధనలకు విరుద్ధంగా ఎవరి ప్రవర్తించిన కఠిన చర్యలు తప్పవు : ఎసిపి గోదావరిఖని**




**సత్యమేవ జయతే -గోదావరిఖని :** గోదావరిఖని సబ్ డివిజన్ పరిధిలో చైనా మాంజ పై నిషేధం. ఎవరైనా చైనా మాంజా అమ్మిన, దాని వలన ఎవరికైనా ప్రమాదం జరిగిన వారిపై చట్టపరమైన కఠిన చర్యలు తప్పవని ఎసీపీ రమేష్ హెచ్చరించారు. సంక్రాంతి సందర్భంగా చైనా మాంజ విక్రయించే దుకాణాలపై అధికారులు తనిఖీ లు నిర్వహించడం జరుగుతుందని, సంక్రాంతి పండుగ తర్వాత చైనా మంజా వ్యర్ధాల వల్ల పక్షులతోపాటు మనుషులకు హాని కలుగుతోందని గోదావరిఖని ఎసిపి ఎం.రమేష్ తెలిపారు. చైనా మాంజా అమ్మినా, నిలువ, రవాణా చేసినా ఐదేళ్లు జైలు శిక్ష, జరిమానా ఉంటుందని హెచ్చరించారు.

## రెండు ఆటోలను ఢీ కొట్టిన కారు: ముగ్గురు మృతి



**సత్యమేవ జయతే -గుమ్మడిదల సంగారెడ్డి జిల్లా జనవరి03 :** సంగారెడ్డి జిల్లాలో శుక్ర వారం ఉదయం ఘోర రోడ్డు ప్రమాదం సంభవించింది. గుమ్మడిదల మండలం నల్లవల్లి అటవీ ప్రాంతంలో 2 ఆటోలు.. కారు ఢీ కొన్నాయి. నర్సాపూర్ పట్టణ సమీపంలోని మెడలమ్మ గుడి వద్ద అతివేగంతో ప్రయాణిస్తోన్న కారు అదుపుతప్పి ఎదురుగా వస్తున్న రెండు ఆటోలపై దూసుకెళ్లింది. దీంతో ప్రమాదంలో ఆటో లోని ముగ్గురు తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందారు. కారులోని ఉన్నవారికి కూడా గాయాలయ్యాయి. కారు నర్సాపూర్ నుంచి హైదరా బాద్‌కు వెళ్తుండగా ఈ ప్రమాదం చోటుచేసుకుంది. ప్రమాదం గురించి సమాచా రం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. గాయపడిన నలుగురిని సమీపంలోని ఆసుపత్రిలో చేర్పించారు. ప్రమాదంపై కేసు నమోదు చేసి.. మృతదేహాలను స్వాధీనం చేసుకుని పోస్ట్‌మార్టం కోసం తరలించారు. అతివేగమే ప్రమాదానికి కారణమని ప్రాథమికంగా నిర్ధారణకు వచ్చారు. కారు డ్రైవర్ నిర్లక్ష్యం వల్లే ప్రమాదం జరిగినట్టు భావిస్తున్నారు. వేగంగా వచ్చి ఆటోలను ఢీకొట్టడం వల్ల అందులోని ఉన్న ప్రయాణికులు చెల్లాచె దురుగా పడిపోయారు. ఘటనా స్థలిలో బీతావాహ పరిస్థితి నెలకుంది. దీనికి సంబంధించిన పూర్తి వివరాలు ఇంకా తెలియాల్సి ఉంది.

## ప్రభుత్వ పాఠశాలలో నిర్వహించిన శ్రీ సావిత్రి బాయి పూలే జయంతి వేడుకలలో ముఖ్య అతిథిగా పాల్గొన్న కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్..





**సత్యమేవ జయతే -పటాన్ చెరువు :** చదువుల తల్లి, బడుగు బలహీనవర్గాల ఆడ బిడ్డల ఆశాజ్యోతి శ్రీ సావిత్రి బాయి పూలే గారి జయంతి సందర్భంగా ఈ రోజు పటాన్చెరువు డివిజన్ పరిధిలోని పాత మార్కెట్ వద్ద గల ప్రభుత్వ పాఠశాలలో ఏర్పాటు చేసిన సావిత్రి బాయి జయంతి వేడుకలలో కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్ గారు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా కార్పొరేటర్ గారు మాట్లాడుతూ పురుషాధిక్యతను రూపుమాపుతూ, నిమ్న వర్గాల ఆడబిడ్డల అభ్యున్నతి విద్య ద్వారానే సాధ్యమని మొట్ట మొదటిగా పూణేలో బాలికల పాఠశాల ప్రారంభించిన భారత ప్రథమ మహిళా ఉపాధ్యాయురాలు శ్రీ సావిత్రి బాయి పూలే అని కొనియాడారు. ఆ మహా మూర్తి జయంతి సందర్భంగా విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో MPPS హెడ్ మాస్టర్ రవీంద్ర గారు, హై స్కూల్ ఇంచార్జ్ సీతా మహాలక్ష్మి , ఉపాధ్యాయులు రఘుపతి , మోహన్ , ధనరాజ్ రూప్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా కలెక్టర్ మను చౌదరి మరియు కమిషనర్ ఆఫ్ పోలీస్ అనురాధను నూతన సంవత్సర శుభాకాంక్షలు

**- తెలంగాణ నాన్ గెజిటెడ్ ఆఫీసర్స్ యూనియన్ సిద్దిపేట**



**సత్యమేవ జయతే- సిద్దిపేట :** సిద్దిపేట జిల్లా ఆధ్వర్యంలో శుక్రవారం సిద్దిపేట జిల్లా కలెక్టర్ మను చౌదరి మరియు కమిషనర్ ఆఫ్ పోలీస్ అనురాధ ను నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేస్తూ సిద్దిపేట జిల్లాలో ఉన్న వసతిగృహ సంక్షేమ హాస్టల్లో చదువుతున్నటువంటి పదోతరగతి విద్యార్థులకు ఆల్ ఇన్ వన్ బుక్స్ టీఎన్జీవోస్ సిద్దిపేట జిల్లా తరఫున అందజేశారు అలాగే సిద్దిపేట టీఎన్జీవోస్ నూతన క్యాలెండర్ ను అలాగే కలెక్టరేట్ యూనిట్ క్యాలెండర్ ను కలెక్టర్ ఆవిష్కరించారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సిద్దిపేట ఉద్యోగులందరికీ మీ కుటుంబ సభ్యులకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేస్తూ కొత్త సంవత్సరంలో కొత్త ఆశలతో అందరూ ఉద్యోగస్తులు పనిచేయాలని తెలంగాణ రాష్ట్రంలోనే ఉద్యోగులందరూ కూడా ఉత్తమంగా పనిచేసే సిద్దిపేట జిల్లాను అన్ని రంగాలలో ముందు ఉండే విధంగా చూడాలని ఉద్యోగులకు మంచి చెడులన్నీ ఏ సమస్య వచ్చినా మా దగ్గర తీసుకొస్తే సమస్యను పరిష్కరించే విధంగా ఆలోచిస్తామని పోయిన సంవత్సరంలో ఎలాగైతే ఉద్యోగులు పనిచేసే జిల్లాకు అవార్డులు తెచ్చిపెట్టారు అదే రకంగా ఈ సంవత్సరం కూడా పనిచేసి సిద్దిపేట జిల్లాలో అన్ని రంగాలలో అవార్డులు రివార్డులు తీసుకొని రావాలని కోరారు ఈ సందర్భంగా టీఎన్జీవో సిద్దిపేట జిల్లా అధ్యక్షులు గ్యాదరి పరమేశ్వర్ కార్యదర్శి కోమండ్ల విక్రం రెడ్డి మాట్లాడుతూ ఉద్యోగులందరికీ నూతన శుభాకాంక్షలు తెలియజేస్తూ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి సమర్థవంతంగా తీసుకుపోతున్నటువంటి జిల్లా సిద్దిపేట జిల్లా అని సిద్దిపేట జిల్లాను అన్ని రంగాల్లో ముందు ఉంచే విధంగా ఉద్యోగస్తులు శ్రమిస్తూ ఉన్నారని ఉద్యోగుల శ్రమ ఫలితంగా ఎన్నో అవార్డులు రివార్డులు వచ్చాయని అదే స్థాయిలో ఈ సంవత్సరం కూడా పనిచేసే ఎన్నో అవార్డులు రివార్డు సిద్దిపేట జిల్లాకు తీసుకొస్తామని తెలంగాణ ప్రాంత వ్యాప్తంగా కాకుండానే భారతదేశం లోనే అత్యుత్తమ జిల్లాగా సిద్ధిపేట ను తీర్చిదిద్దే ఆవశ్యకత ఉద్యోగులపై ఎంతో ఉందని అన్ని వేళల్లో ఉద్యోగులందరూ కూడా అందుబాటులో ఉండి పనిచేయడానికి సిద్ధంగా ఉన్నారని అన్ని సమస్యలపై కలెక్టర్ తో ఒకరోజు చర్చించి సమస్యలు పరిష్కారం అయ్యే విధంగా చర్యలు తీసుకుంటామని చెప్పారు ఈ కార్యక్రమంలో జిల్లా సహాధ్యక్షుడు సురేందర్ రెడ్డి కోశాధికారి అశ్వక్ అహ్మద్ మహిళా ఉద్యోగులు వినయ సుకుమారి, జబీనా సుల్తానా, అరుణ, అనురాధ, జమున రాణి, శ్వేత, కృష్ణమూర్తి, మొండయ్య, గణేష్, సాయి శ్రీకాంత్, సత్యనారాయణ కలెక్టర్ టిఎన్జిఎస్ అధ్యక్షులు నగేష్ కార్యదర్శి సుమన్ సిద్దిపేట యూనిట్ కార్యదర్శి సత్యనారాయణ జిల్లా కార్యవర్గ సభ్యులు కలెక్టర్ ఉద్యోగస్తులు సిద్దిపేట ఉద్యోగస్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు

## ఘనంగా సావిత్రిబాయి పూలే జయంతి



**సత్యమేవ జయతే - కొల్లాపూర్ :** బీ.ఎస్.ఫ్.ఐ రాష్ట్ర కార్యదర్శి బి. దాస్. బీసి విద్యార్థి నాయకుడు భరత్ యాదవ్. బీ.ఎస్.ఫ్.ఐ కొల్లాపూర్ నియోజక వర్గ అధ్యక్షుడు కే. గణేష్.బీ.ఎస్.ఫ్.ఐ కొల్లాపూర్ నియోజక వర్గ కన్వీనర్ .దేవిక. కొల్లాపూర్ పట్టణ కేంద్రంలోని మహిళా జూనియర్ కళాశాల ఆవరణలో బిఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో సావిత్రిబాయి పూలే జయంతిని ఘనంగా నిర్వహించడం జరిగింది ఈ సందర్భంగా బహుజన స్టూడెంట్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా బీ.ఎస్.ఫ్.ఐ రాష్ట్ర కార్యదర్శి బి.దాస్ మాట్లాడుతూ సావిత్రిబాయి పూలే అన్ని వర్గాల్లో ఉన్న మహిళలకు చదువు కోసం పోరాటం కొనసాగించారని సావిత్రిబాయి పూలేను ప్రతి విద్యార్థి ఆదర్శంగా తీసుకుని ఉన్నతంగా ఎదగాలని మహిళలు అన్ని రంగాల్లో ముందుండాలని అన్నారు సావిత్రిబాయి పూలే మరియు మహాత్మ జ్యోతిరావు పూలే సత్యశోధక్ సంస్థను నెలకొల్పి వితంతువులు గర్భిణీ స్త్రీలకు ఎంతో సేవ చేశారని భారతదేశంలో మొట్టమొదటిసారి మహిళ పాఠశాల నెలకొల్పారని అన్నారు ఈ కార్యక్రమంలో మహిళా జూనియర్ కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

## మహిళల అభ్యున్నతికి దారి చూపిన మార్గదర్శి, కుల వివక్ష, పితృస్వామిక పీడలపై పోరాడిన వీరనారి, సామాజిక సంస్కర్త సావిత్రిబాయి పూలే

**- సంగారెడ్డి నియోజకవర్గ ఎమ్మెల్యే చింత ప్రభాకర్**



**సత్యమేవ జయతే- సంగారెడ్డి :** మహిళల అభ్యున్నతికి దారి చూపిన మార్గదర్శి, కుల వివక్ష, పితృస్వామిక పీడలపై పోరాడిన వీరనారి, సామాజిక సంస్కర్త సావిత్రిబాయి పూలే అని స్థానిక ఎమ్మెల్యే చింత ప్రభాకర్ గారు పేర్కొన్నారు... శుక్రవారం సావిత్రి బాయి పూలే జయంతి సందర్భంగా సంగారెడ్డి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆమె చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు...ఈ సందర్భంగా పూలె దంపతుల సేవలను త్యాగాలను గుర్తు చేసుకున్నారు... కార్యక్రమంలో మాజీ సీడీసీ చైర్మన్ లు కాసాల బుచ్చిరెడ్డి, విజేందర్ రెడ్డి, పట్టణ అధ్యక్షులు ఆర్ వెంకటేశ్వర్లు మండల పార్టీ అధ్యక్షులు, బిఆర్ఎస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# యూట్యూబ్‌ని షేక్ చేస్తున్న 'సంక్రాంతికి వస్తున్నాం' సాంగ్స్



**సత్యమేవ జయతే సినిమా :** విక్టరీ వెంకటేష్, బ్లాక్‌బస్టర్ మెషిన్ అనిల్ రావిపూడి, ప్రతిష్టాత్మక శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ సక్సెస్ ఫుల్ కొలాబరేషన్ లో హైలీ యాంటిసిపేటెడ్ మూవీ 'సంక్రాంతికి వస్తున్నాం' ఆల్బమ్ చార్ట్ బస్టర్ హిట్ అయ్యింది. విడుదలైన మూడు పాటలు సెన్సేషన్ క్రియేట్ చేశాయి. భీమ్స్ సిసిరోలియో కంపోజ్ చేసిన గోదారి గట్టు, మీను, బ్లాక్ బస్టర్ పొంగల్ ట్రాక్స్ యూట్యూబ్, అన్ని మ్యూజిక్ చార్ట్స్ లో టాప్ ట్రెండింగ్ లో మోత మోగిస్తున్నాయి.

బ్లాక్‌బస్టర్‌పొంగల్ సాంగ్ ప్రస్తుతం 3వ స్థానంలో ఉంటూ పండగ వైబ్ ని రెట్టింపు చేసింది. మీను సాంగ్ 6వ స్థానంలో ఆడియన్స్ అలరిస్తోంది. విడుదలైనప్పటి నుంచి టాప్ ట్రెండింగ్ లో వున్న గోదారిగట్టు సాంగ్10వ స్థానంలో అదరగొడుతోంది.ఈ మూడు పాటలకు 85 మిలియన్ల వ్యూస్ దాటాయి, ఈ రికార్డ్ బ్రేకింగ్ వ్యూస్ పాటలకున్న పాపులారిటీని తెలియజేస్తున్నాయి. సాంగ్స్ సోషల్ మీడియా ప్లాట్‌ఫారమ్స్ లో ఫ్యాన్స్ డ్యాన్స్ కవర్‌లు, రీల్స్ లో కూడా టాప్ ట్రెండింగ్ లో వున్నాయి. ఈ మూడు పాటలు 100 మిలియన్ వ్యూస్ కి చేరువయ్యాయి. సెన్సేషనల్ హిట్ గా నిలిచిన 'సంక్రాంతికి వస్తున్నాం' ఆల్బమ్ ఈ సీజన్‌లో మోస్ట్ సెలబ్రేటెడ్ ఆల్బమ్ గా అదరగొట్టింది.

ఈ మూవీలో వెంకటేష్ ఎక్స్ కాప్ గా, ఐశ్వర్య రాజేష్ అతని భార్యగా, మీనాక్షి చౌదరి ఎక్స్ లవర్ గా కనిపించనున్నారు. ఈ చిత్రాన్ని దిల్ రాజు సమర్పణలో శిరీష్ ప్రతిష్టాత్మకంగా నిర్మించారు.

ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీని సమీర్ రెడ్డి నిర్వహిస్తుండగా, ఎఎస్ ప్రకాష్ ప్రొడక్షన్ డిజైనర్, తమ్మిరాజు ఎడిటర్. చిత్రానికి స్క్రీన్‌ప్లేను ఎస్ కృష్ణ, జి ఆదినారాయణ అందించగా, వి వెంకట్ యాక్షన్ సన్నివేశాలకు కొరియోగ్రఫీ చేస్తున్నారు.సంక్రాంతికి వస్తున్నాం జనవరి 14న సంక్రాంతి కానుకగా విడుదల కానుంది.తారాగణం: వెంకటేష్, మీనాక్షి చౌదరి, ఐశ్వర్య రాజేష్, ఉపేంద్ర లిమాయే, సాయి కుమార్, నరేష్, గణేష్, మురళీధర్ గౌడ్, పమ్మి సాయి, సాయి శ్రీనివాస్, ఆనంద్ రాజ్ మహేష్ బాలరాజ్, ప్రదీప్ కబ్రా, చిట్టి

సాంకేతిక సిబ్బంది:
రచన, దర్శకత్వం: అనిల్ రావిపూడి
సమర్పణ: దిల్ రాజు
బ్యానర్: శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్
నిర్మాత: శిరీష్
సంగీతం: భీమ్స్ సిసిరోలియో
డీవోపీ: సమీర్ రెడ్డి
ప్రొడక్షన్ డిజైనర్: A S ప్రకాష్
ఎడిటర్: తమ్మిరాజు
కో రైటర్స్: ఎస్ కృష్ణ, జి ఆదినారాయణ
యాక్షన్ డైరెక్టర్: రియల్ సతీష్
VFX: నరేంద్ర లోగిసా
డిజిటల్: హాష్‌ట్యాగ్ మీడియా

# మాజీ మంత్రి హరీష్ రావుకి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేసిన మాజీ ఎమ్మెల్యే భూపాల్ రెడ్డి



గౌరవ తెలంగాణ రాష్ట్రం మాజీ మంత్రివర్యులు సిద్దిపేట శాసనసభ్యులు కన్నీరు హరీష్ రావు గారిని మర్యాదపూర్వకంగా కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేసిన నారాయణఖేడ్ మాజీ శాసన సభ్యులు మహా రెడ్డి భూపాల్ రెడ్డి వారితోపాటు మండల పార్టీ ఉపాధ్యక్షుడు నర్సింలు యాదవ్, మాజీ సర్పంచ్ రాజు, నాయకులు గోపాల్ యాదవ్, మహేష్ యాదవ్, సంగారెడ్డి, గణేష్ తదితరులు ఉన్నారు.

# విద్యుత్ షాక్ తగిలి ఎద్దు మృతి

## - రూ .80 వేలు ఆస్తి నష్టం



**సత్యమేవ జయతే -పుల్కల్ :** పుల్కల్ మండల పరిధిలోని ముద్దాయి పేట గ్రామానికి చెందిన మహమ్మద్ యాదుల్ అనే రైతు కొన్ని సంవత్సరాలుగా వ్యవసాయం చేసుకుంటూ జీవనోపాధి కొనసాగిస్తున్నాడు రోజు లాగానే తమ కాడెడ్లను తీసుకొని వ్యవసాయ పొలానికి వెళ్ళాడు తన ఎడ్లను మేత మే సేందుకు తమ పొలంలో వదిలాడు తమ కాడెడ్లు మేతమేసుకుంటూ పక్కా పొలంలో ఉన్న ట్రాన్స్ఫార్మర్ కు తగలడంతో ఒక్కసారిగా విద్యుత్ షాక్ తగలడంతో తమ విలువైన భారీ ఎద్దు అక్కడికక్కడే మృతి చెందడంతో ఆ రైతు కుటుంబం కన్నీటి పర్వతమయ్యారు ఇది విద్యుత్ అధికారుల నిర్లక్ష్యం ట్రాన్స్ఫార్మర్ కు చుట్టూ కంచె లేకపోవడంతో నే తమ ఎద్దు మృతి చెందిందని ఆ కుటుంబ సభ్యులు బోరున విలపించారు కావున విద్యుత్ అధికారులు స్పందించి తమకు రూ. 80 వేల ఆస్తి నష్టం అందించే విధంగా విద్యుత్ శాఖ అధికారులు తగు చర్యలు తీసుకోవాలని ఆ కుటుంబ సభ్యులు కోరారు.

# చదువుల తల్లి సావిత్రిబాయి పూలే జయంతి సందర్భంగా ఘన నివాళులు అర్పించిన ఏటూరునాగారం మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు...

- సావిత్రిబాయి పూలే జయంతి సందర్భంగా ప్రభుత్వ జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో సందర్శన చేపట్టిన మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు...
- ఉపాధ్యాయులను అభినందించి, శాలువాతో సన్మానించిన మండల కాంగ్రెస్ నాయకులు...
- సావిత్రిభాయి పూలే జన్మదినాన్ని మహిళా ఉపాధ్యాయ దినోత్సవంగా ప్రభుత్వం అధికారికంగా ప్రకటించేలా కృషి చేసిన మంత్రి సీతక్క గారికి కృతజ్ఞతలు...
- విద్య కు మొదటి ప్రాధాన్యత చూపుతున్న కాంగ్రెస్ ప్రభుత్వం...
- ఉపాధ్యాయులు, విద్యార్థుల సమస్యలను తెలుసుకోని మంత్రి సీతక్క గారి దృష్టికి తీసుకెళ్తామని హామీ ఇచ్చిన కాంగ్రెస్ నాయకులు...








**సత్యమేవ జయతే -ఏటూరు నాగారం :** తేది :03.01.2025 అనగా ఈ రోజున పంచాయతీరాజ్ గ్రామీణ అభివృద్ధి స్త్రీ శిశు సంక్షేమ, నీటి పారుదల శాఖ మంత్రివర్యులు ధనసరి అనసూయ సీతక్క గారి ఆదేశాల మేరకు, జిల్లా అధ్యక్షులు పైడాకుల అశోక్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు ఇర్సవడ్ల వెంకన్న గార్ల సూచనమేరకు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు చిటమట రఘు గారి ఆధ్వర్యంలో చదువుల తల్లి సావిత్రిబాయి పూలే జయంతి సందర్భంగా ఘన నివాళులు అర్పించి, ప్రభుత్వ పాఠశాలను సందర్శించిన మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు. ఈ సందర్భంగా మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు చిటమట రఘు మాట్లాడుతూ చదువుల తల్లి సావిత్రిబాయి జయంతి సందర్భంగా చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులు అర్పించడం జరిగింది.అదేవిదంగా సావిత్రిబాయి పూలే జయంతి పురస్కరించుకొని ఏటూరునాగారం మండల కేంద్రంలోని ప్రభుత్వ జడ్పీహెచ్ ఎస్ పాఠశాలను సందర్శన చేపట్టడం జరిగింది. ఉపాధ్యాయులను అభినందించి, శాలువాతో సన్మాన కార్యక్రమము నిర్వహించడం జరిగింది. సావిత్రిభాయి పూలే జన్మదినాన్ని మహిళా ఉపాధ్యాయ దినోత్సవంగా ప్రభుత్వం అధికారికంగా ప్రకటించేలా కృషి చేసిన మంత్రి సీతక్క గారికి కృతజ్ఞతలు.విద్య కు మొదటి ప్రాధాన్యత చూపుతున్న కాంగ్రెస్ ప్రభుత్వమని ఉపాధ్యాయులు, విద్యార్థుల సమస్యలను ఉంటే తెలపితే మంత్రి సీతక్క గారి దృష్టికి తీసుకెళ్తామని హామీ ఇచ్చిన కాంగ్రెస్ నాయకులు. విద్యార్థుల భోజనం ను పరిశీలించి విద్యార్థులతో,వంట సిబ్బంది, ఉపాధ్యాయు లతో మాట్లాడారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు ఎండీ ఖలీల్ ఖాన్, కాంగ్రెస్ మండల ఉపాధ్యక్షుడు సొసైట్ వైస్ చైర్మన్ చెన్నూరి బాలరాజు, జిల్లా పార్టీ కార్యదర్శి గుడ్ల దేవేందర్, బ్లాక్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి వావిలాల నర్సింగరావు ,యూత్ బ్లాక్ అధ్యక్షులు వసంత శ్రీనివాస్, మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు గద్దల నవీన్, టౌన్ యూత్ అధ్యక్షులు బండారి లక్కీ, రామన్నగూడెం యూత్ అధ్యక్షులు పెద్ది రాజబాబు, కోపుల శ్రీను,ఎండీసలీం, చేనేష్ రావు,కోటేశ్వరరావు మదుకురి పాల్గొన్నారు.

# థాయ్‌లాండ్ ప్రధాని ఆస్తులు 3 వేల కోట్లు



**బ్యాంకాక్, జనవరి 3:** థాయ్‌లాండ్ ప్రధాని పేటోంగ్టార్న్ షినవత్ర తనకు భారీ ఆస్తులున్నట్టు శుక్రవారం ప్రకటించారని ఆమె పార్టీ వర్గాలు తెలిపాయి. ఆమె దగ్గర రూ.17 కోట్ల విలువైన 200 డిజైనర్ బ్యాగులు, రూ.42 కోట్ల విలువైన 75 లేటెస్ట్ లగ్జరీ వాచ్‌లు ఉన్నాయని స్థానిక మీడియా తెలిపింది. జాతీయ అవినీతి వ్యతిరేక కమిషన్‌కు ఆమె ఈ వివరాలు సమర్పించారు. తనకు మొత్తం రూ.3,430 కోట్లకు పైగా ఆస్తులున్నట్టు షినవ్రత తెలిపారు.

టెలికం బిలియనీర్, థాయ్ మాజీ ప్రధాని థక్సిన్ షినవ్రత చిన్న కూతురైన పేటోంగ్టార్న్ గతేడాది సెప్టెంబర్‌లో ప్రధానిగా పదవీ బాధ్యతలు చేపట్టారు. తనకు 11 బిలియన్ బాత్(థాయ్ కరెన్సీ) పెట్టుబడులు ఉన్నాయని ఆమె తెలిపారు. తనకు సుమారు అయిదు బిలియన్ బాత్‌ల అప్పులున్నట్టు కూడా ఆమె ప్రకటించారు. థక్సిన్ కుటుంబం షిన్ కార్ప్ టెలికమ్యూనికేషన్ కంపెనీతో వ్యాపారంలో బాగా లాభాలు గడించింది. ఆ తర్వాత ఆయన కుటుంబం రాజకీయాల్లోకి వచ్చింది. పేటోంగ్టార్న్ తన కుటుంబం నుంచి థాయ్ ప్రధానిగా ఎన్నికైన నాలుగో వ్యక్తి.

# డేంజర్ బెల్స్.. చైనాలో మరో మహమ్మారి.. అప్రమత్తమైన భారత్.. వైరస్ లక్షణాలివే..



చైనా పేరు వార్తల్లో వినిపిస్తే చాలు ప్రపంచ దేశాలు ఉలిక్కిపడుతున్నాయి. కారణం మరో ప్రమాదకర వైరస్.. అవును.. కోవిడ్ -19 మహమ్మారి తర్వాత చైనాలో మరో కొత్త వైరస్ కలకలం రేపుతోంది. కొత్తగా పుట్టుకొచ్చిన హ్యూమన్‌మోటాన్యూమో వైరస్‌తో చైనా ప్రజలు పెద్ద ఎత్తున ఆసుపత్రుల ఎదుట క్యూ కట్టారంటూ వస్తోన్న వార్తలు ప్రపంచాన్ని మరోసారి ఉలిక్కిపడేలా చేస్తున్నాయి. ఈ వ్యాధి వ్యాప్తిపై ప్రపంచదేశాలు ఆందోళన వ్యక్తం చేస్తున్న నేపథ్యంలో భారత ప్రభుత్వం అప్రమత్తమైంది. ఈ వైరస్ వ్యాప్తిపై దృష్టి పెట్టాలని నేషనల్ సెంటర్ ఫర్ డిసీజ్ కంట్రోల్‌ని కేంద్ర ఆరోగ్య శాఖ ఆదేశాలు జారీ చేసింది. శ్వాసకోశ లక్షణాలు, ఇతర ఫ్లూ కేసులను నిశితంగా పరిశీలించాలని సూచించింది. చైనాలో కొత్త వైరస్ విషయంపై అంతర్జాతీయ ఏజెన్సీలతో సంప్రదింపులు జరుపుతున్నట్లు భారత ప్రభుత్వం తెలిపింది.

మరోవైపు భారత హెల్త్ ఏజెన్సీ డీజీహెచ్ఎస్ స్పందించింది. ప్రస్తుతం హ్యూమన్ మెటానిమోవైరస్ వ్యాప్తి పట్ల ఎవరూ భయపడాల్సిన అవసరం లేదని డీజీహెచ్ఎస్ విజ్ఞప్తి చేసింది. దీని గురించి పెద్దగా ఆందోళన చెందాల్సిన అవసరం లేదని వెల్లడించింది. శ్వాసకోశ సంబంధిత ఇన్ఫెక్షన్ల నుంచి కాపాడుకొనేందుకు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

**వైరస్ లక్షణాలివే..**

ఈ HMPV వైరస్ సోకినవారిలో కొవిడ్ తరహా లక్షణాలే కనిపిస్తాయి. దగ్గు, జ్వరం, ముక్కు రంధ్రాలు మూసుకుపోవడం, శ్వాస తీసుకోవడంలో ఇబ్బందులు వంటి లక్షణాలు ఈ వైరస్ సోకిన వారిలో ప్రధానంగా కనిపిస్తుంటాయి.

వైరస్ తీవ్రమైతే న్యుమోనియా లాంటి సమస్యలకు దారితీస్తుంది.

మూడు లేదా ఆరురోజుల వరకూ లక్షణాలు ఉంటాయి.

ఇన్‌ఫెక్షన్ తీవ్రతను బట్టి లక్షణాలు వేర్వేరు వ్యవధిలో ఉంటాయి.

కరోనా మాదిరిగానే ఒకరి నుంచి మరొకరికి ఈ వైరస్ ఈజీగా సోకుతుంది. చిన్న పిల్లలు, వృద్ధులు, రోగనిరోధక శక్తి తక్కువగా ఉన్న వాళ్లపై ఈ వైరస్ ప్రభావం ఎక్కువగా ఉంటుంది.

ఎడిటోరియల్

# సంస్కర్త, ఉద్యమశీలి



దేశ సాంఘిక సంస్కరణోద్యమంలో ఫూలే దంపతులు అద్భుతమైన పాత్ర పోషించారు. నాటి పరిస్థితుల్లో స్త్రీలు మాట్లాడటానికి కూడా అవకాశం లేదు. అయినప్పటికీ సామాజిక రుగ్మతలను పారదోలేందుకు తన వంతు కృషి చేసి నేటికీ ఆదర్శంగా నిలిచారు సావిత్రి బాయి ఫూలే. ఆమెకు తొమ్మిదేళ్ల వయసులో పదమూడేళ్ల జ్యోతి రావు ఫూలేతో (1840) వివాహం జరిగింది. వివాహానంతరం అభ్యుదయ భావాలున్న జ్యోతి రావు ఫూలే, సావిత్రి బాయి ఫూలేతో కలసి సాంఘిక సంస్కరణోద్యమంలో నూతన ఒరవడికి తెర లేపారు. ఈమె వివాహానంతరం ఇంట్లోనే విద్యాభ్యాసం ప్రారంభించారు. 1847లో ఉపాధ్యాయురాలిగా శిక్షణ పొందారు. 1848లో భర్త జ్యోతి రావు ఫూలేతో కలసి పూణేలో అణచివేతకు గురవుతున్న బాలికల కోసం పాఠశాలను ప్రారంభించారు. ఇది మొదట తొమ్మిది మంది బాలికలతో ప్రారంభమైంది. తర్వాత పూణె, సతారా, అహ్మదా నగర్‌లలో మరికొన్ని పాఠశాలలు స్థాపించారు. ఈమె పాఠశాలకు వెళ్లేటప్పుడు సనాతన ఛాందసవాదుల కారణంగా ఎన్నో అవమానాలు ఎదుర్కొన్నారు. ఆమెను మార్గ మధ్యలో ఆపి అసభ్యకరమైన పదజాలంతో దూషించి, రాళ్లతో దాడి చేసి, పేడ నీళ్ళు చల్లి అవమానించేవారు. అయినా సరే వెనుకడుగు వేయలేదు. తన సంచిలో అదనంగా మరో చీర పెట్టుకెళ్లి పాఠశాల దగ్గర మార్చుకునేవారు. వారు మొక్కవోని దీక్షతో ఎంతో మంది మహిళలను విద్యావంతులుగా మార్చేందుకు శ్రీకారం చుట్టారు. బాల్య వివాహాలను వ్యతిరేకించారు. చిన్న వయసులో వివాహం చేయటం వలన ప్రసవించే శక్తి లేక అనేకమంది బాలికలు ప్రాణాలు కోల్పోతున్నారని, చిన్న వయసులో భర్తను కోల్పోయిన వాళ్ళు వితంతువులుగా జీవితాన్ని గడపాల్సి వస్తుందనే వాదన దృఢంగా వినిపించారు. వితంతువులను హీనంగా చూస్తూ, గుండు గీయించి తెల్ల చీర కట్టించి, వారిని అశుభ సంకేతంగా చిత్రించేవారు. ఆ దురాచారాన్ని రూపుమాపేందుకు వితంతు పునర్వివాహాల్ని ప్రోత్సహించడమే గాక, దగ్గరుండి చేయించారు. వితంతు గర్భిణీల కోసం 1853లో ఒక గృహాన్ని ఏర్పాటు చేసి వారి బాగోగులు దగ్గరుండి చూసేవారు. వితంతు మహిళలకు గుండు గీసే పద్ధతి పోయేందుకు కృషి చేశారు. వరకట్నాన్ని వ్యతిరేకించారు. కులాంతర వివాహాలను ప్రోత్సహించారు. 1852లో మహిళా హక్కులను మహిళలకు తెలియజేసేందుకు, సామాజిక చైతన్యాన్ని పెంపొందించేందుకు 'మహిళా సేవా మండల్' ఏర్పాటు చేశారు. కార్మికులు, గ్రామీణ పేదలు కోసం జ్యోతి రావు ఫూలే 52 ఆహార కేంద్రాలను తెరిచారు. వీటన్నింటిని ఆమె చూసుకునేవారు. వారిరువురూ ఏర్పాటు చేసిన బోర్డింగ్ పాఠశాలలను దగ్గరుండి చూసుకునే వారు. 1863లో సంఘ బహిష్కృతులైన తల్లీపిల్లల కోసం శరణాలయం స్థాపించారు. ప్లేగు వ్యాధిగ్రస్తుల కోసం ఆశ్రమాన్ని ఏర్పాటు చేసి వారికి సేవ చేసే వారు. జ్యోతి రావు ఫూలే స్థాపించిన సత్య శోధక్ సమాజ్‌ని ఆయన మరణానంతరం ఈమె నడిపారు. ఈ రకంగా సామాజిక రుగ్మతలకు వ్యతిరేకంగా నిలబడిన ధీర వనిత సావిత్రి బాయి ఫూలే. స్త్రీల అభివృద్ధి కోసం తెగువతో నిలబడిన వీర వనిత. ప్లేగు వ్యాధిగ్రస్తులకు సేవ చేస్తూ తను కూడా ఆ వ్యాధి బారినపడి 1897 మార్చి 10న తుది శ్వాస విడిచారు సావిత్రి బాయి ఫూలే. ఆమె నాడు నేడు ఆదర్శప్రాయమే. ఆమె లక్ష్య సాధనకు కృషి చేద్దాం.

# అమెరికన్ సామ్రాజ్యవాద విష వారసత్వం




వియత్నాం యుద్ధం 1955 నుండి 1975 వరకు ఇరవయ్యేళ్ల పాటు కొనసాగింది. చరిత్రలో ఇంతటి విపత్కర అధ్యాయం పట్ల పశ్చాత్తాపం గాని, చేసిన దుర్మార్గం ఒప్పుకోలు ప్రకటనగానీ మనకు కానరాదు. ఈ యుద్ధం మానవ సమాజం మీదా, పర్యావరణం మీదా లోతైన గాయం మిగిల్చింది. ఇది మిగిలిన యుద్ధాల వంటి యుద్ధం కాదు. ఒక దేశం మీదో ఆ దేశ ప్రజానీకం మీదో, వాళ్లదైన చిన్న ప్రపంచం మీదో సామ్రాజ్యవాద శక్తులు నిరంతరాయంగా, నిర్దయగా చేసిన అమానవీయ, అమానుష యుద్ధం. ఈ యుద్ధం మాటున చేసిన విధ్వంసం, ప్రజానీకానికి మిగిల్చిన బాధ, వేదన కొన్ని దశాబ్దాలుగా ప్రతిధ్వనిస్తూనే ఉన్నాయి. ఈ యుద్ధానికి ఉన్న చారిత్రక మూలాలు, ఈ యుద్ధం మూలంగా జరిగిన పర్యావరణ విధ్వంసం వియత్నాం ప్రజానీకాన్ని ప్రపంచ ప్రజానీకాన్ని పీడకలలా వెంటాడుతూనే ఉన్నాయి.

**సామ్రాజ్యవాదం, ప్రచ్ఛన్న యుద్ధం దూకుడు**

వలస పాలనను వ్యతిరేకిస్తూ వియత్నమిన్ శక్తుల పోరాటాన్ని అణిచివేయాలని ప్రయత్నిస్తున్న ఫ్రాన్స్‌కు అమెరికా బలమైన తోడుగా నిలిచింది. అమెరికా అధ్యక్షుడు ఐసెన్ హోవర్ 1954లో వియత్నాంలో నెలకొన్న పరిస్థితులు, దక్షిణాసియాకు మధ్య ఉన్న బాదరాయణ సంబంధం గురించి వివరిస్తూ ఒక దేశంలో (వియత్నాం) కమ్యూనిజం విజయం సాధిస్తే చుట్టుపక్కల దేశాలన్నీ అదే మార్గం పడతాయన్న ఆందోళన వ్యక్తం చేశాడు. అమెరికా అండదండగా నిలబడిన ఫ్రాన్స్‌ను హొచిమిన్ నాయకత్వాన వియత్నమిన్ శక్తులు 1954లో డియన్ బియన్ ఫు దగ్గర పరాజయం పాల్జేశాయి. వియత్నాం నుండి ఫ్రాన్స్ సైన్యం వైదొలగింది. వియత్నాం స్వతంత్ర దేశంగా ప్రకటించుకున్నది. అయితే ఈ స్వాతంత్ర్యం అట్టే కాలం నిలవలేదు. దోపిడీ శక్తులు జెనీవా ఒప్పందం పేరిట వియత్నాం దేశాన్ని కమ్యూనిస్టు పార్టీ జయించుకున్న ఉత్తర వియత్నాం, కమ్యూనిస్టు వ్యతిరేక దక్షిణ వియత్నాంగా రెండుగా విభజించాయి. అమెరికా సామ్రాజ్యవాద దాహంతో వియత్నాం అంతర్గత వ్యవహారాలలో తలదూర్చింది. ఉత్తర వియత్నాంలో ఏర్పడిన కమ్యూనిస్టు ప్రభుత్వం దక్షిణాసియా ఖండంలో పశ్చిమ దేశాల ఆధిపత్యానికి సవాలుగా నిలుస్తుందని అమెరికా భావించింది. 1964లో టోన్‌కిన్ జల సంధిలో చోటు చేసుకున్నదని చెబుతున్న నావికాదళ స్వల్ప ఘర్షణను సాకుగా తీసుకుని అమెరికా అధ్యక్షుడు లిండన్ బి జాన్సన్ అమెరికన్ కాంగ్రెస్ అనుమతి లేకుండా ఏకపక్షంగా వియత్నాంపై సైనిక చర్యకు పిలుపునిచ్చాడు. అధునిక యుద్ధ చరిత్రలో అత్యంత పాశవికమైన యుద్ధానికి అలా అంకురార్పణ జరిగింది. 1965 నుండి 1973 వరకు అమెరికా 50 లక్షల మందికి పైగా సైన్యాన్ని వియత్నాం యుద్ధంలో మోహరించింది. అమెరికా వియత్నాంలో అంగుళం భూభాగాన్ని కూడా వదిలి పెట్టకుండా వైమానిక దాడుల ద్వారా బాంబుల వర్షం కురిపించింది. రసాయన యుద్ధానికి పాల్పడింది. అయితే అమెరికాలో ఈ యుద్ధానికి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నిరసన ప్రదర్శనలు చెలరేగాయి. అమెరికా దుర్మార్గ వైఖరికి వ్యతిరేకంగా అంతర్జాతీయ సమాజం తీసుకు వచ్చిన ఒత్తిడి, దేశీయంగా ఉధృతమైన నిరసనోద్యమాల నేపథ్యంలో అమెరికా వియత్నాం నుండి తన సైన్యాన్ని ఉపసంహరించుకుంటూ 1973లో పారిస్‌లో ఒక శాంతి ఒప్పందం మీద సంతకాలు చేసింది.

**బాంబు దాడుల తీవ్రత -సరికొత్త సాక్ష్యం**

అమెరికా వియత్నాం మీద బాంబు దాడులు చేసి విచక్షణా రహిత విధ్వంసానికి పాల్పడింది. కొత్తగా వెలుగు చూసిన రహస్య నివేదికలు ఈ బాంబు దాడుల వెనుక ఉన్న భయంకరమైన చేదు నిజాలను వెల్లడిస్తున్నాయి. వియత్నాం, లావోస్, కంబోడియాల మీద అమెరికా 130 లక్షల టన్నుల బాంబులు కురిపించింది. రెండవ ప్రపంచ యుద్ధంలో కురిపించిన మొత్తం బాంబుల పరిమాణం వియత్నాం మీద అమెరికా కురిపించిన బాంబులతో పోలిస్తే ఏ మూలకీ లెక్కలోకి రావు. క్వ్యాయాంగ్ ట్రై ప్రావిన్స్‌లోను, వియత్నాం, లావోస్, కంబోడియాల ఉమ్మడి సరిహద్దు ట్రై ప్రాంతంలోనూ దాదాపు 50,000 భారీ గోతులు ఉన్నట్లు కనుగొన్నారు. ఇవి కేవలం గోతులే కాదు. వీటి నిండా ఇంకా పేలని మందుగుండు పదార్థాలు నిండి ఉన్నాయని తేల్చి చెప్పారు. వియత్నాం యుద్ధం ముగిసి ఇప్పటికి యాభై ఏళ్లు కావస్తున్నది. ఈ రోజుకీ వియత్నాం గడ్డ మీద 6,00,000 టన్నుల పేలని మందు గుండు నిల్వలున్నాయి. యుద్ధం ముగిసినా ఈ పేలుడు పదార్థాల మూలంగా ఇప్పటి వరకూ లక్ష మంది సాధారణ పౌరులు దుర్మరణం పాలయ్యారని వియత్నాం ప్రభుత్వం అధికారికంగా వెల్లడించింది. వీటి మూలంగా ఈ రోజుకీ స్థానికులు భయం భయంగా దినదినగండంగా బతుకులు వెళ్లదీస్తున్నారు.

**రసాయన యుద్ధ విధ్వంసం**

మానవ జీవితాలంటే అమెరికా సామ్రాజ్యవాదానికి ఏ మాత్రం లెక్కలేదని వియత్నాంపై అది కురిపించిన బాంబులు తెలియచేస్తుంటే 'ఏజెంట్ ఆరెంజ్' పేరిట అది చేపట్టిన రసాయన యుద్ధం దాని రాక్షసత్వాన్ని వెల్లడిస్తుంది. 1962-1971 మధ్య కాలంలో అమెరికన్ సైన్యం వియత్నాం, తూర్పు లావోస్, కంబోడియాలోని కొన్ని ప్రాంతాలపై 750 లక్షల లీటర్ల విష రసాయనాలు విరజిమ్మింది. 1967-69 మధ్య కాలంలో ఈ విష రసాయనాలను అత్యధిక స్థాయిలో వినియోగిరచింది. సామూహిక విధ్వంసక ఆయుధాలలో రసాయన యుద్ధం అనేది మానవులు సృష్టించిన అత్యంత కిరాతక యుద్ధ క్రీడగా నిలుస్తుంది. ఈ రసాయన యుద్ధం ద్వారా వియత్నాంలో పంటలను, అడవులను దుంప నాశనం చేసింది అమెరికా. పర్యావరణ దృష్ట్యా చూస్తే ఇది మానవ ప్రేరేపిత ఉత్పాతం. 30 లక్షల హెక్టార్ల పచ్చని అడవులు బీళ్లుగా మారాయి. జీవ వైవిధ్యం ఘోరంగా దెబ్బతిని పోయింది. పర్యావరణానికి తీరని విపత్తు దాపురించింది.

'ఏజెంట్ ఆరెంజ్' రసాయనాల విష ప్రభావాలతో దాదాపు 30 లక్షల మంది వియత్నమీయులు అనారోగ్యం పాలైతే మరో పది లక్షల మంది అంగ వైకల్యానికి లోనయ్యారని అధికారికంగా లెక్కించారు. యుద్ధానంతరం జన్మించిన తరం పిల్లలకు తాము ఎందుకు జన్యుపరమైన లోపాలతో వికారంగా ఉన్నామో తెలియదు. యుద్ధం పేరిట వియాత్నాంలో అమెరికా సృష్టించిన విధ్వంసంతో పోలిస్తే అది చెల్లించిన పరిహారం హాస్యాస్పదంగా అనిపిస్తుంది.

యుద్ధం మూలంగా వియత్నాం ఆర్థిక వ్యవస్థ ఘోరంగా దెబ్బతిని పోయింది. సాగుకి లాయకీ అయిన భూములు%ొ%బాంబుల మూలంగా ధ్వంసం కావడం, లేదంటే ఏజెంట్ ఆరెంజ్ రసాయనాల మూలంగా దెబ్బతిని పోవడమో జరిగింది. దీనితో సాగు దెబ్బ తినిపోయి గ్రామీణ ప్రాంత ప్రజానీకం పేదరికంలోకి కూరుకుపోయారు. క్షుద్బాధ పట్టి పీడించింది. అటవీ ఉత్పత్తుల మీద ఆధారపడి జీవించే లక్షలాది మంది ప్రజానీకం కూడా జీవనోపాధి కోల్పోయి అదే దైన్యానికి లోనయ్యారు. నదులు, నీళ్ల చెలమలు, బావులు విష రసాయనాల ప్రభావంతో ప్రజల దాహార్తిని తీర్చడానికి పనికి రాకుండా పోయాయి. గత్యంతరం లేక అదే నీటిని వాడుకున్న జనం రోగాల పాలయ్యారు.

సామాజిక జన జీవితం అస్తవ్యస్థం అయిపోయింది. మరణాలు, విస్థాపనలు, యుద్ధం మూలాన ఏర్పడిన మానసిక సమస్యలతో కుటుంబాలకు కుటుంబాలే విచ్ఛిన్నమై పోయాయి. ఈ యుద్ధం ములంగా ఇరవై లక్షల మంది వియత్నమీయులు మరణించారు. అనేక లక్షల మంది విస్థాపనకు గురయ్యారు. తత్ఫలితంగా అతి పెద్ద మానవ సంక్షోభం నెలకొన్నది. యుద్ధానంతరం దేశ పునర్నిర్మాణ ప్రక్రియ చాలా నెమ్మదిగా నడిచింది. యుద్ధం మూలంగా నెలకొన్న విధ్వంసం అంతటి తీవ్ర స్థాయిది కావడం ఒక కారణమైతే, పునర్నిర్మాణ ప్రక్రియకు అంతర్జాతీయ సహకారం ఆశించినంతగా అందకపోవడం మరో కారణం.

**యుద్ధం-జవాబుదారీతనం**

ప్రపంచవ్యాప్తంగా ఇప్పటి వరకూ జరిగిన యుద్ధాల్లో అత్యధికం అమెరికా స్వీయ ప్రయోజనాల కోసం, అమెరికా తోడ్పాటుతో జరిగినవే. వియత్నాం యుద్ధం నేర్పిన గుణపాఠాలను అమెరికా ఈ రోజుకీ పెద్ద ఎత్తున విస్మరిస్తున్నది.

ఈ అమానవీయ యుద్ధానికి నైతికంగా బాధ్యత వహించకపోవడం అమెరికా ప్రధాన వైఫల్యం. విషతుల్యమైన పదార్థాల ప్రక్షాళన, ఆ రసాయనాల ఫలితంగా తలెత్తిన ఆరోగ్య సమస్యలను చక్కదిద్దడానికి అమెరికా పూర్తి బాధ్యత వహించకపోవడం క్షంతవ్యం కాని నేరం. అమెరికా పెద్ద ఎత్తున ఈ సమస్యల పరిష్కారానికి పూచీ పడడంతో పాటు ప్రపంచవ్యాప్తంగా ఎక్కడా యుద్ధాలను ప్రేరేపించడం గానీ, యుద్ధాలకు మద్దతుగా నిలబడడం కానీ చేయరాదు.

వియత్నాం యుద్ధం మిగిల్చిన గాయాలను చూసి అమెరికా ఆత్మపరిశీలన చేసుకోవాలి. అమెరికా చేసిన తప్పులకు పరిహారంగా అక్కడి పరిస్థితులను చక్కదిద్దేందుకు తగిన కార్యాచరణ పథకాన్ని చేపట్టాలి. విచ్చలవిడిగా బాంబులు ప్రయోగించడం, రసాయన జీవ ఆయుధాలను వినియోగించడం మీద పూర్తి నిషేధం విధించేలా ప్రపంచ దేశాల మీద అంతర్జాతీయ సమాజం ఒత్తిడి తీసుకురావాలి. ఇజ్రాయిల్ వంటి ధూర్త దేశాల మీద కఠిన చర్యలు చేపట్టాలి. యుద్ధ పరిహారం చెల్లింపు దానధర్మంగా ఇచ్చేది కాదు. సహజ న్యాయ సూత్రాలకు కట్టుబడి పరిహారం చెల్లించాలి.

పారదర్శకతకు, జవాబుదారీతనానికి అమెరికా పెట్టింది పేరు అంటుంటారు. అదే నిజమైతే వియత్నాం యుద్ధ బాధితులను అన్ని విధాలా ఆదుకునేందుకు తక్షణమే సమగ్ర సహాయ ప్రణాళికను ప్రకటించి అమలు చెయ్యాలి. లేని పక్షంలో యుద్ధం మూలంగా ఒనగూడిన అన్యాయాలను వియత్నాం ప్రజానీకం మరింత సుదీర్ఘకాలం భరించాల్సి వుంటుంది. వియత్నాం యుద్ధం నుండి మనం నేర్వాల్సిన గుణపాఠం ఏమిటంటే ప్రజల ప్రాణాలను హరించి, పర్యావరణానికి తీవ్ర విఘాతం కలిగించే సాయుధ ఘర్షణలకు ఇకనైనా స్వస్తి చెప్పాలి. యుద్ధ వ్యయం కన్నా యుద్ధాల మూలంగా చెల్లించే మూల్యం ఎన్నో రెట్లు ఎక్కువ. యుద్ధాలు దేశాలకు దేశాలనే అస్థిరం పాల్జేస్తాయి. సామ్రాజ్యవాద శక్తులు యుద్ధ దాహార్తిని కట్టబెట్టి శాంతికి కట్టుబడి ఉండాలి. మానవాళి శ్రేయస్సు కోసం యుద్ధాలను వ్యతిరేకించాలి. శాంతి స్థాపన కోసం పాటుపడాలి. వియత్నాం యుద్ధం మనకు ఇచ్చే సందేశం ఇదే.

# విద్యకు విఘాతం



దేశంలో నూరుశాతం అక్షరాస్యత సాధించటంపై పాలకులు ఏళ్ల తరబడి ఘనంగా మాట్లాడుతున్నా- ఇప్పటికీ కోట్లాదిమందికి విద్య అందని ద్రాక్షగానే ఉంది. పాలకుల చిత్తశుద్ధి లేమి, పోతపోసిన నిర్లక్ష్యం సామాన్యులకు చదువుని దూరం చేస్తున్నాయి. ఎప్పటికప్పుడు ఈ సత్యాన్ని అనేక అధ్యయనాలూ, గణాంకాలూ వెల్లడి చేస్తున్నా కట్టుదిట్ట కార్యాచరణ చేపట్టడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరిస్తున్నాయి. పట్టుదలతో పనిచేస్తున్న రాష్ట్రాల్లో తప్ప మిగతా అన్నిచోట్లా బడికి దూరమవుతున్న పిల్లల సంఖ్య పెరుగుతోంది. తాజాగా వెలువడ్డ ఒక అధ్యయనంలో- కేరళ, తమిళనాడు వంటి రాష్ట్రాలు విద్యాభివృద్ధిలో ఉన్నత స్థానంలో ఉండగా, ఎన్డీఏ పాలనలోని బీహార్, అసోం, గుజరాత్, హర్యానా అట్టడుగున ఉన్నాయి. కేరళలో బాలురు, బాలికలు ప్రాథమిక విద్యలో ఎంతమంది చేరితే అంతమందీ మాధ్యమిక విద్యను పూర్తి చేస్తున్నారు. బీహార్లో 100 మందిలో 40.3 మంది మాత్రమే మాధ్యమిక విద్యను దాటుతున్నారు. హర్యానా, గుజరాత్, అసోం వంటి రాష్ట్రాలు 2019తో పోలిస్తే 2024 నాటికి దిగజారినట్టు గణాంకాలు చెబుతున్నాయి.

ఉన్న స్థానం నుంచి ఉన్నత స్థానం వైపు నడిపించే సాధనంగా విద్య తోడ్పడుతుంది. ఈ అవగాహన సమాజంలోని అన్ని తరగతుల్లోకి ప్రభవించినా- అనేకమందికి ఇప్పటికీ సామాజిక, ఆర్థిక కారణాలు విద్యను అందుకోవటానికి ఆటంకంగా ఉన్నాయి. వాటిని నిర్ద్వంద్వంగా దూరం చేసి, 14 ఏళ్ల లోపు పిల్లలందరికీ నిర్బంధ విద్యను అందించాల్సిన బాధ్యత ప్రభుత్వాలది. కానీ, చిత్తశుద్ధి లేని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉదారవాద ఆర్థిక విధానాలను అవలంబించి, విద్యారంగాన్ని ప్రైవేటు బాట పట్టించాయి. నలభై ఏళ్ల క్రితం నిర్మించుకున్న ప్రభుత్వ విద్యారంగాన్ని ఏమాత్రం విస్తరించకుండా, ఉన్న విద్యాసంస్థలను నిర్వీర్యం చేశాయి. ఏళ్ల తరబడి ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయకుండా, మౌలిక వసతులు కల్పించకుండా సర్కారు బడులను బలహీనపర్చిబీ ప్రయివేటు, కార్పొరేటు విద్యాసంస్థల ఎదుగుదలకు కారణమయ్యాయి. అధ్యయన కమిటీలు, కమిషన్లు చేసిన సిఫార్సుల మేరకు కొన్ని కంటితుడుపు చర్యలు చేపట్టినా- బలహీనపర్చే కుట్రను కొనసాగిస్తూనే ఉన్నాయి. గత ముప్పరు ఏళ్లుగా ఏలికలు అనుసరించిన సంస్కరణలు యావత్తూ ప్రభుత్వ విద్యారంగానికి పాడె కట్టే దిశగానే సాగాయి.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ విద్యాసంస్థల్లో ఏడాదికేడాది విద్యార్థి ప్రవేశాలు తగ్గిపోతుండడం నిర్వీర్య పర్వానికి ఆనవాలు. ఈ ఏడాది 1 %-% 10 తరగతుల మధ్య రెండు లక్షల మంది విద్యార్థులు బడికి దూరమయ్యారన్న లెక్క ఆందోళన కలిగించే పరిణామం. ప్రాథమిక పాఠశాలల్లోని 3 పైబడిన తరగతులను హైస్కూళ్లలో విలీనం చేయడం, ఉన్న ఫళాన ఆంగ్ల మాధ్యమాన్ని రుద్దటం, ఉపాధ్యాయ ఖాళీలను భర్తీ చేయకపోవటం వంటి చర్యలన్నీ ఈ డ్రాపౌట్లకు కారణం. అంతకంతకూ పెరుగుతున్న కుటుంబ జీవన వ్యయాన్ని అందుకోవటానికి అల్పాదాయ కుటుంబాల్లోని 13 ఏళ్లు దాటిన పిల్లలు పనుల్లోకి మళ్లటం కూడా ఈ మధ్యకాలంలో ఎక్కువగానే కనిపిస్తోంది. బహుశా ఇలాంటి కారణాల వల్లనే మన రాష్ట్ర పాఠశాలల్లో సగటున రోజువారీ గైర్హాజరు 24.3 శాతంగా ఉంటోంది. నాలుగో వంతు విద్యార్థులు రోజూ బడికి రాలేని పరిస్థితి ఉన్నదంటే- మన విద్యాప్రమాణాల స్థాయి ఏమేరకు ఉన్నదో అర్థం చేసుకోవొచ్చు! మన రాష్ట్ర ప్రభుత్వ పాఠశాలల్లో 2021 %-% 22లో 45 లక్షల మంది విద్యార్థులు ఉంటే- ఆ సంఖ్య ఈ విద్యాసంవత్సరం 38 లక్షలకు పడిపోయింది.

చదువుకోవటం అనేది ఆర్థికంగా కానీ, సామాజికంగా కానీ భారంగా మారినప్పుడు ఆ ప్రభావం ఎక్కువగా బాలికా విద్యపైనే పడుతోంది. దేశంలో ప్రతి ఐదుగురు అమ్మాయిల్లో ముగ్గురు మాత్రమే ఇంటర్మీడియట్‌లో అడుగు పెడుతున్నారు. వందమందిలో 40 మంది బాలికలు పదో తరగతితోనే చదువు ఆపేసి, పనుల్లో చేరటమో, వివాహబంధంలోకి వెళ్లటమో జరుగుతోంది. పాలకులు భేటీ బచావో అని నినాదాలతో హోరెత్తించటం కాదుబీ అమ్మాయిలను విద్యావంతులను చేయాలి. అందరికీ చదువు అందించటం తమ కనీస బాధ్యతగా గుర్తెరగాలి. 1966లోనే కొఠారి కమిషన్ సిఫార్సు చేసినట్టు జాతీయాదాయంలో ఆరు శాతాన్ని విద్యారంగానికి కేటాయించాలి. ఉదారవాద విధానాలకు స్వస్తి చెప్పి, ప్రభుత్వరంగ విద్యాసంస్థలను బలోపేతం చేయటం ద్వారానే అందరికీ విద్య అన్న విధానం ఫలిస్తుంది.

## తొలి భారతీయ మహిళ ఉపాధ్యాయురాలు మత సావిత్రిబాయి పూలే జయంతి కార్యక్రమాన్నివీర్సు స్కూల్ లో ఆల్ ఇండియా అంబేద్కర్ సంఘం....



**సత్యమేవ జయతే - సంగారెడ్డి** ఆధ్వర్యంలో ఘనంగా194 సావిత్రిబాయి పూలే జయంతి వేడుకలు నిర్వహించడం జరిగింది.ముందుగా వారి చిత్రపటానికి పూలమాల వేసి నివాళు లర్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య వక్త గా సీనియర్ అడ్వకేట్ లక్మీ గారు, ముఖ్యఅతిదిగా ఎస్సి,ఎస్టీ విజిలెన్స్%ఓ% మానిటరింగ్ మెంబర్ దుర్గ ప్రసాద్ , ఆర్గనైజ్ సెక్రెటరీ పవన్ పోతురాజు, కరస్పాండెంట్ మంజుల గారు, మాట్లాడుతూ భారతదేశానికి తొలి మహిళా ఉపాధ్యాయురాలు మాతా సావిత్రి బాయి పూలే అని వారు అన్నారు.ఆనాడు భారత దేశంలో స్త్రీలకు చదువు నిరాకరించబడినప్పుడు మహనీయులు జ్యోతిరావు పూలే మొట్టమొదట తాను చదువు నేర్చుకుని తన భార్యకు చదువు నేర్పి సమాజంలో ఉన్న స్త్రీలందరికీ చదువు నేర్పడానికి ఆదర్శం అయ్యారు. అలాంటి వారి జయంతిలు జరుపుకోవడం అంటే అదృష్టంగా భావించాలని అన్నారు. సావిత్రి బాయి పూలే గారి జయంతి రోజును తెలంగాణ ప్రభుత్వం మహిళా ఉపాధ్యాయ దినోత్సవంగా అధికారికంగా జరపాలని ప్రకటించడం అభినందనీయం అని అన్నారు.ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ అక్షిత గారు , వైస్ ప్రినివిపాల్ మంజులగారు ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ప్రవీణ్ సంచుల, ఎఐఎవైఎస్ శ్రీకాంత్, మునిపల్లీ మొగులయ్య , రాజు ఎఐఎవైఎస్ , విద్యార్థులు, వివిధ నాయకులు పాల్గొనడం జరిగింది..

## విష ప్రయోగ కేసులో నిందితుల అరెస్టు



**సత్యమేవ జయతే-గజ్వేల్** సిద్దిపేట జిల్లా జగదేవపూర్ మండల కేంద్రంలోని తిమ్మాపూర్ గ్రామానికి చెందిన నీరుగంటి నర్సింలు తిమ్మాపూర్ శివారులో గల తన బావి దగ్గరకి వెళ్లి, అక్కడ తన పొలం లోని పోల్ వైర్ గుంజే పని పూర్తి చేసినాడు. బావి కాడి తన గుడిసేలోనికి వెళ్ళగా అక్కడ ఉన్న మద్యాన్ని చూసి, రాత్రి ఎవరో గుడిసెలో మద్యం తాగి విడిచివెళ్ళినారు అని అనుకుని, అక్కడే బావి దగ్గర ఉన్న తన చిన్న మామ అయిన మెండే కనకయ్య ను, నీరుగంటి ఐలయ్య కు మరియు నీరుగంటి విఘ్నేష్ ని పిలిచి మద్యాని తాగుదామని మిగిలిన మద్యాన్ని పోయగా, అది త్రాగిన వారికి ఆరోగ్యం క్షీణించడం తో గజ్వేల్ ప్రైవేట్ ఆసుపత్రికి వెళ్లగా డాక్టర్ పరీక్షించి మద్యం లో పాయిజన్ కలిసింది అని చెప్పడం తో, మెండే కనకయ్య కొడుకు ప్రవీణ్ జగదేవ్ పూర్ పోలీస్ స్టేషన్లో దరఖాస్తు ఇచ్చినాడు. దరఖాస్తు మేరకు జగదేవ్ పూర్ సబ్ ఇన్స్పెక్టర్ గారు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టగా విచారణలో తిమ్మాపూర్ గ్రామానికి చెందిన ముగ్గురు నేరస్థులు 1). గరిదాసు గోపి తండి బాలమల్లు,2). రాచమల్లు స్వామి తండ్రి మల్లయ్య, 3). కొంతం ఐలయ్య తండ్రి నర్సయ్య లు పాత గొడవలు అనగా మెండే ముత్తయ్య వ్యవసాయ భూమి పంచాయతీ విషయంలో, గతం లో గోపి అమ్మిచ్చిన భూమి బాట విషయంలో మరియు గోపి సంభందించిన వరి ఎండిన విషయంలో అదే గ్రామానికి చెందిన నీరుగంటి నర్సింలు అను వ్యక్తిని చంపాలనే ఉద్దేశ్యం తో అతన్ని చంపితే తమకు ఎవరు అడ్డు ఉండరని, గత 2 నెలల నుండి పై ముగ్గురు నేరస్తులు పథకం వేసుకుని నీరుగంటి నర్సింలు తాగుడు అలవాటు ఉన్నదని గ్రహించి తన బావి దగ్గర మద్యం సీసా లో పురుగుల మందు కలిపినట్లయితే అట్టి మందును తాగితే నర్సింలు చనిపోతాడని అనుకుని వారి పథకం ప్రకారము గజ్వేల్ వైన్ షాప్ పర్మిట్ రూం నుండి తీసుకువచ్చిన ఖాళీ మద్యం సీసాలను, పేకాట ముక్కలను తీసుకుని వచ్చి అట్టి సీసాల్లో ఊర్లో కొనుక్కున్నటువంటి రెండు ఒసి 90 యం ఎల్ బాటిళ్లను ఖరీదైన మద్యం (సిగ్నేచర్) ఖాళీ సీసలో పోసి దానిలో గతం లో గోపి తన పొలం గట్ల గడ్డి నివారణ కోసం తెచ్చిన గడ్డి మందును దానిలో కలిపి నీరుగంటి నర్సింలు యొక్క గుడిసె లో పేకాట ఆడి, మద్యం త్రాగి కొంత మద్యం అక్కడే వదిలేసి వెళ్లినట్లు రాత్రి అందాజ 09:00. గంటలకు చిత్రీకరించి వెళ్లిపోయినారు . ఇట్టి పాయిజన్ కలిపినా మద్యాన్ని తాగిన పై వారు వివిధ ఆసుపత్రుల్లో చికిత్స పోదుతుండగా, పోలీస్ దర్యాప్తు విషయం తెలుసుకున్న పై ముగ్గురు నిందితులు ఊర్లో నుండి పరారు అయి యాదగిరిగుట్ట సత్రం లో తలదాల్చుకున్నారు గ్రామస్థులు ఇచ్చిన సమాచారం మేరకు పై వ్యక్తులను అదుపులోకి తీసుకుని విచారించగా ఇట్టి నేరాన్ని ఒప్పుకోగా వారిని అరెస్ట్ చేసి వారి నుండి ఒక ఆటో, ఒక గ్లామర్ బైక్ మరియు మూడు ఫోన్లను సీజ్ చేయడం జరిగింది .ఇట్టి కేసు దర్యాప్తు లో నిందితులను గుర్తించడం లో పాల్గొన్న జగదేవపూర్ సబ్ ఇన్స్పెక్టర్ గారిని, పోలీస్ సిబ్బంది ని గజ్వేల్ రూరల్ ఇన్స్పెక్టర్ మహేందర్ రెడ్డి గారు అభినందించారు.

## సీఎంఆర్ఎఫ్ చెక్కులు అందజేసిన ఆవుల రాజిరెడ్డి



**సత్యమేవ జయతే- వెల్దుర్తి** మాసాయిపేట గ్రామంలోని ఆవుల రాజిరెడ్డి గారి క్యాంపు కార్యాలయంలో ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్) ద్వారా మంజూరైన చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు.

1.కుమ్మరి శంకర్ గారు (మాసాయిపేట గ్రామం) - ₹60,000
2.చౌహాన్ కమల గారు (రామంతపూర్ గ్రామం) - ₹20,000
3.భూషణ్ రెడ్డి గారు (లింగారెడ్డిపల్లి గ్రామం)₹34,000
4.కళ్యాణ్ కుమార్ గారు (రామంతపూర్ గ్రామం)₹60,000
5. వినయ్ గారు ( అచ్చంపేట గ్రామం) ₹45,000

పిసిసి ప్రధాన కార్యదర్శి, నర్సాపూర్ నియోజకవర్గ ఇన్చార్జి అయిన ఆవుల రాజిరెడ్డి గారు ఈ చెక్కులను నేడు అందజేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారి నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వం సీఎంఆర్ఎఫ్ నిధులను ప్రజల అత్యవసర అవసరాలకు ఉపయోగించడానికి బలంగా కట్టుబడి ఉంది.

ఈ నిధులు:
- వైద్య చికిత్స కోసం నిరుపేదలకు భరోసా కల్పించడం.
- ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాలకు తక్షణ సహాయం అందించడం.
- అత్యవసర ఆరోగ్య సమస్యలకు చికిత్స కోసం ప్రజలకు నిధులు మంజూరు చేయడం వంటి సామాజిక సంక్షేమ కార్యక్రమాలకు వినియోగిస్తారు. ఈ కార్యక్రమం ప్రజా సేవకు కాంగ్రెస్ ప్రభుత్వ నిబద్ధతకు నిదర్శనం.

# కలెక్టరేట్ కార్యాలయంలో 108, 11 నూతన వాహనాలను ప్రారంభించిన రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ








**సత్యమేవ జయతే -సంగారెడ్డి కలెక్టరేట్** శుక్రవారం సంగారెడ్డి పట్టణంలోని సంగారెడ్డి కలెక్టరేట్ కార్యాలయంలో నూతన 11, 108 అంబులెన్సు వానాలకు రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి జండా ఊపి ప్రారంభించారు.ఈ అంబులెన్స్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో టీజీఐసీ చైర్మన్ నిర్మల జగ్గారెడ్డి, జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి, డిఎం హెచ్ ఓ గాయత్రి, ఈఎంఆర్ఐ గ్రీన్ హెల్త్ సర్వీసెస్ 108 సర్వీసెస్, ఎన్ జనార్ధన్ ప్రోగ్రామ్ మేనేజర్, మరియు సంగారెడ్డి డిస్ట్రిక్ట్ ఇంచార్జ్ హుస్సేన్ మరియు 108అంబులెన్స్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# కేటీఆర్‌ను కలిసిన వండర్ బేబీ ఉపాసన



**సత్యమేవ జయతే - సూర్యాపేట** బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను వండర్ బేబీ ఉపాసన, ఆమె తల్లిదండ్రులు శుక్రవారం నాడు కలిశారు. కేటీఆర్‌కు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా తెలంగాణ మ్యాప్‌తో కేసీఆర్ చిత్రపటానికి చెందిన పజిల్‌ను వేగంగా సాల్వ్ చేసి చూపించింది. సూర్యాపేట జిల్లా నేరేడుచర్లకు చెందిన రెండున్నర సంవత్సరాల బేబీ ఉపాసన తన అద్భుతమైన జ్ఞాపకశక్తితో, ప్రతిభా పాటవాలతో నోట్ బుక్ ఆఫ్ రికార్డ్స్, సూపర్ టాలెంటెడ్ వరల్డ్ రికార్డ్, ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్ వంటి అనేక ప్రతిష్ఠాత్మక సంస్థల చేత గుర్తించబడింది. మహనీయుల పేర్లు, వారి చిత్ర పటాలను, దేశ, ప్రపంచ రాజధానులను గుర్తుంచుకోవడం లాంటి అనేక అంశాల్లో చిన్నారి ఉపాసన అద్భుతమైన ప్రజ్ఞను కలిగి ఉంది. ఆమె ఇవాళ తన తల్లిదండ్రులతో కలిసి కేటీఆర్‌ను కలిసింది. ఈ సందర్భంగా తెలంగాణతో కేసీఆర్ గారి చిత్రపటానికి చెందిన పజిల్ ను వేగంగా సాల్వ్ చేసి చూపించింది.

బుజ్జి బుజ్జి మాటలు మాట్లాడే బేబీ ఉపాసన ప్రజ్ఞా పాటవాలను చూసి కేటీఆర్‌తో పాటు పార్టీ నాయకులు ఆశ్చర్యం వ్యక్తం చేశారు. ఇంత చిన్న వయసులో మహనీయుల పేర్లు, చిత్రపటాలతో పాటు భౌగోళిక అంశాల పైన ఆమెకున్న జ్ఞాపకశక్తిని, టాలెంట్ ని చూసి కేటీఆర్ ఆశ్చర్యపోయారు. బేబీ ఉపాసన భవిష్యత్తులో ఉన్నత స్థితికి చేరాలని దీవించారు. బేబీ ఉపాసన సాధించిన రికార్డుల పత్రాలపైన ఆమె తల్లిదండ్రులు కేటీఆర్ సంతకాన్ని ఒక జ్ఞాపకంగా తీసుకున్నారు. బేబీ ఉపాసనకు కేటీఆర్ దీవెనలతో పాటు మిఠాయిలు అందించారు.

## పరిశ్రమల ప్రతినిధులు, సంబంధిత శాఖల అధికారులతో కలిసి సిఎస్ఆర్ (కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ) నిధులతో చేపట్టిన అభివృద్ధి పనులు , జిల్లాలోని వసతి గృహాల నిర్వహణపై సమీక్ష పై రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహా ఆరా






**సత్యమేవ జయతే -సంగారెడ్డి కలెక్టరేట్** సంగారెడ్డి , జనవరి 03:- తెలంగాణ రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ శుక్రవారం సంగారెడ్డి కలెక్టరేట్‌లో సమావేశ మందిరం లో జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు, పరిశ్రమల ప్రతినిధులు, సంబంధిత శాఖల అధికారులతో కలిసి సిఎస్ఆర్ (కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ) నిధులతో చేపట్టిన అభివృద్ధి పనులు , జిల్లాలోని వసతి గృహాల నిర్వహణపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భముగా మంత్రి మాట్లాడుతూ సిఎస్ఆర్ నిధులను విద్య, వైద్య రంగాల అభివృద్ధి కోసం ప్రధానంగా వినియోగించాలని ఆదేశించారు. జిల్లాలో ఐదు క్లస్టర్ల పరిధిలో ప్రారంభించిన పనులను వేగవంతంగా పూర్తి చేయాలని సూచించారు. పరిశ్రమల యాజమాన్యాలు తమ బాధ్యతగా అభివృద్ధి పనులకు సహకరించాలని అన్నారు. ప్రభుత్వ పాఠశాలలు, కేజీబీవీ పాఠశాలలు, బాలబాలికల గురుకుల పాఠశాలలు, కాలేజీలలో మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు.వసతి గృహాల పరిస్థితి, మౌలిక వసతుల కల్పన, విద్యార్థుల సంఖ్య, హాస్టల్ భవనాల పరిస్థితి వంటి అంశాలను ప్రాధాన్యతగా చర్చించారు.వసతి గృహాల్లో తాగునీరు, ప్రభుత్వ వసతిగృహాల నిర్వహణ , ప్రయివేటు భవనాలలో నడుస్తున్న వసతి గృహాల నిర్వహణపై నివేదికలు సమర్పించాలాలని అధికారులను ఆదేశించారు . జిల్లాలోని వసతి గృహాల పనితీరు మెరుగుపరచుట హాస్టల్ బిల్డింగులు వివరాలు , మౌలిక సదుపాయాల కల్పన అద్దె భవనాలు ,సొంత భవనాలు వివరాలు వాటి రిపేర్లు సంబంధించిన ప్రతిపాదనలు సమర్పించాలని ఆదేశించారు . విద్యార్థుల సంఖ్య వివరాలు వసతి గృహాల నిర్వహణపై పాత కొత్త విద్యుత్, శానిటేషన్ వంటి మౌలిక అవసరాలను మెరుగుపరచాలని సూచించారు. సంక్షేమశాఖాధికారులు వసతి గృహాల నిర్వహణ నివేదికలను జిల్లా కలెక్టర్‌కు అందజేయాలని స్పష్టం చేశారు. వసతి గృహాల మెరుగుదల జిల్లాలో విద్యార్థుల అభ్యున్నతికి కీలకమని, ఈ పనులు సమయానుసారం పూర్తిచేయాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు చంద్రశేఖర్, మాధురి, పరిశ్రమల శాఖ అధికారులు, విద్యాశాఖ, వైద్య ఆరోగ్యశాఖ అధికారులు, సంబంధిత శాఖల అధికారులు, పరిశ్రమల యాజమాన్యాలు ప్రతినిధులు, పాల్గొన్నారు.

## సావిత్రిబాయ్ పూలే దేశానికే ఆదర్శం : ప్రగతి ఫౌండేషన్ చైర్మన్ డా. యండి. ఆరిఫుద్దీన్.

**సత్యమేవ జయతే - కల్వకుర్తి** ఘనంగా తొలి మహిళ ఉపాధ్యాయురాలు, సంఘ సంస్కార్త సావిత్రి బాయి పూలే జయంతి జాతీయ మహిళ దినోత్సవం అధికారికంగా గుర్తించిన ప్రభుత్వానికి కృతజ్ఞతలు సంఘ సంస్కార్త, తొలి మహిళా ఉపాధ్యాయురాలు సావిత్రి బాయి పూలే జయంతి ని ప్రభుత్వం అధికారికంగా గుర్తించడం పట్ల సామాజిక కార్యకర్త, ప్రగతి ఫౌండేషన్ చైర్మన్ డా. యండి. ఆరిఫుద్దీన్ హర్షం వ్యక్తం చేసారు. ఫౌండేషన్ ఆధ్వర్యంలో



కల్వకుర్తి లో ఉన్న వంగూరు తెలంగాణ సోషల్ వేల్ఫేర్ స్కూల్ మరియు కాలేజ్ లో మహిళ ఉపాధ్యాయ దినోత్సవాన్ని నిర్వహించి టీచర్స్ ను శాలువ, మెడల్స్ తో ఘనంగా సన్మానించిన అభినందనలు తెలియజేసారు ఈ కార్యక్రమం లో స్కూల్ మరియు కాలేజ్ ప్రిన్సిపాల్స్, స్టాఫ్, విద్యార్థులు పాల్గొన్నారు.

## సావిత్రిబాయి పూలే 194వ ఘన నివాళులర్పించినతడ్కల్ క్లస్టర్ ఎమ్మార్పీఎస్ అధ్యక్షులు లాల్ కుమార్ మాదిగ తడ్కల్ క్లస్టర్ ఎమ్మార్పీఎస్ నూతన కమిటీ.






**సత్యమేవ జయతే -కంగ్టి**సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్ నియోజకవర్గం లోని మండల కేంద్రమైన కంగ్టి పరిధిలో తాడ్కాల్ గ్రామంలో ఘనంగా తొలి భారతీయ మహిళ ఉపాధ్యాయురాలు సావిత్రిబాయి పూలే 194వ ఘన నివాళులర్పించినతడ్కల్ క్లస్టర్ ఎమ్మార్పీఎస్ అధ్యక్షులు లాల్ కుమార్ మాదిగ తడ్కల్ క్లస్టర్ ఎమ్మార్పీఎస్ నూతన కమిటీ ఆధ్వర్యంలో సావిత్రిబాయి పూలే జయంతి సందర్భంగా అంబేద్కర్ విగ్రహం దగ్గర సావిత్రిబాయి పూలే చిత్రపటానికి పూలమాల ఘన నివాళులర్పించారు.తడ్కల్ క్లస్టర్ ఎమ్మార్పీఎస్ అధ్యక్షులు లాల్ కుమార్ మాదిగ, ఉపాధ్యక్షులు ఎర్రోళ్ల అంజయ్య మాదిగ మాట్లాడుతూ..సావిత్రిబాయి పూలే (1831 జనవరి 3%-% 1897 మార్చి 10) భారతీయ సంఘ సంస్కర్త, ఉపాధ్యాయిని,రచయిత్రి,ఆమె నిమ్న వర్గాల అభ్యున్నతికి కృషి చేసిన జ్యోతీరావ్ పూలే భార్య. కులమత భేదాలకు అతీతంగా సమాజాన్ని ప్రేమించిన ప్రేమస్వరూపిణి.ఆధునిక విద్య ద్వారానే స్త్రీ విముక్తి సాధ్యపడుతుందని నమ్మిన ఆమె, తన భర్తతో కలసి 1848 జనవరి 1న పూణేలో మొట్టమొదటగా బాలికల పాఠశాలను ప్రారంభించింది,కుల వ్యవస్థకు, పితృస్వామ్యానికి వ్యతిరేకంగా,శూద్రుల, అస్పృశ్యుల,మహిళల సకల హక్కుల కోసం పోరాటం చేయటం తమ సామాజిక బాధ్యతగా ఆ దంపతులు విశ్వసించారు.నూతన వ్యవస్థ కోసం, ప్రాణాల్ని సైతం పణంగా పెట్టి సమష్టిగా పోరాటం చేసింది.సమాజంలోని కులతత్వం,పురుషాధిక్య ధోరణులు కలిగిన చాలామంది పండిత మేధావులందరికీ కూడా ఆమె కేవలం జ్యోతిరావు పూలే భార్యగా మాత్రమే తెలుసు.కానీ ఆమె ఆధునిక భారతదేశంలో మొట్టమొదటి మహిళా ఉపాధ్యాయురాలు,పీడిత ప్రజలు ముఖ్యంగా స్త్రీల విద్యాభివృద్ధికి కృషి చేసిన తొలితరం మహిళా ఉద్యమకారిణి అని అన్నారు,ఈ కార్యక్రమంలో రమేష్ గౌడ్, మాణిక్ మాదిగ,తడ్కల్ క్లస్టర్ ఎమ్మార్పీఎస్ సాయ కార్యదర్శి చిలక గంగారాం మాదిగ,తడ్కల్ క్లస్టర్ డప్పుల అధ్యక్షులు యం.యాదయ్య మాదిగ,ఉపాధ్యక్షులు మోషే మాదిగ,డప్పుల ప్రధాన కార్యదర్శి లింగల గంగారం మాదిగ,జంగ్గి (బి)గ్రామ అధ్యక్షులు జబ్బ సాయిలు,ఘణపూర్ అధ్యక్షులు శ్రీను మాదిగ,చాప్ట (బి) గ్రామ ఉపాధ్యక్షులు మోజెస్ మాదిగ శ్రీకాంత్ మాదిగ,దేవదాస్ మాదిగ, మనోహర్ మాదిగ,సాయిలు మాదిగ,మేత్రి రాజు మాదిగ,మొగులయ్య మాదిగ,యోహాను మాదిగ,తదితరులు పాల్గొన్నారు.

## నర్సాపూర్ ఫారెస్ట్ లో ఘోర రోడ్డు ప్రమాదం లో నలుగురు మృతి

**ఖ సత్యమేవ జయతే- నర్సాపూర్** మృతుల కుటుంబాలను నర్సాపూర్ ఆస్పత్రిలో పరామర్శించిన మెదక్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఆంజనేయులు గౌడ్.మెదక్ - హైదరాబాద్ నేషనల్ హైవేపై నర్సాపూర్ ఫారెస్ట్ లో ఘోర రోడ్డు ప్రమాదంలో నలుగురు మృతి చెందారు. మృతుల కుటుంబ సభ్యులను నర్సాపూర్ ఆస్పత్రిలో పరామర్శించిన మెదక్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఆంజనేయులు గౌడ్ మృతులు దూది ఐశ్వర్య లక్ష్మి (రుస్తుంపేట్), పీఆర్ ఏఈ పాపగారి మనీషా, సూరారం ప్రాంతానికి చెందిన మరో విద్యార్థి, కౌడిపల్లికి చెందిన అనసూయ గా గుర్తించారు.▪ నలుగురు ప్రాణాలు కోల్పోవడం బాధాకరమన్నారు. ప్రమాదంలో మరణించిన బాధిత కుటుంబ సభ్యులకు సానుభూతి తెలియజేశారు. వారి కుటుంబ సభ్యులకు మనోధైర్యం చెప్పారు..

బాధిత కుటుంబాలను ప్రభుత్వం ఆదుకుంటుందని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో నర్సాపూర్ మాజీ ఎంపీపీ జ్యోతి



సురేష్ నాయక్, నర్సాపూర్ బ్లాక్ అధ్యక్షులు రిజ్వాన్, మండల అధ్యక్షులు మల్లేష్, రుస్తుంపేట మాజీ ఎంపీటీసీ అశోక్,



నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## కార్పొరేట్ కు దీటుగా ప్రభుత్వ విద్యను బలోపేతం చేస్తాం

**మెదక్ ఎమ్మెల్యే డాక్టర్ మైనం పల్లి రోహిత్ రావు**

**టిపిటిఎఫ్ క్యాలెండర్ ను ఆవిష్కరించిన ఎమ్మెల్యే**

**సత్యమేవ జయతే-మెదక్** కార్పొరేట్ కు దీటుగా ప్రభుత్వ విద్యను బలోపేతం చేస్తామని, అదిశగా రేవంత్ సర్కార్ ముందుకుసాగుతుందని మెదక్ ఎమ్మెల్యే డాక్టర్ మైనం పల్లి రోహిత్ రావు అన్నారు. శుక్రవారం మెదక్ పట్టణంలోని టిపిటిఎఫ్ జిల్లా కార్యాలయంలో నూతన సంవత్సర క్యాలెండర్ ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గత ప్రభుత్వం కేజీ టు పీజీ ఉచిత విద్యను అందిస్తామని మోసం చేసిందన్నారు. తమ ప్రభుత్వం కార్పొరేట్ స్థాయి విద్యా సంస్థలను నెలకొల్పేందుకు శ్రీకారం చుట్టిందన్నారు. ప్రతి నియోజకవర్గానికి ఒకటి స్థాపిస్తున్నామని




తెలిపారు.విద్యార్థులకు నాణ్యమైన ఆహారం అందించేందుకు మెస్ చార్జీలు పెంచిందన్నారు. మరోవైపు హాస్టల్ విద్యార్థులకు సైతం కాస్మోటిక్ చార్జీలు పెంచిన ఘనత తమ ప్రభుత్వానిదన్నారు. పేద విద్యార్థులను ఉత్తమ విద్యార్థులుగా తీర్చిదిద్దేందుకు టీచర్లు కృషి చేయాలన్నారు.ఈ సందర్భంగా సావిత్రి భాయి పూలె చిత్రపటానికి నివాళ్లు అర్పించి ఆమె సేవలను కొనియాడారు.ఈ కార్యక్రమం లో మున్సిపల్ చైర్మన్ తొడుపునూరి చంద్రపాల్, టీపీటీఎఫ్ రాష్ట్ర మాజీ అధ్యక్షులు కొండల్ రెడ్డి ఉపాధ్యాయ దర్శిని ఎడిటర్ శశిధర్ రెడ్డి జిల్లా అధ్యక్ష కార్యదర్శులు కొంగోటి యాదగిరి, వెంకట్రామిరెడ్డి,జిల్లా నాయకులు సంగయ్య, హిరలాల్, శ్రీనివాస్ రెడ్డి, ప్రభాకర్, రమేష్, సాయిబాబా, యాదగిరి, రాజయ్య, భాగ్యలక్ష్మి, సంగీత, స్వప్నశ్రీ, నసిరోద్దీన్, నాగరాజు, పీర్ సింగ్, కొమ్మ శ్రీనివాస్, వాసు, సుదీర్ రెడ్డీ, శివరాం లు తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ విద్యాసంస్థలల్లో చదువుకుంటున్న విద్యార్థులకు

**-విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని**

**ఖమ్మం కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ గారికి వినతి పత్రం అందజేసిన పిడి ఎస్ యు (ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం) ఖమ్మం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఖమ్మం జిల్లా కలెక్టర్కు వినతిపత్రం అందజేత**

**సత్యమేవ జయతే- ఖమ్మం** ఈ కార్యక్రమాన్ని ఉద్దేశిం పిడిఎస్ యు ఖమ్మం జిల్లా కార్యదర్శి జి మస్తాన్ పాల్గొని మాట్లాడుతూ. ఖమ్మం జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ విద్యా రంగ సంస్థలలో నాసిరకం, నాసిరకం సరుకులు వాడటం మూలంగా విద్యార్థులు అస్వస్థతకు ,




ఫుడ్ పాయిజన్లకు గురవుతున్నారని. మధ్య దళారులకు కాంట్రాక్టులు ఇవ్వడం మూలంగా నాసిరకం వంట సరుకులు సరఫరా చేయడంతో విద్యార్థులు ప్రాణాలను కోల్పోతున్నారని. పదేండ్లు అధికారంలో ఉన్న టిఆర్ఎస్ ప్రభుత్వం ప్రజా సంక్షేమాన్ని విస్మరించి నిర్బంధం కొనసాగించిందని. ఫలితంగా ఆ ప్రభుత్వానికి ప్రజలు బుద్ధి చెప్పి కాంగ్రెస్ ప్రభుత్వానికి అధికారం కట్టబెట్టారని . కాంగ్రెస్ కూడా గత ప్రభుత్వం అనుసరించిన విధానాలను అనుసరిస్తుందని, ప్రజా పాలన పేరుతో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి ఏడాది గడుస్తున్న ఇప్పటివరకు విద్యారంగంలో మౌలిక వసతులు కూడా కల్పించలేక పోయిందని. ప్రభుత్వ విద్యా సంస్థలలో కనీస సౌకర్యాలు లేకపోవడంతో విద్యార్థుల అవస్థలు పడుతున్నారని, ఇప్పటికైనా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని. రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలలలో, గురుకులాల్లో, కేజీబివి, మోడల్ స్కూల్ హాస్టల్ ,సంక్షేమ హాస్టల్స్ లో అస్వస్థతకు గురై మృతి చెందిన బాధ్యత కుటుంబాలకి 50 లక్షల రూపాయల ఎక్స్గ్రేషియా చెల్లించాలని కుటుంబంలో ఒకరికి ప్రభుత్వం ఉద్యోగం కల్పించాలని. పెండింగ్లో ఉన్న స్కాలర్షిప్ ఫీజు రీయింబర్స్ విడుదల చేయాలని డిమాండ్ ప్రభుత్వ విద్యా వ్యవస్థను మెరుగుపరచాలని వారు అన్నారు. లేనియెడల గత ప్రభుత్వానికి పట్టిన గతే కాంగ్రెస్ ప్రభుత్వానికి పడుతుందని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో పి డి ఎస్ యు నాయకులురవికుమార్, సాగర్ భాను సంపత్ పాల్గొన్నారు.

## భవిత లో ఘనంగాసావిత్రిబాయి పూలే జయంతి



సత్యమేవ జయతే-సదాశివపేట సదాశివపేట పట్టణంలోని భవిత జూనియర్ కళాశాలలో ఈరోజు సావిత్రిబాయి పూలే జయంతిని నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ కరస్పాండెంట్ బాలరాజు మాట్లాడుతూ సావిత్రిబాయి పూలే భారతదేశపు మొదటి మహిళా ఉపాధ్యాయురాలని అలాగే మహిళలకు విద్యను అందించడంలో ఆమె చేసిన కృషి ఎనలేనిదని గుర్తు చేశారు విద్య వల్లే వ్యక్తి జీవితం మహోన్నత జీవితం గా మారుతుందని పేర్కొన్నారు ఈ కార్యక్రమాన్ని అధికారికంగా రాష్ట్ర ప్రభుత్వం ఈ సంవత్సరం నుండి మహిళా ఉపాధ్యాయ దినోత్సవం గా నిర్వహించడం గర్వకారణం అని పేర్కొన్నారు ఈ కార్యక్రమంలో భవిత కళాశాల డైరెక్టర్ మధుకర్ రెడ్డి రాజు అధ్యాపకులు మల్లేశం మహేష్ నిలోపత్తి రెడ్డి సుజాత సంతోషి మంజుల కే విజయలక్ష్మి లలిత ఎస్ విజయలక్ష్మి పావని నిఖిత షాజియా సుల్తానా విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు

## చైనాలో కొత్త వైరస్ కలకలం.. భారీగా ఆసుపత్రులకి చేరుతున్న ప్రజలు..అసలేంటి ఈ వైరస్..!



**సత్యమేవ జయతే- చైనా** కోవిడ్ భయాలు ఇంకా పూర్తిగా తొలగకముందే, చైనాలో మరో కొత్త వైరస్ కలకలం రేపుతోంది. అదే హ్యూమన్ మెటాప్ న్యూమో వైరస్ . కరోనాతో సతమతమైన డ్రాగన్ కంట్రీ, ఇప్పుడు ఈ కొత్త వైరస్తో భయపడుతోంది.ఆసుపత్రులు కిక్కిరిసిపోవడం, శ్మశాన వాటికల వద్ద రద్దీ పెరగడం ఆందోళన కలిగిస్తోంది. 2001లో కనుగొన్న ఈ వైరస్, అన్ని వయసుల వారికీ సోకుతుంది, కానీ పిల్లలు, వృద్ధులు, బలహీన రోగనిరోధక శక్తి కలిగిన వారికి మాత్రం చాలా ప్రమాదకరం. మరి ఇది కోవిడ్ మాదిరిగా మరో మహమ్మారిలా మారుతుందా? దీని లక్షణాలు, నివారణ చర్యలు, ఇతర వివరాలన్నీ తెలుసుకుందాం.

—HMPV లక్షణాలు

%ఎచ్ఎంపీవీ% సోకితే జలుబు, దగ్గు, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది, జ్వరం వంటి సాధారణ లక్షణాలు కనిపిస్తాయి. కొన్నిసార్లు బ్రాంకైటిస్ లేదా న్యుమోనియా కూడా వచ్చే అవకాశం ఉంది. ఇది ఒకరి నుంచి మరొకరికి చాలా సులభంగా వ్యాప్తి చెందుతుంది. ఇన్ఫెక్షన్ సోకిన వ్యక్తి దగ్గినప్పుడు లేదా తుమ్మినప్పుడు వెలువడే తుంపర్ల ద్వారా వైరస్ గాలిలో కలిసి ఇతరులకు వ్యాపిస్తుంది. అంతేకాదు, వైరస్ ఉన్న వస్తువులను తాకి, ఆ చేతులతో ముక్కు, నోరు, కళ్లను తాకినా వైరస్ సోకే ప్రమాదం ఉంది. ముఖ్యంగా చలికాలంలో ఈ వైరస్ ఎక్కువగా వ్యాప్తి చెందుతుంది.

జాగ్రత్తలు

ఈ HMP%రెస్పిరేటరీ సిన్సిటియల్ వైరస్ కుటుంబానికి చెందినది. %ఎచ్ఎంపీవీ%కి ప్రత్యేక చికిత్స లేదు. లక్షణాలను బట్టి డాక్టర్లు ట్రీట్మెంట్ చేస్తారు. కాబట్టి, వ్యాధి రాకుండా జాగ్రత్తలు తీసుకోవడం మంచిది. తరచుగా చేతులు కడుక్కోవడం, వ్యక్తిగత పరిశుభ్రత పాటించడం, జలుబు, దగ్గు ఉన్నవారికి దూరంగా ఉండటం తప్పనిసరి. మాస్కులు ధరించడం, రోగనిరోధక శక్తిని పెంచుకోవడం ద్వారా కూడా ప్రమాదాన్ని తగ్గించుకోవచ్చు. పిల్లలకు పరిశుభ్రత గురించి అవగాహన కల్పించడం అవసరం. ఒకవేళ మీకు లేదా మీ కుటుంబ సభ్యులకు జలుబు, దగ్గు, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది, జ్వరం వంటి లక్షణాలు కనిపిస్తే, ఆలస్యం చేయకుండా వెంటనే డాక్టర్ను సంప్రదించాలి.

HMPV ప్రమాదాలు

HMPV% లక్షణాలు సాధారణ జలుబు, ఫ్లూ వంటి ఇతర శ్వాసకోశ సంబంధిత వ్యాధుల్లాగే ఉంటాయని చెబుతున్నారు. కానీ టెస్ట్ రిపోర్ట్స్ ప్రకారం, %ఎచ్ఎంపీవీ% కారణంగా ఆకస్మిక మరణాలు పెరుగుతున్నట్లు గుర్తించారు. ముఖ్యంగా 40 నుంచి 80 ఏళ్ల వారిలో ఈ ప్రమాదం ఎక్కువగా ఉన్నట్లు తెలుస్తోంది.

-ఆసుపత్రులపై తీవ్ర ఒత్తిడి

సోషల్ మీడియాలో పోస్టుల ప్రకారం, చైనాలో ఇప్పుడు ఒకేసారి అనేక వైరస్లు విజృంభిస్తున్నాయి. ఇన్ఫ్లుఎంజా %ఊ, ఎచ్ఎంపీవీ%, మైకోప్లాస్మా న్యుమోనియా, కోవిడ్-19 వంటి వైరస్లు ఒకేసారి వ్యాప్తి చెందడంతో ఆసుపత్రులు, శ్మశాన వాటికలు రోగుల తాకిడిని తట్టుకోలేకపోతున్నాయి. పిల్లల ఆసుపత్రుల పరిస్థితి మరీ దారుణంగా ఉంది. న్యుమోనియా కేసులు, ముఖ్యంగా "వైట్ లంగ్" కేసులు విపరీతంగా పెరగడంతో ఆసుపత్రులు కిక్కిరిసిపోతున్నాయి.

లి పిల్లలపై %ఎచ్ఎంపీవీ% పంజా

14 ఏళ్లలోపు పిల్లలు ఈ వైరస్ బారిన పడుతుండటం మరింత కలవరపెడుతోంది. చైనా %జణజ% నివేదికల ప్రకారం, ఈ వైరస్ వేగంగా వ్యాప్తి చెందుతోంది. డాక్టర్ లి టోంగ్జెంగ్ చెప్పినట్లు, %ఎచ్ఎంపీవీ% తుంపర్లు, ప్రత్యక్ష స్పర్శ, కలుషిత ఉపరితలాల ద్వారా వ్యాప్తి చెందుతుంది. వైరస్ సోకిన 3-5 రోజుల్లో లక్షణాలు కనిపిస్తాయి. వైరస్ ఉన్న వస్తువులను తాకి, ఆ చేతులతో ముక్కు, నోరు, కళ్లను తాకినా వైరస్ సోకే ప్రమాదం ఉంది. పిల్లలు ఒకరికొకరు దగ్గరగా ఉండటం వల్ల వైరస్ త్వరగా వ్యాప్తి చెందే అవకాశం ఉంది.

-భయపడాలా?

HMPV వేగంగా వ్యాప్తి చెందుతున్నా, దీనికి ప్రత్యేక మందులు లేవు. ఇది సాధారణ జలుబు లాంటిదే. అందుకే, సొంత వైద్యం వద్దు. డాక్టర్ సలహా లేకుండా యాంటీవైరల్స్ వాడొద్దు. జ్వరం, ఒళ్లు నొప్పులకు పారాసిటమాల్ వాడొచ్చు. దగ్గు, జలుబుకు సాధారణ మందులు పనిచేస్తాయి. కానీ, లక్షణాలు తీవ్రంగా ఉంటే మాత్రం డాక్టర్ని కలవడం తప్పనిసరి. భయపడాల్సిన పనిలేదు, కానీ జాగ్రత్తగా ఉండటం ముఖ్యం.

ఎచ్ఎంపీవీ% మొదట చైనాలో కనిపించినా, ఇప్పుడు ప్రపంచమంతా వ్యాపించింది. ఇది ఒక గ్లోబల్ ముప్పు. అందుకే, వ్యక్తిగత పరిశుభ్రత పాటించడం, చేతులు కడుక్కోవడం, మాస్కులు ధరించడం చాలా ముఖ్యం.

## సావిత్రిబాయి పూలే జయంతిని ఘనంగా నిర్వహించిన కాగజ్నగర్ మండల అధ్యక్షుడు ఆవుల రాజ్ కుమార్



**సత్యమేవ జయతే - కాగజ్నగర్ఇస్లాం విలేజ్ నెంబర్ 5** లో బెంగాలీ సోదరుల తో జ్ఞాన జ్యోతి సావిత్రిబాయి పూలే జయంతి వేడుకలను ఘనంగా జరుపుకోవడం జరిగింది ఈ సందర్భంగా కాగజ్నగర్ మండల అధ్యక్షులు ఆవుల రాజకుమార్ గారు మాట్లాడుతూ సావిత్రిబాయి జ్యోతిబాపూలే దంపతుల త్యాగంతో ఈ దేశంలో అన్ని వర్గాలకు విద్య లభించింది సావిత్రిబాయి పూలే వల్లే ఈ దేశంలో మహిళలు చదువుకునే స్థాయికి వచ్చారు అన్నారు సావిత్రిబాయి పూలే జన్మదినాన్ని భారతదేశ ఉపాధ్యాయ దినోత్సవంగా ప్రకటించాలని అన్నారు ఈ కార్యక్రమంలో అనంతరం విద్యార్థులకు ఎగ్జామ్ ప్యాడ్స్ అందించారునియోజకవర్గ యూత్ కన్వీనర్ కాశిపాక రాజ రింకు పుష్ప చక్రవర్తి, కనాన్ సర్కార, రింకు మండల్, అంజలి బిస్వాస్, సులేక బసు, పార్వతి సర్కార్,జయమల తరప్దార్, సుప్రియ బిస్వాస్,సంద హల్దార్, మరియు పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

### సర్వ శిక్ష ఉద్యోగలను రెగ్యులర్ చేయాలి - వారి సమస్యలను వెంటనే పరిష్కారం చేయాలని

### గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సి అభ్యర్థి లంటు చంద్రశేఖర్ డిమాండ్"



**సత్యమేవ జయతే-మెదక్** మెదక్ కలెక్టర్ కార్యాలయం ముందు సమ్మె చేస్తున్న ఉద్యోగల న్యాయమైన కోరికలను ప్రభుత్వం వెంటనే స్పందించి పరిష్కరిచాలని గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సి అభ్యర్థి లంటు చంద్రశేఖర్ కోరారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ సోషల్ ఫోరం తరుపున సంపూర్ణ మద్దతు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీసీ సంఘం రాష్ట్ర నాయకులు పోలా విజయ్ కుమార్, ఉద్యోగ సంఘం జిల్లా అధ్యక్షులు రాజు, న్యాయవాది దొడ్ల శ్రీనివాస్ రెడ్డి,రాము తదితరులు పాల్గొన్నారు.

# 44 కోట్ల రూపాయలతో అమృత్ జలపథకం






**మహిళల ఆర్థిక పరిస్థితి మెరుగు కోసమే మహిళా శక్తి దామోదర్ రాజనర్సింహ, రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి.**

**సంగారెడ్డిలో మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో దుకాణ సముదాయం ప్రారంభం.**

**-రాష్ట్రంలోని మొదటి మహిళా శక్తి పెట్రోల్ పంపు ప్రారంభించిన మంత్రి.**

**ప్రతి అమ్మాయి చదువుకోవాలి.**

**అమ్మాయిల చదువుతో కుటుంబంలో అనేక మార్పులు వస్తాయి.**

**-మహిళలు వివిధ రంగాల్లో పెట్టుబడులు పెట్టే స్థాయికి ఎదగాలి అనేది ప్రభుత్వ సంకల్పం.**

**సత్యమేవ జయతే-సంగారెడ్డి,** జనవరి 03:- సంగారెడ్డి పట్టణం లో పురపాలక శాఖ ఆద్వర్యం లో పట్టణం లో ఇంటింటికీ మంచినీరు సరఫరా చేయాలనే సంకల్పం తో 44 కోట్ల రూపాయలతో అమృత్ జల పథకాన్ని, మహిళల సంక్షేమం, ఆర్థిక అభివృద్ధి కోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా మహిళా శక్తి పథకాన్ని రాష్ట్రంలో చేపట్టిందని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రమైన సంగారెడ్డిలో జిల్లా మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన మహిళా షాపింగ్ కాంప్లెక్స్ ను, స్థానిక ఎంపిడిఓ కార్యాలయ ఆవరణలో మోడల్ ఇందిరమ్మ ఇండ్లకు శంఖుస్థాపన కార్యక్రమము , మహిళా శక్తి పథకంలో భాగంగా రాష్ట్రంలోని మొట్టమొదటి మహిళా పెట్రోల్ పంపును మంత్రి దామోదర్ రాజనర్సింహ, మెదక్ ఎంపీ రఘునందన్ రావు, సంగారెడ్డి ఎమ్మెల్యే చింత ప్రభాకర్ , టీజీఐఐసీ చైర్మన్ నిర్మల జగ్గారెడ్డి, జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి లతో కలిసి ప్రారంభించారు .ఈ సందర్భంగా జిల్లాలోని వివిధ మండలాలకు చెందిన మహిళా సమాఖ్య సభ్యులతో ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి మాట్లాడారు. మహిళల ఆర్థిక అభివృద్ధి కోసం ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఎన్నో పథకాలు చేపట్టినప్పటికీ మహిళల్లో అనుకున్న స్థాయిలో ఆర్థికంగా ఎదగలేకపోతున్నారన్నారు. మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెంది వివిధ రంగాలలో పెట్టుబడులు పెట్టే స్థాయికి ఎదగాలన్నది ప్రభుత్వ ఉద్దేశం అన్నారు .అందుకోసం రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్రంలో ప్రతిష్టాత్మకంగా మహిళా శక్తి పథకాన్ని ఏర్పాటు చేసిందన్నారు. పథకం ద్వారా మహిళల ఆర్థిక అభివృద్ధి కోసం మహిళ క్యాంటీన్ల ఏర్పాటు ,పెట్రోల్ పంపు ఏర్పాటు, ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ల ఏర్పాటు లాంటి పథకాలను చేపట్టిందన్నారు. మహిళా శక్తి పథకాన్ని మహిళలు సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా అభివృద్ధి చెందాలన్నారు. గ్రామీణ ప్రాంతాల్లోని ప్రతి అమ్మాయి ఉన్నత చదువులు చదవాలన్నారు మహిళలు చదువుకుంటే కుటుంబాల్లో పెను మార్పులు సంభవిస్తాయన్నారు. దీంతో గ్రామాల్లో అభివృద్ధి వేగంగా జరుగుతుందన్నారు. కుటుంబంలో మహిళలు చదువుకుంటే ఆర్థిక స్థిరత్వం కలుగుతుందన్నారు. మహిళలు అన్ని రంగాల్లో రాణించాలన్నారు ప్రభుత్వ కాంట్రాక్టులు మహిళా సంఘాల ఆధ్వర్యంలో నిర్వహిస్తాం అని మహిళలు ముందుకు వచ్చే విధంగా ఆర్థికంగా అభివృద్ధి చెందాలని మంత్రి ఆకాంక్షించారు.

అనంతరం కలెక్టరెట్ కార్యాలయాల లో 11 అంబులెన్సు వాహనాలకు మంత్రి జెండా ఊపి ప్రారంభించారు. ఈ అంబులెన్స ప్రారంభోత్సవ కార్యక్రమంలోఈరోజు సంగారెడ్డి క్లస్టర్ 108 కొత్త అంబులెన్సుల ప్రారంభోత్సవాన్ని వైద్యారోగ్య శాఖ మంత్రి శ్రీ దామోదర రాజనరసింహ గారు, కలెక్టర్ శ్రీమతి. వల్లూరి క్రాంతి గారు, మరియు %ఐవీడనూ%, శ్రీమతి. గాయత్రి పాల్గొన్నారు.ఈ సందర్భంగా మెదక్ ఎంపీ రఘునందన్ రావు మాట్లాడుతూ మహిళల ఆర్థిక అభివృద్ధి కోసం పెట్రోల్ పంపు, మహిళ షాపింగ్ కాంప్లెక్స్ మంజూరు చేసి వారి ఆర్థిక ఎదుగుదలకు సహకరించిన అధికారులకు ఈ సందర్భంగా ఎంపీ కృతజ్ఞతలు తెలిపారు. స్థానిక సంస్థల్లో ఇప్పటికే మహిళలకు ప్రభుత్వం 50% రిజర్వేషన్ కల్పించిందని రానున్న అసెంబ్లీ పార్లమెంట్ ఎన్నికల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్ రానున్నట్లు ఎంపీ తెలిపారు దీంతో మహిళలు రాజకీయంగా కూడా రాణించే అవకాశం ఉందన్నారు. ఎమ్మెల్యేలు ఎంపీలుగా పోటీ చేయడానికి మహిళలు ఇప్పటి నుండే ముందుకు రావాలన్నారు. మహిళలు ఆత్మనూన్యతా భావం నుండి బయటపడాలన్నారు . టీజీఐఐసీ చైర్మన్ నిర్మల జగ్గారెడ్డి లు మాట్లాడుతూ జిల్లాలో మహిళల ఆర్థిక అభివృద్ధి కోసం ప్రభుత్వం మహిళా శక్తి పథకంలో పెట్రోల్ పంపు షాపింగ్ కాంప్లెక్స్ ఏర్పాటు చేయడం మహిళలకు ఆర్థిక అభివృద్ధికి వాదం చేస్తుందన్నారు షాపింగ్ కాంప్లెక్స్ ను పెట్రోల్ పంపులు సద్వినియోగం చేసుకొని మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలన్నారు మహిళ సమస్యల పరిష్కారం కోసం ఎప్పుడు అందుబాటులో ఉండన్నట్లు తెలిపారు వారి సమస్యలతో దృష్టికి తీసుకొస్తే వెంటనే పరిష్కరించనున్నట్లు తెలిపారు. మహిళా సాధికారత కోసం చేపట్టిన మహిళా శక్తి పథకం సద్వినియోగం చేసుకోవాలని అన్నారు

జిల్లా కలెక్టర్ వల్లూరు ప్రాంతీయ రాష్ట్రంలోనే మహిళా శక్తి కార్యక్రమం లో భాగంగా మహిళలకు మొట్టమొదటి పెట్రోల్ పంపు జిల్లాలో ఏర్పాటు చేయడం హర్షించదగ్గ విషయం అన్నారు. మహిళా శక్తి కార్యక్రమంలో ఎన్నో మంచి పథకాలు ఉన్నాయన్నారు. వాటిని జిల్లాలో ప్రారంభించేందుకు చర్యలు చేపట్టినట్లు తెలిపారు ఈవెంట్ ప్రోగ్రాం నిర్వహణ, ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ల ఏర్పాటు ద్వారా మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందటానికి అవకాశాలు ఉన్నాయని అన్నారు . మహిళలకు శిక్షణ ఇచ్చి బ్యాంకు లింకేజీల ద్వారా లోన్ ఇవ్వడం మహిళలు ఎదగడానికి కృషి చేయడం జరుగుతుందన్నారు. గ్రామాల్లో డిమాండ్ ఉన్న యూనిట్స్ నెలకొల్పి మహిళలు పారిశ్రామికవేత్తలుగా ఎదగాలని సూచించారు పిల్లలు పెద్ద పెద్ద యూనిట్లు స్థాపించి పారిశ్రామికవేత్తలుగా ఎదగాలన్నారు ఆర్థికంగా ఎదగడానికి ఆదాయం పెంపొందించుకునే మార్గాలు సూచించుకోవాలని ఇతరులకు ఆదర్శంగా నిలబడాలని పేర్కొన్నారు.

సంగారెడ్డి ఎమ్మెల్యే చింత ప్రభాకర్ మాట్లాడుతూ షాపింగ్ కాంప్లెక్స్, పెట్రోల్ బంక్ ఏర్పాటు ద్వారా మహిళల కలలు సహకారం అయిందన్నారు. గత ప్రభుత్వంలో అప్పటి మంత్రి హరీష్ రావు మహిళా సమాఖ్య షాపింగ్ కాంప్లెక్స్ కోసం రూ.75 లక్షలు మంజూరు చేసినట్లు, అప్పటి ప్రభుత్వం మంజూరు చేసిన 75 లక్షలకు అదనంగా 29 లక్షలు మహిళా సమాఖ్య ద్వారా ఖర్చుచేసి షాపింగ్ కాంప్లెక్స్ నిర్మించడం గర్వించదగ్గ రాష్ట్రంలోనే మొదటి పెట్రోల్ పంపు తన సంగారెడ్డి నియోజకవర్గంలో మహిళ శక్తి పథకంలో ఏర్పాటు చేయడం సంతోషంగా ఉందన్నారు.

ఈ కార్యక్రమంలో మునిసిపల్ చైర్మన్ విజయలక్ష్మి ,కార్పోరేషన్ చైర్మన్లు , అదనపుకలెక్టర్ చంద్రశేఖర్ డిఆర్డిఓ జ్యోతి , ఆర్ డి ఓ రవీందర్ రెడ్డి , ఇండియన్ ఆయిల్ కంపెనీ ప్రతినిధి రామ్ ఇప్పిలి , కార్పోరేషన్ చైర్మన్లు , సి డి సి చైర్మన్లు సంబంధిత అధికారులు ,

## ఐఐటీలు ఆవిష్కరణలకు కేంద్రాలు: తెలంగాణ ఉపముఖ్యమంత్రి బట్టి విక్రమార్క





**ఐఐటీలు కేవలం విద్యా సంస్థలు కాదు... దేశ నిర్మాణ కేంద్రాలు.**

**అద్భుతమైన ఆవిష్కరణలకు వేదిక ఐఐటి హైదరాబాద్.**

**ఐఐటి హైదరాబాద్(కంది )లో ఆస్ట్రేలియా ఇండియా క్రిటికల్ మినరల్స్ వర్క్ షాప్ ని ప్రారంభించిన ఉపముఖ్యమంత్రి.**

**సత్యమేవ జయతే-సంగారెడ్డి, జనవరి 03:-**ఐఐటీలు అద్భుత ఆవిష్కరణలకు కేంద్రాలుగా మారాయి అని తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమార్క అన్నారు. శుక్రవారం ఐఐటి హైదరాబాద్ (కంది) లో నిర్వహించిన ఆస్ట్రేలియా- ఇండియా క్రిటికల్ మినరల్స్ రీసెర్చ్ హబ్ వర్క్ షాప్ కు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఐఐటి హైదరాబాద్ అద్భుతమైనఆవిష్కరణల కు చిరునామా గా మారిందన్నారు. ఐఐటి హైదరాబాద్ విద్యార్థుల, దేశ భవిష్యత్తుకు కలల కర్మాగారం అన్నారు.ఐఐటీలు కేవలం విద్యాసంస్థలు మాత్రమే కాదు దేశ నిర్మాణానికి వేదికలు అని ఐఐటి హైదరాబాదులో ఇప్పటివరకు 11,500 పరిశోధన ప్రచురణలు, 320 పైగా పేటెంట్లు మరియు స్టార్టప్పుల ద్వారా 1500 కోట్ల ఆదాయాన్ని ఆర్జించడం గొప్ప విషయం అన్నారు.ఆస్ట్రేలియా- ఇండియా క్రిటికల్ మినరల్స్ రీసెర్చ్ హబ్ కింద మోనాష్ యూనివర్సిటీ సహకారంతో చేపట్టిన కార్యక్రమాలు కేవలం తెలంగాణకే కాదు భారతదేశానికే కాదు ప్రపంచానికే కీలకం గా మారనున్నట్లు తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలో క్లీన్ అండ్ గ్రీన్ ఎనర్జీ పాలసీని రూపొందించడంలో ఈ వర్క్ షాప్ సహకార స్ఫూర్తి కి అద్దం పడుతుంది అన్నారు.భారతదేశంలోఐఐటీలకు ఆధ్యుడు మన దేశ మొట్టమొదటి ప్రధాని పండిట్ జవహర్ లాల్ నెహ్రూ అని అన్నారు. ఐఐటీల ను ఆధునిక భారతదేశ దేవాలయాలుగా నెహ్రూ అభివర్ణించినట్లు తెలిపారు. భారతదేశంలోసైన్స్ అండ్ టెక్నాలజీ పేదరికం, అసమాన తలపై పోరాడడానికి అవసరమైన సాధనాలుగా ఐఐటీలను నెహ్రూ పేర్కొన్నారు అన్నారు.ఐఐటి హైదరాబాద్ ఏర్పాటులో అప్పటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి, దివంగత కాంగ్రెస్ నేత వైయస్ రాజశేఖర్ రెడ్డి కీలకపాత్ర పోషించారు.. వారి నాయకత్వంలో ఐఐటి హైదరాబాద్ కు పునాదులు పడ్డాయి అన్నారు. వైయస్ రాజశేఖర్ రెడ్డి ఒక గొప్ప రాజకీయ నాయకుడు తో పాటు గొప్ప సంఘసంస్కర్త అన్నారు రాష్ట్రంలో విద్య వైద్య సౌకర్యాల మెరుగు కోసం నిరుపేదల జీవితాల్లో వెలుగు నింపడం కోసం విద్యా వైద్య రంగాల అభివృద్ధికి ఎన్నో సంక్షేమ పథకాలు చేపట్టిన ఘనత వైయస్ రాజశేఖర్ రెడ్డి కి దక్కుతుందన్నారు. ఐఐటి హైదరాబాద్ ఏర్పాటు చేసే సమయంలో ఎమ్మెల్సీగా నేను భాగస్వామిని కావడం అదృష్టంగా భావిస్తున్నట్లు తెలిపారు.తెలంగాణలో క్లిష్టమైన ఖనిజాలను వెలికి తీసేందుకు సమర్థవంతమైన మార్గాలు కనుగొనడం, స్థిరమైన మైనింగ్ పద్ధతులు అవసరమని రాష్ట్ర ప్రభుత్వం గుర్తించిందన్నారు.అందుకోసమే తెలంగాణ ప్రభుత్వం క్లీన్ అండ్ గ్రీన్ ఎనర్జీ పాలసీ ద్వారా పరిశోధన. వాటి సంబంధిత సైన్స్ ఆధార కార్యక్రమాలకు ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు.క్లిష్టమైన ఖనిజాలు పారిశ్రామిక ముడి పదార్థాలు మాత్రమే కాదు అని అవి హరిత ఆర్థిక వ్యవస్థ నిర్మాణానికి ఉపయోగపడతాయి అన్నారు.సోలార్ పవర్ ప్యానెల్స్, విండ్ టర్బైన్లు, ప్రతి ఎలక్ట్రిక్ వాహనం, విద్యుత్తు నిల్వ బ్యాటరీలు వంటివి క్లిష్టమైన ఖనిజాల ద్వారానే తయారవుతాయన్నారు.

2030 నాటికి 20 వేల మెగావాట్ల గ్రీన్ ఎనర్జీని రాష్ట్రంలో ఉత్పత్తి చేయడానికి ప్రణాళికలు సిద్ధం చేసినట్లు తెలిపారు.గ్రీన్ హైడ్రోజన్ టెక్నాలజీని భవిష్యత్తు ఇంధనం గా ప్రభుత్వాలు భావిస్తున్నట్లు తెలిపారు . ఆవిష్కరణల ప్రోత్సాహానికి సుస్థిరతకు తెలంగాణ ప్రభుత్వం నిబద్ధతతో పనిచేస్తుంది అన్నారు.ఐఐటీల ఆలోచనలు పరిశ్రమలను పునర్ నిర్వచిస్తాయి, ఆర్థిక వ్యవస్థలను పునర్మిస్తాయి అన్నారు.గ్రీన్ ఎనర్జీ, స్థిరమైన టెక్నాలజీ, శాస్త్రీయ ఆవిష్కరణలలో దేశంలో మొదటి స్థానంలో నిలిచేందుకు తెలంగాణ ప్రభుత్వం నిబద్ధతతో పనిచేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్ బిఎస్ మూర్తి, డైరెక్టర్, ఐఐటి హైదరాబాద్, గౌరవ అతిథి, ఎమ్ స్ హిల్లరీ మెక్‌గేచీ, కాన్సుల్ జనరల్, ఆస్ట్రేలియన్ కాన్సులేట్-జనరల్ బెంగళూరు, గోపాల్ బాగ్లే, భారతదేశ హైకమిషనర్, ఆస్ట్రేలియా (ఆన్‌లైన్), దినేష్ మహూర్, జాయింట్ సెక్రటరీ, గనుల మంత్రిత్వ శాఖ బలరాం నాయక్, సింగరేణి కాలరీస్ సిఎండి,ప్రొఫెసర్ మోహన్ యెల్లిశెట్టి, మోనాష్వి విశ్వవిద్యాలయం, ప్రొఫెసర్ నరసింహ మంగదొడ్డి, ఐఐటి హైదరాబాద్, తదితరులు పాల్గొన్నారు.

**తొలి మహిళా ఉపాధ్యాయురాలు, సంఘ సంస్కర్త సావిత్రి బాయి పూలే 194 వ జయంతి సందర్బంగా ఫోరమ్ ఫర్ బెటర్ సంగారెడ్డి ఆధ్వర్యంలో నివాళులు అర్పించిన నాయకులు.**



**సత్యమేవ జయతే -సంగారెడ్డి** సంగారెడ్డి జిల్లా కేంద్రం లో సావిత్రి బాయి పూలే 194 వ జయంతి సందర్భంగా సావిత్రి బాయి పూలే విగ్రహనికి పూల మాల వేసి నివాళులు అర్పించిన ఫోరమ్ నాయకులు.ఈ సందర్భంగా ఫోరమ్ అధ్యక్షులు శ్రీధర్ మహేంద్ర మాట్లాడుతూ, స్వాతంత్రనికి పూర్వమే భారత దేశంలో అణగారిన వర్గాల సామాజిక హక్కుల కోసం మహిళా అభ్యుదయం కోసం మహిళల విద్య కోసం కృషి చేసిన సంఘ సంస్కర్తగా,తొలి మహిళ ఉపాధ్యాయురాలుగా సావిత్రి బాయి పూలే దేశ చరిత్రలో నిలిచారాని ఆమె ఆశయం ప్రతి ఒక్కరికి స్ఫూర్తి దాయకం అని అన్నారు. ఇట్టి కార్యక్రమం లో ఫోరమ్ ఫర్ బెటర్ సంగారెడ్డి ప్రధాన కార్యదర్శి అమిదిపురం మహేష్ కుమార్, కోశాధికారి తిమ్మాగాళ్ల ప్రమీల, సహ కార్యదర్శి గడ్డం పాండురంగం, కార్యవర్గ సభ్యులు తిమ్మాగాళ్ల రాజు, నాయకులు మేకల రామస్వామి తదితరులు పాల్గొన్నారు.

**టీ-నాబు, సంగారెడ్డి జిల్లా పోలీసుల సంయుక్త ఆపరేషన్లో గంజాయి అక్రమ రవాణాపై ఉక్కుపాదం.**

**జహీరాబాద్ సబ్-డివిజన్ పోలీసులు నిర్వహించిన మెగా వెహికిల్ చెక్కింగ్ నందు సుమారు 30 లక్షల విలువ గల 110 కిలోల నిషేదిత ఎండు గంజాయి స్వాధీనం.**

**వివరాలు వెల్లడించిన జిల్లా ఎస్పీ చెన్నూరి రూపేష్**




**సత్యమేవ జయతే -సంగారెడ్డి** ఈ సందర్భంగా జిల్లా పోలీసు కార్యాలయం సంగారెడ్డి నందు ఏర్పాటు చేసిన ప్రెస్ మీట్ లో జిల్లా ఎస్పీచెన్నూరి రూపేష్ మాట్లాడుతూ.. నమ్మదగిన సమాచారం మేరకు శుక్ర వరం తేది: 03-01-2025 నాడు తెల్లవారు జామున జిల్లా ఎస్పీ శ్రీ చెన్నూరి రూపేష్ ఆదేశాల మేరకు జహీరాబాద్ డిఎస్పి రామ్మోహన్ రెడ్డి, ఇన్స్పెక్టర్ శివలింగం, టౌన్ ఎస్ఐ కాశీనాథ్, రూరల్ ఎస్ఐ ప్రసాద్ రావ్, చిరాగ్ పల్లి ఎస్ఐ రాజేందర్ రెడ్డి మరియు సబ్-డివిజన్ సిబ్బందితో కలిసి జహీరాబాద్ శివారులో గల పాత ఆర్టీవో చెక్పోస్ట్ సమీపంలో యన్.హెచ్.65 బై పాస్ రోడ్డు పై మెగా వెహికిల్ చెక్కింగ్ చేస్తుండగా ఉదయం సుమారు 7:15 నిమిషాలకు సమయంలో హైదరాబాద్ నుండి ముంబై వైపు వెళ్తున్న ఒక కారు నెంబర్ %వీఎ43శ%4796 గల దానిని ఆపడానికి ప్రయత్నించగా అట్టి కార్ డ్రైవర్ తన కారును ఆపకుండా పారిపోతూ కొద్ది దూరం వెళ్ళి కారును వదిలి అందులో ముగ్గురు వ్యక్తులు పారిపోగా, ఇద్దరు వ్యక్తులు పట్టుకోన్నారు. 1) మహమ్మద్ అక్బర్ తండ్రి మహబూబ్, వయస్సు: 22 సంవత్సరాలు, వృత్తి: కూలిపని, నివాసము శాంతినగర్, జహీరాబాద్. 2) మహమ్మద్ సల్మాన్ తండ్రి మహబూబ్ వయస్సు: 24 సంవత్సరాలు, వృత్తి: కూలిపని, నివాసం: శాంతినగర్, జహీరాబాద్. పారిపోయిన వారిలో వీరి అన్న ఇస్మాయిల్ అతని అనుచరులు మహబూబ్, రజాక్ లు ఉన్నారు. పై వ్యక్తులు నవాజ్ మరియు షబ్బీర్ ల ఆదేశానుసారం, వారు ఇచ్చిన మారుతి షిఫ్ట్ కార్ నెంబర్ %వీఎ43శ%4796 గలదానిలో ఒరిస్సా బోర్డర్ ఉండి 110 కిలోల ఎండు గంజాయిని తీసుకొని వస్తూ ఉండగా, నవాజ్ మరియు షబ్బీర్ ముందు సిల్వర్ కలర్ ఇన్నోవా కారులో సిగ్నల్ ఇస్తూ వెళ్తుండగా వారిని వెంబడిస్తూ ముంబైకి గంజాయి అక్రమ రవాణా చేస్తుండగా ఈ రోజు మెగా వెహికిల్ చెక్కింగ్ నందు 110 కిలోల ఎండు గంజాయి, ఇద్దరు వ్యక్తులను పట్టుకోవడం జరిగింది అన్నారు. సీజ్ చేసిన గంజాయి 27-ప్యాకెట్లు, ఒక్కొక్క ప్యాకెట్ సుమారు 4-కిలోలు కలదు, పై వ్యక్తుల నుండి రెండు సెల్ ఫోన్ లను స్వాధీనం చేసుకొని, జహీరాబాద్ టౌన్ పోలీసు స్టేషన్ నందు కేసు నమోదు చేసి, నిందితులను రిమాండ్ కు తరలించడం జరుగుతుంది అన్నారు. జిల్లాలో మాదక ద్రవ్యాల దుర్వినియోగంపై జిల్లా పోలీసు శాఖ ఉక్కు పాదం మోపడం జరుగుతుందని, ఎవరైనా గంజాయి లేదా ఇతర మాదక ద్రవ్యాలను సాగు, సరఫరా చేసిన సంగారెడ్డి జిల్లా ఎస్ -నాబు నెంబర్ 8712656777 కు సమాచారం అందించాలని, సమాచారం అందించిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామన్నారు. ఇట్టి కేసు చేదనలో కీలకంగా వ్యవహరించిన అధికారులను, సిబ్బందిని జిల్లా ఎస్పీ అభినంచారు.

ఈ ప్రెస్ మీట్ నందు అదనపు ఎస్పీ ఎ.సంజీవ రావ్, జహీరాబాద్ డియస్పి రామ్ మోహన్ రెడ్డి, టీ-నాబు డియస్పి పుష్పన్ కుమార్, జహీరాబాద్ టౌన్ ఇన్స్పెక్టర్ శివలింగం, ఎస్ఐ కాశీనాథ్, ప్రసాద్ రావ్ సిబ్బంది తదితరులు ఉన్నారు

## కొత్త వైరస్ కథనాలపై స్పందించిన చైనా

**హెచ్ఎంపీవీ వైరస్ కథనాలను కొట్టిపారేసిన చైనా**

**శీతాకాలంలో శ్వాసకోశ వ్యాధుల తీవ్రత సహజమేనని వెల్లడి**

**అయినా నివారణకు మార్గదర్శకాలు జారీ చేసినట్లు వెల్లడి**

హెచ్ఎంపీవీ వైరస్ విషయమై వస్తోన్న కథనాల్లో ఎలాంటి వాస్తవం లేదని చైనా తెలిపింది. చైనాలో కొత్త వైరస్ హెచ్ఎంపీవీ కారణంగా ఆసుపత్రుల్లో రద్దీ పెరిగిందని కథనాలు వచ్చాయి. దీంతో చైనా విదేశాంగ శాఖ ఈ కథనాలపై స్పందించింది. కొత్త వైరస్ కారణంగా ఆసుపత్రుల్లో రద్దీ పెరిగిందన్న నివేదికలను కొట్టిపారేసింది. శీతాకాలంలో శ్వాసకోశ వ్యాధుల తీవ్రత సహజమేనని, అయినప్పటికీ గత ఏడాదితో పోలిస్తే తీవ్రత తక్కువగా ఉందని తెలిపింది.విదేశీయులు తమ దేశంలో పర్యటించేందుకు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, సురక్షితమేనని హామీ ఇచ్చింది. చైనా పౌరులతో పాటు తమ దేశంలోని విదేశీయుల ఆరోగ్యంపై తమ ప్రభుత్వం శ్రద్ధ చూపుతుందని వెల్లడించింది. ఈ మేరకు విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి మావో నింగ్ వెల్లడించారు. శీతాకాలంలో శ్వాసకోశ వ్యాధుల నిర్మూలన, నియంత్రణకు సంబంధించి తమ దేశానికి చెందిన నేషనల్ డిసీజ్ కంట్రోల్ అండ్ ప్రివెన్షన్ మార్గదర్శకాలు జారీ చేసినట్లు తెలిపారు. హెచ్ఎంపీవీ వైరస్ లక్షణాలు కూడా ఫ్లూ, ఇతర శ్వాసకోశ ఇన్‌ఫెక్షన్ మాదిరిగానే ఉంటాయని వైద్య నిపుణులు తెలిపారు. ఈ వ్యాధి లక్షణాలు బయటకు కనిపించడానికి మూడు నుంచి ఆరు రోజులు పడుతుందని చెబుతున్నారు. దగ్గు, తుమ్ములతో బాధపడే వారి తుంపర్లు, వైరస్ బారిన పడిన వ్యక్తులతో సన్నిహితంగా ఉండటం, కరచాలనం చేయడం, తాకడం వంటి చర్యలతో ఒకరి నుంచి మరొకరికి వ్యాపిస్తుందని డాక్టర్లు చెప్పారు. చిన్న పిల్లలు, వృద్ధులు దీని బారిన పడే అవకాశాలు ఎక్కువ. 2001లోనే హెచ్ఎంపీవీని గుర్తించారు.

# రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు పెద్దపీట వేస్తోంది.







## మీడియా సమావేశంలో తెలంగాణ రాష్ట్ర ఆయిల్ ఫెడ్ కార్పొరేషన్ చైర్మన్ శ్రీ జంగా రాఘవరెడ్డి గారు మాట్లాడుతూ.......-రెండు లక్షల రుణమాఫీ సన్నాలకు 500 బోనసు రైతు భరోసా పంట నష్టపరిహారం మట్టి పరీక్షలు ఇలా అనేక రకాలుగా వ్యవసాయ అభివృద్ధికి తోడ్పడుతుంది

**సత్యమేవ జయతే -జనగామ** వ్యవసాయంపై మంచి పట్టు అనుభవమున్న మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మనకు వరం ఆయన 200 ఎకరాల్లో ఆయిల్ ఫామ్ చేస్తున్నారు ప్రతి రైతు ఈ పంట వైపు మొగ్గు చూపాలిజనగామ ప్రాంతంలో ఆయిల్ ఫామ్ కు అనువైన భూములు ఉన్నాయి-మహానేత దివంగత ముఖ్యమంత్రి వైయస్ రాజశేఖర్ రెడ్డి నాడు ప్రాజెక్టులో కాలువల నిర్మాణంతోనే ఈ ప్రాంతం ప్రస్తుతం సస్యశ్యామలమైంది.-100% సరిగా మారి సాగు జరుగుతుంది అంటే ఆ మహానేత చలవే-రైతులు తప్పనిసరిగా పంట మార్పిడి చేసుకోవాలి మూడేళ్లు వరుసగా వరి పంట సాగు చేస్తే నేల చౌడుగా మారుతుంది దిగుబడులు కూడా పెరుగుతాయి-వరి సాగు చేయడం వల్ల రైతుకు మిగిలే లాభం తక్కువే ఆయిల్ ఫామ్ వేరుసెనుగా ఇతర ఆరు తాటి పంటల వైపు మొగ్గుచూపితే అధిక లాభాలు ఆర్జించే అవకాశం ఉంటుంది.-ఆయిల్ ఫామ్ పంట సాగు సమయంలో కోతులు అడవి పందుల బెడద ఉండదు-ఇక్కడ ఎవరికీ అందించే సాగునీరు మూడు ఎకరాల ఆయిల్ ఫామ్ కు అందించే అవకాశం ఉంటుంది.-ఆయిల్ ఫామ్ పంట సాగులో అంతర్ పంటగా అనేక పంటలను వేసుకునే అవకాశం ఉంటుంది అంతర్ పంటలపై వచ్చే లాభాలతో ఆయిల్ ఫామ్ సాగు చేసుకుని దానిపై వచ్చే లాభాన్ని వెనుకేసుకోవచ్చు-ప్రస్తుతం అనేక దేశాల నుంచి ఆయిల్ దిగుమతి చేసుకుంటున్నాము రైతులకు ఎలాంటి బెంగ లేదు ఎంత సాగు చేసినా కొనుగోలు చేసేందుకు ప్రభుత్వాలు సిద్ధంగా ఉంటాయి.-జనగామ నీళ్లల్లో ఆయిల్ ఫామ్ సాగు 21 శాతం దిగుబడి వస్తుంది.-ఆయిల్ ఫామ్ సాగుపై కొన్ని రైతు సంఘాలు పక్కదోలు పట్టించే పరిస్థితి ఉంది గత విఆర్ఎస్ ప్రభుత్వ సమయంలో కొన్ని ప్రైవేటు కంపెనీలకు అనుమతులు ఇచ్చారు వారు ప్రభుత్వ ఆయిల్ ఫేడ్ మార్కెట్లు దెబ్బతీసే ప్రయత్నం చేస్తున్నారు-ఆయిల్ ఫామ్ సాగు చేసే ఓసి, బీసీ రైతులకు డ్రిప్పు కోసం 80 శాతం ఎస్సీ ఎస్టీలకు 100% సబ్సిడీ ఇస్తున్నాం.ఎకరా సాగుకు మెయింటనెన్స్ కింద 4500 మొక్కకు 25 రూపాయలు తోపాటు మూడేళ్ల పాటు తామే పర్యవేక్షణ చేస్తున్నాం-ప్రస్తుతం జనగామలో 7000 ఎకరాల విస్తీర్ణం లో ఉన్న ఆయిల్ ఫామ్ త్వరలోనే 30 వేలకు పెంచుతాం ప్రస్తుతం సిద్దిపేట జిల్లా దేవుని నెరవేటర్ లో ఆయిల్ ఫ్యాక్టరీ ఉండగా జనగామలో ఏర్పాటు చేసేందుకు ప్రయత్నాలు చేస్తున్నాం-జనగామ జిల్లాలోని జనగామ పాలకుర్తి స్టేషన్ఘన్పూర్ మూడు నియోజకవర్గాల్లో కలెక్షన్స్ సెంటర్లను కూడా ఏర్పాటు చేస్తున్నాం ఇందుకు సంబంధించి స్థల సేకరణ పూర్తయింది-వ్యవసాయ క్షేత్రం నుంచి ఆయిల్ ఫామ్ కలెక్షన్ సెంటర్లకు తీసుకువచ్చే సమయంలో ట్రాన్స్పోర్ట్ సైతం ఆయిల్ పెట్టందిస్తుంది.ఆయిల్ ఫుడ్ ప్రస్తుతం 12.5% ప్రాఫిట్ లో ఉంది -సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వ అధికారంలకి వచ్చాక ఆయిల్ పేడ్ను మరింత ముందుకు తీసుకొళ్లేందుకు 356 కోట్ల నిధులను విడుదల చేసింది.-త్వరలో ప్రతి జిల్లాలో విజయ ఆయిల్ అమ్మకాల కోసం ప్రత్యేక భవనము సేల్స్ కౌంటర్లను ఏర్పాటు చేస్తాం.-ఆయిల్ ఫార్ మొక్కలు ఇచ్చే సమయంలో కల్లి మొక్కలు వస్తే అందుకు సంబంధించి తామే రీప్లేస్మెంట్ చేస్తాము-జనగామ మండలం సిద్దంకి గ్రామంలో ఉన్న 65 ఎకరాలకు సంబంధించి ఆయిల్ షెడ్డు తీసుకొని అందులో నరసరి ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటు చేసే ప్రయత్నం చేస్తున్నాము ఉమ్మడి జిల్లాలోని ఇది అతి పెద్ద ప్రాసెసింగ్ సెంటర్ అవుతుంది ప్రభుత్వం వద్ద పెండింగ్లో ఉంది మూడు నెలల్లో పూర్తి చేసే ప్రయత్నంప్రస్తుతం పెంబర్తి జంక్షన్ వద్ద 32 ఎకరాల్లో ఉన్న నర్సరీని చంపకిల్స్ కు తరలించే ప్రయత్నం చేస్తున్నం అక్కడ రెండెకరాల కేటాయించారు...

# అమెరికన్ సామ్రాజ్యవాద విష వారసత్వం




వియత్నాం యుద్ధం 1955 నుండి 1975 వరకు ఇరవయ్యేళ్ల పాటు కొనసాగింది. చరిత్రలో ఇంతటి విపత్కర అధ్యాయం పట్ల పశ్చాత్తాపం గాని, చేసిన దుర్మార్గం ఒప్పుకోలు ప్రకటనగానీ మనకు కానరాదు. ఈ యుద్ధం మానవ సమాజం మీదా, పర్యావరణం మీదా లోతైన గాయం మిగిల్చింది. ఇది మిగిలిన యుద్ధాల వంటి యుద్ధం కాదు. ఒక దేశం మీదో ఆ దేశ ప్రజానీకం మీదో, వాళ్లదైన చిన్న ప్రపంచం మీదో సామ్రాజ్యవాద శక్తులు నిరంతరాయంగా, నిర్దయగా చేసిన అమానవీయ, అమానుష యుద్ధం. ఈ యుద్ధం మాటున చేసిన విధ్వంసం, ప్రజానీకానికి మిగిల్చిన బాధ, వేదన కొన్ని దశాబ్దాలుగా ప్రతిధ్వనిస్తూనే ఉన్నాయి. ఈ యుద్ధానికి ఉన్న చారిత్రక మూలాలు, ఈ యుద్ధం మూలంగా జరిగిన పర్యావరణ విధ్వంసం వియత్నాం ప్రజానీకాన్ని ప్రపంచ ప్రజానీకాన్ని పీడకలలా వెంటాడుతూనే ఉన్నాయి.వలస పాలనను వ్యతిరేకిస్తూ వియత్నమిన్ శక్తుల పోరాటాన్ని అణిచివేయాలని ప్రయత్నిస్తున్న ఫ్రాన్స్‌కు అమెరికా బలమైన తోడుగా నిలిచింది. అమెరికా అధ్యక్షుడు ఐసెన్ హోవర్ 1954లో వియత్నాంలో నెలకొన్న పరిస్థితులు, దక్షిణాసియాకు మధ్య ఉన్న బాదరాయణ సంబంధం గురించి వివరిస్తూ ఒక దేశంలో (వియత్నాం) కమ్యూనిజం విజయం సాధిస్తే చుట్టుపక్కల దేశాలన్నీ అదే మార్గం పడతాయన్న ఆందోళన వ్యక్తం చేశాడు. అమెరికా అండదండగా నిలబడిన ఫ్రాన్స్‌ను హోచిమిన్ నాయకత్వాన వియత్నమిన్ శక్తులు 1954లో డియన్ బియన్ ఫు దగ్గర పరాజయం పాల్జేశాయి. వియత్నాం నుండి ఫ్రాన్స్ సైన్యం వైదొలగింది. వియత్నాం స్వతంత్ర దేశంగా ప్రకటించుకున్నది. అయితే ఈ స్వాతంత్ర్యం అట్టే కాలం నిలవలేదు. దోపిడీ శక్తులు జెనీవా ఒప్పందం పేరిట వియత్నాం దేశాన్ని కమ్యూనిస్టు పార్టీ జయించుకున్న ఉత్తర వియత్నాం, కమ్యూనిస్టు వ్యతిరేక దక్షిణ వియత్నాంగా రెండుగా విభజించాయి.అమెరికా సామ్రాజ్యవాద దాహంతో వియత్నాం అంతర్గత వ్యవహారాలలో తలదూర్చింది. ఉత్తర వియత్నాంలో ఏర్పడిన కమ్యూనిస్టు ప్రభుత్వం దక్షిణాసియా ఖండంలో పశ్చిమ దేశాల ఆధిపత్యానికి సవాలుగా నిలుస్తుందని అమెరికా భావించింది. 1964లో టోన్‌కిన్ జల సంధిలో చోటు చేసుకున్నదని చెబుతున్న నావికాదళ స్వల్ప ఘర్షణను సాకుగా తీసుకుని అమెరికా అధ్యక్షుడు లిండన్ బి జాన్సన్ అమెరికన్ కాంగ్రెస్ అనుమతి లేకుండా ఏకపక్షంగా వియత్నాంపై సైనిక చర్యకు పిలుపునిచ్చాడు. అధునిక యుద్ధ చరిత్రలో అత్యంత పాశవికమైన యుద్ధానికి అలా అంకురార్పణ జరిగింది.1965 నుండి 1973 వరకు అమెరికా 50 లక్షల మందికి పైగా సైన్యాన్ని వియత్నాం యుద్ధంలో మోహరించింది. అమెరికా వియత్నాంలో అంగుళం భూభాగాన్ని కూడా వదిలి పెట్టకుండా వైమానిక దాడుల ద్వారా బాంబుల వర్షం కురిపించింది. రసాయన యుద్ధానికి పాల్పడింది. అయితే అమెరికాలో ఈ యుద్ధానికి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నిరసన ప్రదర్శనలు చెలరేగాయి. అమెరికా దుర్మార్గ వైఖరికి వ్యతిరేకంగా అంతర్జాతీయ సమాజం తీసుకు వచ్చిన ఒత్తిడి, దేశీయంగా ఉధృతమైన నిరసనోద్యమాల నేపథ్యంలో అమెరికా వియత్నాం నుండి తన సైన్యాన్ని ఉపసంహరించుకుంటూ 1973లో పారిస్‌లో ఒక శాంతి ఒప్పందం మీద సంతకాలు చేసింది.అమెరికా వియత్నాం మీద బాంబు దాడులు చేసి విచక్షణా రహిత విధ్వంసానికి పాల్పడింది. కొత్తగా వెలుగు చూసిన రహస్య నివేదికలు ఈ బాంబు దాడుల వెనుక ఉన్న భయంకరమైన చేదు నిజాలను వెల్లడిస్తున్నాయి. వియత్నాం, లావోస్, కంబోడియాల మీద అమెరికా 130 లక్షల టన్నుల బాంబులు కురిపించింది. రెండవ ప్రపంచ యుద్ధంలో కురిపించిన మొత్తం బాంబుల పరిమాణం వియత్నాం మీద అమెరికా కురిపించిన బాంబులతో పోలిస్తే ఏ మూలకీ లెక్కలోకి రావు.క్వ్యాయాంగ్ ట్రై ప్రావిన్స్‌లోను, వియత్నాం, లావోస్, కంబోడియాల ఉమ్మడి సరిహద్దు ట్రై ప్రాంతంలోనూ దాదాపు 50,000 భారీ గోతులు ఉన్నట్లు కనుగొన్నారు. ఇవి కేవలం గోతులే కాదు. వీటి నిండా ఇంకా పేలని మందుగుండు పదార్థాలు నిండి ఉన్నాయని తేల్చి చెప్పారు. వియత్నాం యుద్ధం ముగిసి ఇప్పటికి యాభై ఏళ్లు కావస్తున్నది. ఈ రోజుకీ వియత్నాం గడ్డ మీద 6,00,000 టన్నుల పేలని మందు గుండు నిల్వలున్నాయి. యుద్ధం ముగిసినా ఈ పేలుడు పదార్థాల మూలంగా ఇప్పటి వరకూ లక్ష మంది సాధారణ పౌరులు దుర్మరణం పాలయ్యారని వియత్నాం ప్రభుత్వం అధికారికంగా వెల్లడించింది. వీటి మూలంగా ఈ రోజుకీ స్థానికులు భయం భయంగా దినదినగండంగా బతుకులు వెళ్లదీస్తున్నారు.మానవ జీవితాలంటే అమెరికా సామ్రాజ్యవాదానికి ఏ మాత్రం లెక్కలేదని వియత్నాంపై అది కురిపించిన బాంబులు తెలియచేస్తుంటే 'ఏజెంట్ ఆరెంజ్' పేరిట అది చేపట్టిన రసాయన యుద్ధం దాని రాక్షసత్వాన్ని వెల్లడిస్తుంది. 1962-1971 మధ్య కాలంలో అమెరికన్ సైన్యం వియత్నాం, తూర్పు లావోస్, కంబోడియాలోని కొన్ని ప్రాంతాలపై 750 లక్షల లీటర్ల విష రసాయనాలు విరజిమ్మింది. 1967-69 మధ్య కాలంలో ఈ విష రసాయనాలను అత్యధిక స్థాయిలో వినియోగిరచింది. సామూహిక విధ్వంసక ఆయుధాలలో రసాయన యుద్ధం అనేది మానవులు సష్టించిన అత్యంత కిరాతక యుద్ధ క్రీడగా నిలుస్తుంది. ఈ రసాయన యుద్ధం ద్వారా వియత్నాంలో పంటలను, అడవులను దుంప నాశనం చేసింది అమెరికా. పర్యావరణ దృష్ట్యా చూస్తే ఇది మానవ ప్రేరేపిత ఉత్పాతం. 30 లక్షల హెక్టార్ల పచ్చని అడవులు బీళ్లుగా మారాయి. జీవ వైవిధ్యం ఘోరంగా దెబ్బతిని పోయింది. పర్యావరణానికి తీరని విపత్తు దాపురించింది.

'ఏజెంట్ ఆరెంజ్' రసాయనాల విష ప్రభావాలతో దాదాపు 30 లక్షల మంది వియత్నమీయులు అనారోగ్యం పాలైతే మరో పది లక్షల మంది అంగ వైకల్యానికి లోనయ్యారని అధికారికంగా లెక్కించారు. యుద్ధానంతరం జన్మించిన తరం పిల్లలకు తాము ఎందుకు జన్యుపరమైన లోపాలతో వికారంగా ఉన్నామో తెలియదు. యుద్ధం పేరిట వియాత్నాంలో అమెరికా సష్టించిన విధ్వంసంతో పోలిస్తే అది చెల్లించిన పరిహారం హాస్యాస్పదంగా అనిపిస్తుంది.యుద్ధం మూలంగా వియత్నాం ఆర్థిక వ్యవస్థ ఘోరంగా దెబ్బతిని పోయింది. సాగుకి లాయకీ అయిన భూములు%ౌ%బాంబుల మూలంగా ధ్వంసం కావడం, లేదంటే ఏజెంట్ ఆరెంజ్ రసాయనాల మూలంగా దెబ్బతిని పోవడమో జరిగింది. దీనితో సాగు దెబ్బ తినిపోయి గ్రామీణ ప్రాంత ప్రజానీకం పేదరికంలోకి కూరుకుపోయారు. క్షుద్బాధ పట్టి పీడించింది. అటవీ ఉత్పత్తుల మీద ఆధారపడి జీవించే లక్షలాది మంది ప్రజానీకం కూడా జీవనోపాధి కోల్పోయి అదే దైన్యానికి లోనయ్యారు. నదులు, నీళ్ల చెలమలు, బావులు విష రసాయనాల ప్రభావంతో ప్రజల దాహార్తిని తీర్చడానికి పనికి రాకుండా పోయాయి. గత్యంతరం లేక అదే నీటిని వాడుకున్న జనం రోగాల పాలయ్యారు.సామాజిక జన జీవితం అస్తవ్యస్థం అయిపోయింది. మరణాలు, విస్థాపనలు, యుద్ధం మూలాన ఏర్పడిన మానసిక సమస్యలతో కుటుంబాలకు కుటుంబాలే విచ్ఛిన్నమై పోయాయి. ఈ యుద్ధం ములంగా ఇరవై లక్షల మంది వియత్నమీయులు మరణించారు. అనేక లక్షల మంది విస్థాపనకు గురయ్యారు. తత్ఫలితంగా అతి పెద్ద మానవ సంక్షోభం నెలకొన్నది. యుద్ధానంతరం దేశ పునర్నిర్మాణ ప్రక్రియ చాలా నెమ్మదిగా నడిచింది. యుద్ధం మూలంగా నెలకొన్న విధ్వంసం అంతటి తీవ్ర స్థాయిది కావడం ఒక కారణమైతే, పునర్నిర్మాణ ప్రక్రియకు అంతర్జాతీయ సహకారం ఆశించినంతగా అందకపోవడం మరో కారణం.

ప్రపంచవ్యాప్తంగా ఇప్పటి వరకూ జరిగిన యుద్ధాల్లో అత్యధికం అమెరికా స్వీయ ప్రయోజనాల కోసం, అమెరికా తోడ్పాటుతో జరిగినవే. వియత్నాం యుద్ధం నేర్పిన గుణపాఠాలను అమెరికా ఈ రోజుకీ పెద్ద ఎత్తున విస్మరిస్తున్నది.ఈ అమానవీయ యుద్ధానికి నైతికంగా బాధ్యత వహించకపోవడం అమెరికా ప్రధాన వైఫల్యం. విషతుల్యమైన పదార్థాల ప్రక్షాళన, ఆ రసాయనాల ఫలితంగా తలెత్తిన ఆరోగ్య సమస్యలను చక్కదిద్దడానికి అమెరికా పూర్తి బాధ్యత వహించకపోవడం క్షంతవ్యం కాని నేరం. అమెరికా పెద్ద ఎత్తున ఈ సమస్యల పరిష్కారానికి పూచీ పడడంతో పాటు ప్రపంచవ్యాప్తంగా ఎక్కడా యుద్ధాలను ప్రేరేపించడం గానీ, యుద్ధాలకు మద్దతుగా నిలబడడం కానీ చేయరాదు.

## భారత రాష్ట్ర సమితి కేంద్ర కార్యాలయం తెలంగాణ భవన్ లో వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ గారి ప్రెస్ కాన్ఫరెన్స్



**సత్యమేవ జయతే -హైదరాబాద్** భారత రాష్ట్ర సమితి కేంద్ర కార్యాలయం తెలంగాణ భవన్ లో వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ గారి ప్రెస్ కాన్ఫరెన్స్ రైతు భరోసాను ఎత్తగొట్టే కుట్రను రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్నాది అన్నారు. ప్రమాణ పత్రాల పేరుతో రైతుల పై కేసులు పెట్టే ప్రయత్నం చేస్తున్నదనిరైతులను భయాందోళనకు గురి చేసే కుట్రను చేస్తుందనిరైతన్నలను దొంగలుగా చిత్రీకరించి ప్రయత్నం మానుకోండని కేటీఆర్ హెచ్చరించారు.రాష్ట్ర ప్రజల సొమ్మును రైతన్నలు మాత్రమే తింటున్నారన్న దుష్ప్రచారం ఆపాలని కోరారు.ఇచ్చిన హామీలు అమలు చేసే సత్తా లేకుంటే రైతన్నలకు క్షమాపణ అడగండి అసలు ఈ ప్రభుత్వానికి రైతన్నల నుంచి ప్రమాణపత్రాలు అడగడానికి సిగ్గు ఉండాలని అని అన్నారు.ప్రమాణ పత్రం వేయాల్సిందే రైతన్నలు కాదు రైతన్నలకు హామీ ఇచ్చి మోసం చేసిన ప్రభుత్వమే కాంగ్రెస్ ప్రభుత్వం అని మండిపడ్డారు.రాష్ట్ర ప్రభుత్వానికి దమ్ముంటే రైతన్నలకు ఇచ్చిన రైతు భరోసా పైన గ్రామ గ్రామాన లబ్ధిదారుల జాబితా పెట్టాలన్నారు.కాంగ్రెస్ ప్రభుత్వం గ్రామాల్లో కౌలు రైతులకు రైతు కూలీలకు ఏ విధంగా రైతుబంధు ఇచ్చురో సెల్ఫ్ డిక్లరేషన్ ఇవ్వాలని కోరారు.రైతు భరోసా ఇవ్వకుండా రైతులను పక్కదారి పట్టిస్తూ మరొక్కసారి రైతు భరోసాకు దరఖాస్తు చేయాలి అంటూ డ్రామా మొదలుపెట్టిందని మండిపడ్డారు.అధికారంలోకి వచ్చిన తొలి రోజుల్లోనే కాంగ్రెస్ ప్రజాపాలన - అభయ హస్తం పేరుతోనే... ప్రజలందరి నుంచి దరఖాస్తులు తీసుకుంది.. 6 గ్యారంటీల కోసం అని చెప్పి ప్రజలను ముప్పు తిప్పలు పెట్టి కోటి ఆరు లక్షల మంది దగ్గర దరఖాస్తులు తీసుకుంది ప్రజలందరికీ సమాచారాన్ని సంపూర్ణంగా తీసుకుంది .ప్రతి దానికి దరఖాస్తుల పేరు చెప్పి కాంగ్రెస్ కాలయాపన చేస్తున్నదని అన్నారు.గతంలో రైతును శాసించేటట్టు మా ప్రభుత్వం తయారు చేస్తే... ఈ కాంగ్రెస్ ప్రభుత్వం యాచించే స్థితికి తీసుకువచ్చింది.మేము రైతును రాజుగా చేస్తే ఈ కాంగ్రెస్ ప్రభుత్వం వారిని బిచ్చగాళ్లుగా తయారుచేస్తుందని మండిపడ్డారు.ఒకప్పుడు సమయంలో ప్రమాణాలు పెట్టి ఓట్లు పెట్టి గుడుల దగ్గరికి పోయిన కాంగ్రెస్ నాయకులు.... ఈరోజు రైతన్నలతోని ప్రమాణ పత్రాలు అడుగుతున్నాదనిఅసలు ఈ ప్రభుత్వానికి రైతన్నల నుంచి ప్రమాణపత్రాలు అడగడానికి కొంచమైనా సిగ్గు ఉందా అని ప్రశ్నించారు.ప్రమాణ పత్రం వేయాల్సిందే రైతన్నలు కాదు రైతన్నలకు హామీ ఇచ్చి మోసం చేసిన ప్రభుత్వమే కాంగ్రెస్ ప్రభుత్వం అని అన్నారు.రాష్ట్ర ప్రభుత్వానికి దమ్ముంటే రైతన్నలకు ఇచ్చిన రైతు భరోసా పైన గ్రామ గ్రామాన లబ్ధిదారుల జాబితా పెట్టాలన్నారు.కాంగ్రెస్ ప్రభుత్వం గ్రామాల్లో కౌలు రైతులకు రైతు కూలీలకు ఏ విధంగా రైతుబంధు ఇస్తుందో సెల్ఫ్ డిక్లరేషన్ ఇవ్వాలి అని కోరారు.ఇప్పుటి దాకా రైతుల నుంచి కొన్న పంట కొనుగోలు వివరాలు, ఇచ్చిన బోనస్ వివరాలను వివరాల జాబితాలో గ్రామంలో పెట్టాలన్నారు.ప్రమాణ పత్రం వేయాల్సింది రైతన్నలు కాదు బే ఇమాన్ ప్రభుత్వం అని అన్నారు.

రైతుబంధు పథకాన్ని మా ప్రభుత్వం తీసుకువస్తే మీ కాంగ్రెస్ ప్రభుత్వం దాన్ని బొంద పెట్టడానికి కుట్ర చేస్తుందిఅందుకే రైతు బంధులో 22000 కోట్లు పక్కదారి మళ్లినాయని దుష్ప్రచారం చేస్తుంది మండిపడ్డారు.ఏ ఊర్లో ఎంత మేర రైతుబంధు దుర్వినియోగం అయిందో గ్రామ గ్రామాన జాబితా ప్రచురించాలని అని అన్నారు.పత్తి రైతుకి, కంది రైతుకి, చెరుకు, పసుపు, మరియు పోడు భూముల రైతన్నల కు ఇచ్చిన రైతుబంధును దుబారా అయిందని అడ్డగోలుగా ప్రభుత్వం అబద్ధాలు ఆడుతున్నదని అన్నారు. మరి ఈ రైతన్నలందరికీ ప్రమాణ పత్రాల పేరుతోనే రైతు భరోసా ఎగగోడతారా అని ప్రశ్నించారు. రైతు బంధుమైన దుష్ప్రచారం చేస్తూ రద్దు చేసే కుట్రలో భాగంగానే ఇవన్నీ కాంగ్రెస్ పార్టీ చేస్తుంది అనేది ప్రజలందరూ గమనించాలని కోరారు. ప్రతి ఒక్క రైతన్న ప్రభుత్వానికి ఎందుకు ప్రమాణ మాత్రం ఇవ్వాలి అని ప్రభుత్వాన్ని నిలదీయాలి కోరారు.ఇప్పటికే ప్రజాపాలనలో ఇచ్చిన దరఖాస్తుల విషయాన్ని గుర్తు చేయాలి అని అన్నారు.

గతంలో 12 సార్లు డబ్బులు ఇచ్చిన ప్రభుత్వం వద్ద అన్ని రకాల సమాచారం ఉన్నదన్న విషయాన్ని ప్రజలు ప్రభుత్వాన్నినికి చెప్పాలి అని కోరారు.దరఖాస్తుల పేరుతోనే ప్రభుత్వం చేస్తున్న రైతు భరోసాను ఎగగొట్టడం కోసమే రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే ఒక్కో రైతుకి ఒక్కొక్క ఎకరానికి 17500 వేల రూపాయల చొప్పున మొత్తం రాష్ట్ర రైతులకు 26 వేల కోట్ల రూపాయలకి పైగా బాకీ పడిందన్నారు. ప్రభుత్వానికి దమ్ముంటే రైతులకు ఇచ్చిన డబ్బులు విషయాన్ని ప్రమాణ పత్రాలను ఇవ్వాలి డిమాండ్ చేశారు.మేము ఒక రూపాయి లంచం లేకుండా కోటి 52 లక్షల మందికి రైతుబంధువేసినాము మరోసారి గుర్తు చేశారు.ప్రభుత్వానికి దమ్ముంటే జిల్లాల వారీగా దుబార ఐనా రైతుబంధు నిధులను బయటపెట్టాలని ఉన్నారు.దీంతోపాటు గ్రామ గ్రామాన.. గ్రామ పంచాయతీల వద్దనో రైతు వేదికల వద్దనో పెట్టాలి ఆ కోరారు.ఈ రైతుబంధు దుర్వినియోగం చేసిన ఆయన రైతుల పేర్లతో కూడా పెట్టండి ... అప్పుడు తెలుస్తది నిజంగానే కాంగ్రెస్ చెప్పింది అబద్ధమా నిజమా అని... ప్రశ్నించారు.కేవలం రైతులను ప్రజల ముందు పలుచన చేసే కుట్ర చేస్తుందన్నారు.రాష్ట్ర ప్రజల సొమ్మంతా రాష్ట్ర రైతాంగం తింటున్నట్టు దుష్ప్రచారం చేసిందన్నారు. రుణమాఫీ గురించి అడిగితే, రైతు భరోసా గురించి అడిగితే రైతులను బిచ్చగాళ్ళని రాష్ట్ర మంత్రులు అంటున్నారు అని అని అన్నారు. ఇది రాష్ట్ర ప్రభుత్వానికి రైతుల పట్ల ఉన్న ఆలోచన ధోరణి ఇది . ఇప్పటికైనా ఈ రాష్ట్ర ప్రభుత్వం మరొకసారి దరఖాస్తులు తీసుకోవడం మానాలి. ఊరుకి వచ్చే అధికారులను మేము గతంలో దరఖాస్తు చేసిన దరఖాస్తులు ఏమయ్యాయి అని అడగండని రైతులకు పిలుపునిస్తున్నాంఈ రాష్ట్ర ప్రభుత్వం నిలదీద్దాం...వరంగల్ రైతు డిక్లరేషన్ సంపూర్ణంగా అమలు చేయాలని ప్రభుత్వం పైన ఒత్తిడి చేద్దాం రాష్ట్రంలోని 22 లక్షల కౌలు రైతాంగానికి రేవంత్ రెడ్డి ఉత్తరం రాసిందు కాబట్టిరైతుబందును రైతు భరోసాను కుద్ధించే కుట్రను మా పార్టీ తరఫున తీవ్రంగా ఖండిస్తున్నామకాంగ్రెస్ ప్రభుత్వ కుట్రలను ప్రజలకు తెలియజేయాల్సిన బాధ్యత మన పైన ఉన్నదని గుర్తు చేశారు.రేపటి నుంచి పలు రకాల కార్యక్రమాల రూపంలో రాష్ట్ర రైతాంగాన్ని చైతన్యవంతం చేద్దాం .సంక్రాంతి లోగా రైతు భరోసాను అమలు చేసేలా రాష్ట్ర ప్రభుత్వం పైన ఒత్తిడి తీసుకువద్దాం అన్నారుతెలంగాణ రైతన్నను రాజుగా చేయాలన్న ఏకైక లక్ష్యంతో రైతుబంధు కార్యక్రమాన్ని కెసిఆర్ గారు ప్రారంభించారు .ఎన్నికల్లో చెప్పకున్నా... ప్రజలకు హామీ ఇవ్వకున్నా రైతన్న కోసం ఈ కార్యక్రమాన్ని ప్రారంభించి అమలు చేసాము.రైతుకి పెట్టుబడి సాయం ఇచ్చిన ఏకైక నాయకుడు దేశ చరిత్రలో కేసీఆర్ గారు ఒక్కరే.ప్రభుత్వ కార్యాలయాలకు వెళ్లకుండా ఎలాంటి దరఖాస్తులు చేయకుండా రైతన్నకు రైతుబంధు అందించాం 11 సీజన్లలో 73 వేల కోట్ల రూపాయలు రైతుల ఖాతల్లోకి వేసాము 12వ సీజన్లు రైతులకు ఇవ్వాల్సిన డబ్బులను ఎన్నికల కమిషన్ కి ఉత్తరం రాసి ఆపింది ఈ కాంగ్రెస్ ప్రభుత్వమే అని మండిపడ్డారు.సంవత్సరం దాటిపోయిన ఈరోజు వరకి ఒక్క రూపాయి కూడా రైతు భరోసా రూపంలో రైతన్నలకు ఇయ్యలేదు. ఆరోజు మేము దాచిపెట్టిన 7500 కోట్లు మాత్రమే రైతు భరోసా పేరుతో ఇచ్చారు ఎన్నికలకు ముందు వరంగల్లో రాహుల్ గాంధీని తెచ్చి రైతన్నలను ఉద్ధరిస్తామని పూజలు కొట్టింది. రైతు డిక్లరేషన్ లో భాగంగా ఎకరంకి పదిహేను వేలు, కౌలు రైతులకు, రైతు కూలీలకు ఆర్థిక భరోసా ఇస్తామని ప్రకటించిందిన్నారు.వ్యవసాయ రంగానికి అనేక హామీలు ఇచ్చారు. అవి ఏమయ్యా అని ప్రశ్నించారు. ఎన్ని రకాల హామీ ఇచ్చిన ప్రభుత్వం... ఇప్పుడు రైతులతోనే ప్రమాణ పత్రాలు తీసుకుంటుందాన్నారు.

సత్యమేవ జయతే



# వేలకు వేలు పోసి బంగారం కొనలేనివారికోసం ఈ గోల్డ్



దిగువ-మధ్య తరగతి కుటుంబాలకు-బంగారానికి మధ్య దూరం అంతకంతకూ పెరుగుతూనే ఉంది. అందుకే.. బంగారం కొందరికి మాత్రమే దక్కే ఒక అరుదైన అదృష్టంగా మారింది. ఆభరణాలు తరచూ మార్చే అలవాటున్నవాళ్లనైతే బంగారం ధరలు మరీ వేధిస్తున్నాయి. కొండెక్కిన బంగారాన్ని లక్షలు పెట్టి దింపే అవకాశం లేనివాళ్లకు ప్రత్యామ్నాయం ఏదైనా ఉందా? అంటే ఎందుకు లేదు ఖచ్చితంగా ఉంది. మెరిసేదంతా బంగారం కాదన్న సామెతను కాసేపు మర్చిపోతే.. బంగారం లాంటి అవకాశం ఇక్కడొకటి రెడీగా ఉంది. దాని పేరే.. ల్యాబ్ మేడ్ గోల్డ్. మండే ధరలతో సెగలు కక్కుతున్న నగలకు ఇదే బెస్ట్ అల్టర్నేటివ్ ప్లేస్.పదిగ్రాముల బంగారం ధర రమారమి లక్ష రూపాయలు. కిలో వెండి ధర లక్షకు అటూఇటూనే. ఒకటోరెండో పెద్దనోట్ల కట్టలు పట్టుకెళితే తప్ప జ్యూవెలరీ షాపులో అడుగుపెట్టే పరిస్థితే లేదు. ఏదైనా శుభకార్యానికి ముహూర్తం పెట్టుకుంటే.. ఇక అంతే సంగతులు. బంగారం కొనుగోళ్లతో ఇల్లు గుల్లవ్వాల్సిందే. ఇది మిడిల్ క్లాస్, ఎబౌ మిడిల్‌క్లాస్ వాళ్ల వ్యథాభరిత చిత్రం. లోయర్ మిడిల్ క్లాస్ కుటుంబాల గాథలు ఇంకో రకం. గ్రామో అరగ్రామో బంగారం కొనుక్కోవడమంటే వాళ్లకది లైఫ్‌టైమ్ అచీవ్‌మెంటే. అందుకే.. సగటు గరీబోడి గోల్డెన్ డ్రీమ్స్ సాకారం చెయ్యడానికా అన్నట్టు కొత్తగా పుట్టుకొచ్చింది వన్‌గ్రామ్ గోల్డ్ అనే ట్రెమ్లీ ట్రెండ్. పాతికవేలు పెడితే.. ఉంగరం కాదు.. ఏకంగా వడ్డాణాలే కొనెయ్యొచ్చు.వేలకు వేలు పోసి బంగారం కొనలేనివారికి ఇప్పుడు ల్యాబ్ మేడ్ గోల్డ్.. అందుబాటులోకి వచ్చింది. గనుల నుంచి తీసి.. ప్రాసెసింగ్ చేస్తే వచ్చిన బంగారం ఒరిజినల్ బంగారం. దానికి ప్రత్యామ్నాయంగా.. బంగారానికి ఏమాత్రం తగ్గని మెరుపుతో కృత్రిమంగా తయారయ్యేదే ల్యాబ్ మేడ్ గోల్డ్. పెళ్లిళ్లకు ఫంక్షన్లకు వెళ్లాలనుకునే మధ్యతరగతి కుటుంబాలు ల్యాబ్ మేడ్ గోల్డ్‌నే ఆశ్రయిస్తున్నారు. సంప్రదాయం ప్రకారం ప్రతి పెళ్లిలో ఎంతోకొంత బంగారాన్ని పెట్టాలి. మిగతాది మాత్రం ల్యాబ్ మేడ్ బంగారమే. వన్‌గ్రామ్ గోల్డ్ అనే సౌండ్ చెప్పుకోడానికి ఇబ్బందిగా ఉంది గనుక.. దాన్ని పాలిష్డ్‌గా ల్యాబ్ మేడ్ గోల్డ్ అని పిల్చుకోవడం మొదలైంది. 24 క్యారెట్ బంగారంలో ఎంతోకొంత రాగిని కలిపి కరిగిస్తే తప్ప ఆభరణం తయారు కాదు. అలాగే.. ల్యాబ్‌మేడ్ గోల్డ్‌లో 99 శాతం రాగి, సిల్వర్, అల్యూమినియమ్.. ఒకటీఅరా శాతం బంగారం కలిపి వన్‌గ్రామ్ గోల్డ్ తయారు చేస్తారు. ల్యాబుల్లో బంగారు ఆభరణాలే కాదు.. వజ్రాభరణాలు కూడా తయారౌతున్నాయి. అమెరికన్ డైమండ్స్ పేరుతో అమ్ముడయ్యే ఈ వజ్రాల్ని శ్రీమంతులు సైతం వేలంవెర్రిగా కొనుగోలు చేస్తున్నారు. ప్రస్తుతానికి ల్యాబ్ మేడ్ బంగారం తయారీ ఎక్కువగా పశ్చిమ బెంగాల్‌లో జరుగుతుంది. ల్యాబ్ మేడ్ గోల్డ్ తయారీ కేంద్రాలు హైదరాబాద్‌లో కూడా రావడం మొదలైంది. ధరలు ఇంకా దిగొస్తే.. అతి త్వరలో కృత్రిమ బంగారం వినియోగం దేశమంతా విస్తరించే అవకాశముంది. ఈవిధంగా మిడిల్‌క్లాస్ వారి గోల్డెన్ మెలోడీస్ గడిచిపోతున్నాయి. ఫ్యాషన్‌కి ఫ్యాషన్.. సెక్యూరిటీకి సెక్యూరిటీ.ఎంతైనా బంగారం బంగారమే.

## వ్యాపారం

# జర్వ్ బ్యాంక్ రూ.5000 నోట్లను తీసుకువస్తోందా? ఆర్బీఐ ఏం చెప్పింది?




దేశంలో రిజర్వ్ బ్యాంక్ ఇప్పటికే 2000 రూపాయల నోట్లను రద్దు చేసింది. ప్రజల్లో ఉన్న ఈ నోట్లను వెనక్కి తీసుకుంటోంది. ఇప్పటికే 98 శాతం వరకు రద్దయిన ఈ రూ.2 వేల నోట్లు బ్యాంకులకు చేరగా, ఇప్పుడు మరో వార్త వెలుగులోకి వస్తోంది. దేశంలో5000 రూపాయల నోట్లు ప్రవేశపెడుతున్నట్లు వార్తలు వస్తున్నాయి. %కేంద్ర ప్రభుత్వం మళ్లీ గత బాటలోనే నడవబోతోందా? రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) నుండి 5000 రూపాయల నోటు వస్తోంది? తాజాగా సోషల్ మీడియాలో బలమైన ఊహాగానాలు మొదలయ్యాయి. ఇలాంటి వార్తలపై సెంట్రల్ బ్యాంక్ (ఆర్‌బీఐ) స్వయంగా వెల్లడించింది. భారతదేశంలో 2000 రూపాయల నోటును నిలిపివేసినప్పటి నుండి, ఈ రకమైన ఊహాగానాలు మళ్లీ మొదలయ్యాయి. ప్రస్తుతం భారతదేశంలో అత్యధిక కరెన్సీ విలువ 500 రూపాయలు. అందుకే ఇండియాలో కొత్త 5000 రూపాయల నోట్లు లాంచ్ అవుతున్నాయని సోషల్ మీడియాలో వార్తలు చక్కర్లు కొడుతున్నాయి. దేశ ద్రవ్య విధానాన్ని నిర్ణయించే రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా స్పష్టం చేసింది. భారతదేశంలో ఇంతకు ముందు 5000, 10000 రూపాయల నోట్లు ఉండేవి.సోషల్ మీడియాలో 5000 రూపాయల నోట్లపై చర్చలు జరుగుతున్న నేపథ్యంలో %=దీ×% తన విధానాన్ని స్పష్టం చేసింది. అయితే అధిక విలువ కలిగిన నోట్లు భారత్‌కు కొత్త కాదు. 1947లో స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి 5000, 10000 రూపాయల నోట్లు చలామణిలో ఉన్నాయి. 1954లో 5000 రూపాయల నోటును భారత కరెన్సీలో చేర్చారు. 1978లో ప్రధాని మొరార్జీ దేశాయ్ నేతృత్వంలోని ప్రభుత్వం మొత్తం 1000, 5000, 10000 రూపాయల నోట్లను రద్దు చేయాలని నిర్ణయించింది. కొత్తగా ఆకుపచ్చరంగులో ఉండే రూ. 5000 నోటు గురించి ఆర్బీఐ ఇప్పటికే స్పష్టం చేసింది. ట్రెండింగ్‌లో ఉన్న సోషల్ మీడియా వెబ్‌సైట్లలో ప్రసారం అవుతున్న వార్తలు అవాస్తవమని స్పష్టం చేసింది. ఈ పుకార్లలో వాస్తవం లేదని రిజర్వ్ బ్యాంక్ స్పష్టం చేసింది. 2000 నోట్లను మాత్రమే వెనక్కి తీసుకోవాలని ఆర్బీఐ నిర్ణయించింది. 5000 రూపాయల నోట్లపై తప్పుడు వార్తలు ప్రచారం అవుతున్నాయని సెంట్రల్ బ్యాంక్ తెలిపింది.ప్రస్తుతం భారతదేశంలో 500, 200, 100, 50, 20,10 రూపాయల నోట్లు చలామణిలో ఉన్నాయి . ప్రస్తుతం మోడీ ప్రభుత్వం భారతదేశంలో డిజిటల్ చెల్లింపుల ప్రాధాన్యతను పెంచింది. డిజిటల్ చెల్లింపుల విధానంలో లావాదేవీలు జరిపేందుకు కేంద్ర ప్రభుత్వం పౌరులను ప్రోత్సహిస్తోంది. యూపీఐ సైబర్‌స్పేస్ బ్యాంకింగ్, డిజిటల్ వాలెట్లు ఇప్పుడు నోట్లను భర్తీ చేస్తున్నాయి. కరెన్సీ వార్తలపై ప్రభుత్వ వనరులను మాత్రమే విశ్వసించాలని సెంట్రల్ బ్యాంక్ తెలిపింది.

## క్రీడలు

# క్యాచ్ పట్టుకునే ప్రయత్నంలో ఢీకొన్న క్రికెటర్లు.. ఆస్పత్రికి తరలింపు..



బంగ్లాదేశ్ ప్రీమియర్ లీగ్‌లో ఇద్దరు ఆటగాళ్లు పరస్పరం ఢీకొన్నారు. దీంతో ఓ ఆటగాడు ముఖంపై తీవ్ర గాయాలయ్యాయి. ఫిజియో వెంటనే మైదానం లోకి వచ్చి చికిత్స నిమిత్తం అతనిని స్ట్రెచర్‌పై బయటకు తీసుకెళ్లారు. ఇక బిగ్ బాష్ లీగ్ లోనూ ఇలాంటి భయానక సంఘటనే చోటుచేసుకుంది.బంగ్లాదేశ్ ప్రీమియర్ లీగ్ 2025లో భయానక సంఘటన చోటు చేసుకుంది. శుక్రవారం (జనవరి 3)న టోర్నమెంట్‌లోని ఏడవ మ్యాచ్ దర్బార్ రాజ్‌షాహి, చిట్టగాంగ్ కింగ్స్ జంట్ల మధ్య జరిగింది. ఈ మ్యాచ్ తొలి ఇన్నింగ్స్‌లో దర్బార్ రాజ్‌షాహీ జట్టు షబ్బీర్ హొస్సేన్, షఫీవుల్ ఇస్లామ్ క్యాచ్ తీసుకుంటుండగా పరస్పరం ఢీకొన్నారు. దీంతో షబ్బీర్ తీవ్రంగా గాయపడ్డాడు. కాసేపు కదల్లేకపోయాడు. ఫిజియో వెంటనే రంగంలోకి దిగి పరిస్థితి పరిశీలించారు. గాయం తీవ్రత చూసి వెంటనే స్ట్రెచర్‌పై బయటకు తీసుకెళ్లారు. చిట్టగాంగ్ కింగ్స్ బ్యాటింగ్‌లో 14వ ఓవర్‌లో షబ్బీర్, షఫీల్ మధ్య ఈ అనుకోని సంఘటన జరిగింది. సోహగ్ ఘాజీ వేసిన బంతిని ఉస్మాన్ ఖాన్ స్వీప్ షాట్ ఆడాడు. అతని బ్యాట్ అంచుకు తగిన బంతి స్క్వేర్ లెగ్ దిశలో గాలిలోకి వెళ్లింది. షార్ట్ ఫైన్ లెగ్ వద్ద షఫీల్, బ్యాక్‌వర్డ్ స్క్వేర్ లెగ్ వద్ద షబ్బీర్ ఇద్దరూ క్యాచ్ కోసం పరుగులు తీశారు. ఒకరినొకరు చూసుకోకుండా క్యాచ్ పట్టుకునేందుకు ప్రయత్నించి ఢీకొన్నారు. దీంతో షబ్బీర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. అయినప్పటికీ, అతను రెండో ఇన్నింగ్స్‌లో బ్యాటింగ్‌కు వచ్చాడు. కానీ 5 బంతుల్లో 8 పరుగులు మాత్రమే చేయగలిగాడు.

కాగా దర్బార్ రాజ్‌షాహీకి చెందిన ఇద్దరు ఆటగాళ్లు ఢీకొనడంతో ఉస్మాన్ ఖాన్ ఔట్ కాకుండా తప్పించుకున్నాడు దీని తర్వాత అతను కేవలం 48 బంతుల్లో తుఫాను సెంచరీని పూర్తి చేశాడు. చిట్టగాంగ్ కింగ్స్‌కు ఓపెనింగ్ చేసిన ఉస్మాన్ 198 స్ట్రైక్ రేట్‌తో 62 బంతుల్లో 123 పరుగులు చేసి అద్భుతమైన ఇన్నింగ్స్ ఆడాడు. ఈ సమయంలో అతను 13 ఫోర్లు, 6 సిక్సర్ బాదాడు. అతని ఇన్నింగ్స్ ఆధారంగా, చిట్టగాంగ్ జట్టు 20 ఓవర్లలో 220 పరుగుల భారీ లక్ష్యాన్ని నిర్దేశించింది.ఈ భారీ లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో దర్బార్ రాజ్‌షాహీ జట్టు మొత్తం 114 పరుగులకే కుప్పకూలింది. దీంతో ఈ మ్యాచ్‌లో చిట్టగాంగ్ 105 పరుగుల తేడాతో విజయం సాధించింది. ఈ విజయంతో 2 మ్యాచ్‌ల్లో 2 పాయింట్లతో పాయింట్ల పట్టికలో మూడో స్థానానికి ఎగబాకింది. మరోవైపు దర్బార్ రాజ్‌షాహీ జట్టు 3 మ్యాచ్‌ల్లో 2 పాయింట్లతో ఐదో స్థానంలో ఉంది.కాగా ఇలాంటి సంఘటనే ఆస్ట్రేలియా వేదికగా జరుగుతున్న బిగ్‌బాష్ లీగ్‌లోనూ చోటు చేసుకుంది. క్యాచ్‌ను అందుకునే ప్రయత్నంలో డేనియల్ సామ్స్, కామెరాన్ బాన్‌క్రాఫ్ట్‌లు పరస్పరం ఢీకొన్నారు.

# ఆ ప్లేయర్లు మళ్లీ వస్తున్నారు.. ఛాంపియన్స్ ట్రోఫీకి టీమిండియా జట్టు ఇదే!




బోర్డర్ గవాస్కర్ టెస్టు సిరీస్‌లో భాగంగా భారత్-ఆస్ట్రేలియా జట్ల మధ్య చివరి మ్యాచ్ జరుగుతోంది. అయితే ఇప్పుడు అందరి దృష్టి ఛాంపియన్స్ ట్రోఫీపై పడింది. మినీ వరల్డ్ కప్ గా భావించే ఈ ప్రతిష్ఠాత్మక టోర్నీలో ఆడనున్న భారతీయ ఆటగాళ్లపై ప్లేస్‌పై సర్వత్రా చర్చ జరుగుతోంది. %ప్రతిష్ఠాత్మక ఛాంపియన్స్ ట్రోఫీ కి సమయం ముంచుకొస్తోంది. ఈ టోర్నమెంట్ లో భారత్ తన అన్ని మ్యాచ్‌లను దుబాయ్‌లో ఆడనుంది. ఫిబ్రవరి 19 నుంచి ఈ పోటీలు ప్రారంభం కానుండగా, మొత్తం ఎనిమిది జట్లు కప్ కోసం పోటీపడుతున్నాయి. భారత్ గ్రూప్‌లో న్యూజిలాండ్, పాకిస్థాన్, బంగ్లాదేశ్ జట్లు ఉన్నాయి. ఫిబ్రవరి 20న బంగ్లాదేశ్‌తో భారత్ తొలి మ్యాచ్ ఆడనుంది. దీని తర్వాత ఫిబ్రవరి 23న హైవోల్టేజ్ ఇండియా పాకిస్థాన్ మ్యాచ్, ఆ తర్వాత మార్చి 2న న్యూజిలాండ్‌తో చివరి లీగ్ మ్యాచ్ జరగనుంది. అయితే ఈ టోర్నీలో భారత జట్టులో ఎవరెవరు ఉంటారన్న దానిపై పుకార్లు షికార్లు చేస్తున్నాయి. కెప్టెన్ రోహిత్ శర్మనే అనడంలో ఎలాంటి సందేహం లేదు. ఎందుకంటే టీ20 ప్రపంచకప్ తర్వాత రోహిత్ శర్మ కెప్టెన్సీ ఖరారైంది. ఛాంపియన్స్ ట్రోఫీ, ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిప్ ఫైనల్స్‌ను అతని నేతృత్వంలోనే ఆడనున్నట్లు ప్రకటించారు. కానీ టెస్టుల్లో వెనకబడిన భారత్ ఇప్పుడు క్వాలిఫై అవుతుందా లేదా అన్నది సందిగ్ధంలో పడింది. ఇదిలా ఉంటే ఛాంపియన్స్ ట్రోఫీకి జట్టును ఎలా ఎంపిక చేస్తారనే దానిపై ఆరా తీస్తున్నారు.రోహిత్ శర్మ తో పాటు విరాట్ కోహ్లి, రిషబ్ పంత్, రవీంద్ర జడేజా, హార్దిక్ పాండ్యా, జస్ప్రీత్ బుమ్రా జట్టులో ఉండటం దాదాపు ఖాయం. అయితే ఈ టోర్నీ కోసం ఒకరి పేరు బాగా వినిపిస్తోంది సాగుతోంది. అతనే శ్రేయాస్ అయ్యర్.. గత కొన్ని రోజులుగా ఈ ఆటగాడు టీమిండియాలో లేడు. భారత జట్టులో రీ ఎంట్రీ ఇచ్చేందుకు శ్రేయస్ దేశవాళీ క్రికెట్ ఆడుతున్నాడు. వచ్చిన అవకాశాలన్నింటినీ సద్వినియోగం చేసుకుంటూ భారీగా పరుగులు సాధిస్తున్నాడు. ఇప్పుడు విజయ్ హజారే ట్రోఫీలోనూ సెంచరీ తో మెరిశాడు. కాగ ఛాంపియన్స్ ట్రోఫీకి ముందు టీమిండియా ఇంగ్లండ్‌తో టీ20, వన్డే సిరీస్‌లు ఆడనుంది. ఒకవేళ ఈ సిరీస్‌లో శ్రేయస్ ఎంపికైతే ఛాంపియన్స్ ట్రోఫీ కూడా ఆడుతాడనడంలో ఎలాంటి సందేహం లేదు.విజయ్ హజారే ట్రోఫీలో పుదుచ్చేరిపై శ్రేయాస్ అయ్యర్ 133 బంతుల్లో 137 పరుగులు చేసి నాటౌట్ గా నిలిచాడు. ఇందులో 16 ఫోర్లు, 4 సిక్సర్లు ఉన్నాయి. స్పోర్ట్‌స్టాక్ నివేదిక ప్రకారం, %×జజ% ఛాంపియన్స్ ట్రోఫీ 2025 కోసం జట్టును ప్రకటించడానికి చివరి తేదీ జనవరి 12. అయితే బీసీసీఐ సెలక్షన్ కమిటీ ఒకరోజు ముందుగా అంటే జనవరి 11న భారత జట్టును ప్రకటించే అవకాశం ఉంది. ఎనిమిదేళ్ల విరామం తర్వాత ఐసీసీ ఛాంపియన్స్ ట్రోఫీ జరుగుతోంది. గత 2017 ఎడిషన్‌లో ఫైనల్‌లో భారత్‌పై పాకిస్తాన్ విజయం సాధించింది.

# ట్రంప్-పుతిన్ కలుసుకోబోతున్నారా? ఎక్కడో తెలుసా..



రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ ఉక్రెయిన్ అంశంపై అమెరికా అధ్యక్షుడిగా ఎన్నికైన డొనాల్డ్ ట్రంప్‌తో చర్చలు జరపడానికి సిద్ధంగా ఉన్నారని, ఇది మాస్కో - వాషింగ్టన్ మధ్య సత్సంబంధాలు కొనసాగేందుకు మార్పును సూచిస్తుంది. ఈ పరిస్థితుల్లో చర్చలు జరిపేందుకు రెండు దేశాలకు ఆమోదయోగ్యమైన దేశంగా భారత్ కనిపిస్తోంది. ఈ భేటీ జరిగితే రష్యా-ఉక్రెయిన్ యుద్ధానికి ముగింపు పలికే అవకాశముందని భావిస్తున్నారు.పరస్పరం కత్తులు దూసుకునే అగ్రరాజ్యాలు అమెరికా-రష్యా దేశాధినేతలు కలుసుకోబోతున్నారా? అందుకు శాంతి వేదికగా భారత్ మారనుందా? ఇప్పుడిదే చర్చ జోరుగా సాగుతోంది. అమెరికా అధ్యక్షుడుగా డొనాల్డ్ ట్రంప్ బాధ్యతలు చేపట్టిన తర్వాత రష్యా అధినేత వ్లాదిమిర్ పుతిన్‌తో చారిత్రక భేటీ జరిపే అవకాశం ఉందని రష్యాలో జోరుగా చర్చ జరుగుతోంది. దాదాపు మూడో ప్రపంచయుద్ధాన్ని తలపించేలా సాగుతున్న రష్యా %-% ఉక్రెయిన్ యుద్ధంలో ఇంతకాలం అమెరికా ఉక్రెయిన్ వెనుక నిలిచి ఎగదోస్తూ వచ్చింది. తమ శత్రుదేశం రష్యాను దెబ్బతీసేందుకు ఉక్రెయిన్‌కు అవసరమైన ఆయుధ సామిగ్రిని అందిస్తూ వచ్చింది. అయితే ఈ యుద్ధం కేవలం ఆ రెండు దేశాలపైనే కాకుండా, మిగతా ప్రపంచంపై కూడా పడింది.

ప్రపంచ గోధుమ పాత్ర (వీట్ బౌల్)గా పేరొందిన ఉక్రెయిన్ నుంచి గోధుమ ఉత్పత్తి తగ్గిపోయి కొన్ని దేశాల్లో ఆహార సంక్షోభం తలెత్తింది. అత్యధిక స్థాయిలో చమురు ఉత్పత్తి చేసే రష్యాపై ఆంక్షల కారణంగా పెట్రోలియం ఉత్పత్తుల ధరలు పెరిగిపోయి పరోక్షంగా అన్ని దేశాల్లో వస్తువుల ధరలు పెరిగిపోయాయి. ఈ పరిస్థితుల్లో అమెరికా కొత్త అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టనున్న డోనాల్డ్ ట్రంప్.. తాను బాధ్యతలు చేపట్టిన తర్వాత ఉక్రెయిన్ %-% రష్యా దేశాల మధ్య యుద్ధానికి ముగింపు పలుకుతానని ప్రకటించారు. ఈ క్రమంలో ఆయన రష్యా అధినేత వ్లాదిమిర్ పుతిన్‌తో చర్చలు జరపాలని భావిస్తున్నారు. రష్యా అధ్యక్షుడు పుతిన్ కూడా ఈ సమావేశంపై సానుకూతల వ్యక్తం చేశారు. అయితే ఈ ఇద్దరూ ఎక్కడ భేటీకానున్నారన్న ప్రశ్న తలెత్తుతోంది. ఈ క్రమంలో రెండు దేశాలకు మిత్రదేశంగా ఉన్న భారతదేశమే అత్యంత అనుకూలమైన వేదిక అని చర్చ జరుగుతోంది.అగ్రరాజ్యాధినేతల సమావేశానికి అనుకూలమైన వేదికను ఎంపిక చేసే పనిలో రష్యా నిమగ్నమైంది. ఈ సమావేశాన్ని నిర్వహించగల దేశాల జాబితాను ఆ దేశం సిద్ధం చేస్తోంది. ఇంతలో, భారతదేశం పేరు అత్యంత అనుకూలమైన దేశంగా చర్చ జరుగుతోంది. రష్యా అధికారవర్గాలతో సంబంధం ఉన్న చాలా మంది ఈ సమావేశం భారత గడ్డపై విజయవంతమవుతుందని నమ్ముతున్నారు. రష్యా-ఉక్రెయిన్ యుద్ధ సమయంలో అమెరికా, దాని మిత్రపక్షాల ఒత్తిడికి తలొగ్గకుండా భారత్ నిష్పాక్షికమైన, స్వతంత్ర వైఖరిని అవలంబించింది. భారత వైఖరిని అంతర్జాతీయంగా ప్రశంసలు అందుకుంది. అలాగే రష్యా అధ్యక్షుడు పుతిన్ 2025లో భారత్‌లో పర్యటించాలని నిర్ణయించుకున్నారు. మరోవైపు డొనాల్డ్ ట్రంప్ కూడా తాను గతంలో అధ్యక్షుడిగా ఉన్నప్పుడు భారత్‌లో పర్యటించారు. ప్రపంచదేశాల్లో భారతదేశం స్థానం, దౌత్యపరమైన పాత్ర శాంతి కోసం ఆశలు రేకెత్తించే ఒక ఆదర్శ వేదికగా మారింది. అయితే అధికారికంగా ఇంకా క్రెమ్లిన్ (రష్యా అధికార) వర్గాలు ఈ అంశాన్ని ధృవీకరించాల్సి ఉంది. రష్యాలో ఉన్న టీవీ9 ప్రతినిధి మనీష్ ఝా క్రెమ్లిన్ వర్గాలను సంప్రదించారు. సమాధానం ఇంకా రావాల్సి ఉంది.గత ఏడాది డిసెంబరు 23న స్లోవేకియా ప్రధాని రాబర్ట్ ఫికో రష్యాను సందర్శించారు. ఆ సమయంలో రష్యా అధ్యక్షుడు పుతిన్‌ను తమ దేశంలో పర్యటించాల్సిందిగా ఆహ్వానించారు. స్లోవేకియా అటు అమెరికా, ఇటు రష్యాతో స్నేహంగా ఉంటోంది. ఇరువురికీ ఆమోదయోగ్యమైన దేశాల జాబితాలో ఈ దేశం పేరు కూడా వినిపిస్తోంది.ఉక్రెయిన్‌తో యుద్ధం మొదలయ్యాక.. రష్యా అధ్యక్షుడు పుతిన్ తమతో స్నేహంగా ఉండే దేశాలను మాత్రమే సందర్శించారు. వీటిలో చైనా, మంగోలియా, వియత్నాం, బెలారస్, కజకిస్తాన్, ఉత్తర కొరియా ఉన్నాయి. ఐసీసీ అరెస్ట్ వారెంట్ జారీ చేయడంతో పుతిన్ తన దక్షిణాఫ్రికా పర్యటనను కూడా రద్దు చేసుకున్నాడు. అయితే రష్యాకు మిత్రులుగా ఉన్న దేశాల్లో చైనా, ఉత్తర కొరియా వంటి దేశాలతో అమెరికాకు విభేదాలు తప్ప సత్సంబంధాలు లేవు. గతంలో అంతర్జాతీయ వేదికలపై అగ్రరాజ్యాధినేతలు కలుసుకున్నారు. ఇందుకు యూరప్ దేశాలు వేదికగా మారాయి. 2021లో, అమెరికా అధ్యక్షుడు జో బిడెన్, రష్యా అధినేత పుతిన్ స్విట్జర్లాండ్‌లోని జెనీవాలో కలుసుకున్నారు. అయితే ప్రస్తుత పరిస్థితుల్లో డొనాల్డ్ ట్రంప్ యూరప్‌లోని కొన్ని దేశాలకు వెళ్లడం మానుకుంటున్నారు. ఈ పరిస్థితుల్లో రెండు దేశాలకు ఆమోదయోగ్యమైన దేశంగా భారత్ సహా మరికొన్ని దేశాలు మాత్రమే కనిపిస్తున్నాయి. ఈ భేటీ భారత్‌లో జరిగితే రష్యా-ఉక్రెయిన్ యుద్ధానికి ముగింపు పలకడమే కాకుండా భారతదేశ దౌత్యపరమైన విశ్వసనీయత కొత్త శిఖరాలకు చేరుకుంటుంది.

# అక్కడ మనుషుల కంటే మొసళ్లే ఎక్కువ ఉన్నాయా?



డార్విన్ హార్బర్‌లో చీకటి పడుతోంది. ప్రభుత్వ రేంజర్ కెల్లీ మొసళ్లను బంధించేందుకు ఏర్పాట్లు చేసుకుంటున్నారు.ఇటీవలే భారీ వరదలు వచ్చాయి. మేం ప్రయాణిస్తున్న పడవ ఇంజన్ ఆపేయడంతో అది శబ్దం చేయకుండా వెళ్తోంది.మేం ఆస్ట్రేలియాలోని నార్తర్న్ టెరిటరీలో ఉన్నాం.ఇక్కడ లక్షకు పైగా ఉప్పునీటి మొసళ్లు ఉన్నాయని అంచనా. ప్రపంచంలో మరెక్కడా ఒకే ప్రాంతంలో ఇన్ని మొసళ్లు లేవు.నార్తర్న్ టెరిటరీ రాజధాని డార్విన్. చుట్టూ బీచ్‌లు, పొడి నేలలు ఉన్న చిన్న తీరప్రాంత నగరం ఇది.'ఏలియన్' తిలాపియా చేపలైౌ థాయ్‌లాండ్ యుద్ధం చేస్తోంది, ఈ చేపలు ఎంత ప్రమాదకరమంటే.. ు నార్తర్న్ టెరిటరీకి వస్తే అక్కడ నీరు ఉన్న ప్రతిచోటా మొసళ్లు ఉంటాయని వెంటనే తెలుసుకుంటారు.సాల్టీస్ అని స్థానికులు పిలుచుకునే ఈ ఉప్పునీటి మొసళ్లు 50 ఏళ్ల కిందట వేట కారణంగా అంతరించే దశకు చేరుకున్నాయి.రెండో ప్రపంచ యుద్ధం తర్వాత మొసళ్ల చర్మంతో వ్యాపారం వల్ల వేట తీవ్రమై వాటి సంఖ్య 3వేలకు పడిపోయింది.అయితే 1971లో వేట నిలిపివేసిన తర్వాత వాటి సంఖ్య వేగంగా పెరగడం మొదలైంది.

అవి ఇప్పుడు రక్షిత జంతువుల జాబితాలో ఉన్నాయి, వాటికి ఎలాంటి ప్రమాదం లేదుసాల్ట్ వాటర్ మొసళ్ల సంఖ్య ఇప్పుడు భారీగా పెరిగిపోయింది. దీంతో ప్రజల భద్రత దృష్ట్యా వాటి సంఖ్యను తగ్గించాల్సి వస్తోంది."ప్రజల కంటే మొసళ్ల సంఖ్య ఎక్కువగా పెరుగుతున్నప్పుడు ఇలాంటి పరిస్థితులే వస్తాయి" అని మొసళ్ల నిపుణుడు ప్రొఫెసర్ గ్రాహమ్ వెబ్ చెప్పారు."అలాంటప్పుడు రాజకీయ నాయకులు రంగంలోకి దిగి మొసళ్ల సమస్యను పరిష్కరిస్తామని చెబుతారు" అని ఆయన అన్నారు.నార్తర్న్ టెరిటరీలో వేడిగా ఉండే ఉష్ణోగ్రతలు మొసళ్ల ఆవాసానికి చక్కగా సరిపోతాయి.ఆగ్నేయాసియాలోని కొన్ని ప్రాంతాలు పశ్చిమ ఆస్ట్రేలియాలోని నార్తర్న్ క్వీన్స్‌లాండ్‌లో ఉప్పునీటిలో ఉండే మొసళ్ల సంఖ్య ఎక్కువగా ఉంది.

మొసళ్లలో కొన్ని జాతులు అంతగా హానికరం కావు, అయితే ఉప్పు నీటిలో ఉండే మొసళ్లు మాత్రం చాలా దూకుడుగా ఉంటాయి.

్ట్రేలియాలో మొసళ్ల కారణంగా ప్రాణాంతక ఘటనలు జరగడం అరుదు. కానీ, జరిగిన సందర్భాలున్నాయి.నిరుడు 12 ఏళ్ల బాలికను మొసళ్లు పట్టుకున్నాయి. నార్తర్న్ టెరిటరీలో 2018 తర్వాత అది తొలి మరణం.జపాన్: మనుషులకన్నా వేగంగా పెరుగుతున్న ఎలుగుబంట్ల సంఖ్య, కాల్చివేత చట్టాల సవరణకు ఇవిన్ అతని సహచరులకు ఇది పని ఒత్తిడి ఎక్కువగా ఉండే సమయం.మొసళ్లు గుడ్లు పెట్టే సీజన్ మొదలైంది. ఈ సీజన్‌లో అవి ఒక చోట నుంచి మరొక చోటకు మారుతుంటాయి.వారంలో అనేక సార్లు ఇవిన్ అతని బృందం నీటిలో ఉంటారు. డార్విన్ చుట్టు పక్కల 24 'క్రొకడైల్ ట్రాప్'లను నిరంతరం పర్యవేక్షిస్తుంటారు.

ఈ ప్రాంతం చేపలవేటకు ప్రసిద్ధి చెందినది. అలాగే కొంతమంది ధైర్యవంతులైన గజ ఈతగాళ్లకు కూడా.హార్బర్ నుంచి బయటకు తీసుకువచ్చిన మొసళ్లను చంపేస్తారు. ఎందుకంటే వాటిని వేరే ప్రాంతంలో వదిలేసినా అవి తిరిగి హార్బర్‌కే వస్తాయి.

"ప్రజలను రక్షించడం మా బాధ్యత" అని ఇవిన్ చెప్పారు. ఆయన రెండేళ్లుగా ఈ ఉద్యోగం చేస్తున్నారు. అంతకు ముందు పోలీస్ అధికారిగా పని చేశారు."మేం ప్రతి మొసలిని పట్టుకోం. అయితే వీలైనన్ని ఎక్కువ మొసళ్లను హార్బర్ నుంచి బయటకు తీసుకువస్తాం. అందువల్ల ప్రజలకు వాటితో సమస్య ఉండదు" అని ఇవిన్ చెప్పారు.ఇందులో మొదటి అంశం స్థానికులకు మొసళ్ల గురించి అవగాహన కల్పించడం.నార్తర్న్ టెరిటరీ ప్రభుత్వం స్కూళ్లలో "బి క్రాక్‌వైజ్" అనే పేరుతో అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేసింది. ఇందులో భాగంగా మొసళ్ల ఆవాసాల సమీపంలో ఉండే ప్రజలు ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో బోధిస్తారు.ఇది ఎంతగా విజయవంతం అయిందంటే ఫ్లోరిడా, ఫిలిప్పీన్స్ కూడా ఈ కార్యక్రమాన్ని అమలు చేయాలని ఆలోచిస్తున్నాయి."మేం మొసళ్లు ఉండే దేశంలో జీవిస్తున్నాం. అందుకే నీరు ఉన్న ప్రాంతంలో సురక్షితంగా ఎలా ఉండాలనేది నేర్చుకుంటున్నాం" అని ఈ కార్యక్రమ నిర్వాహకురాలు నటాషా హాఫ్‌మన్ చెప్పారు."మీరు పడవలో ప్రయాణిస్తూ చేపలు పడుతూ ఉంటే, మొసళ్లు కూడా అక్కడ ఉన్నాయని గుర్తుంచుకోవాలి. అవి మాటు వేసి దాడి చేసే జంతువులు. వేట కోసం అవి చాలా ఓపిగ్గా వేచి చూస్తాయి. ఆహారం లభించే అవకాశం ఉందని భావిస్తే, దాడి చేస్తాయి" అని ఆమె వివరించారు.నార్తర్న్ టెరిటరీలో మొసళ్లను చంపే కార్యక్రమం పెద్ద ఎత్తున ఏమీ చేపట్టలేదు. అవి రక్షిత జీవుల జాబితాలో ఉండడమే దానికి కారణం.అయినప్పటికీ ప్రభుత్వం నిరుడు పదేళ్ల మొసళ్ల నిర్వహణ ప్రణాళికకు ఆమోదం తెలిపింది.దాని ప్రకారం ఏడాదికి 1200 వరకు మొసళ్లకు చంపేందుకు అనుమతులిచ్చారు.మొసళ్లలో ఏదైనా మనుషులకు ముప్పుగా మారుతుందని ఇవిన్ టీమ్ భావిస్తే వాళ్లు దాన్ని వెంటనే అక్కడ నుంచి తొలగిస్తారు.గతేడాది 12 ఏళ్ల బాలిక చనిపోయినప్పుడు నార్తర్న్ టెరిటరీ నాయకురాలు ఇవా లాలర్ మొసళ్ల సంఖ్య తగ్గించే చర్యలు చేపట్టాలన్నారు.ప్రస్తుతం ఇక్కడ ఉప్పునీటి మొసళ్లు 2.50 లక్షలు ఉన్నాయి.

మొసళ్ల సంఖ్య ఎంత ఉండాలనే దానిపై వివాదం ఉండవచ్చు, అయితే మొసలి చర్మం కొనుగోలు చెయ్యడానికి వచ్చే పర్యటకులకు నార్తర్న్ టెరిటరీ పెద్ద వరం.అడిలైడ్ నదిలో మొసళ్లకు ఆహారం వేసేటప్పుడు అది అందుకోవడానికి అవి పైకి ఎగరడాన్ని చూసేందుకు పర్యటకులు అక్కడకు వస్తుంటారు.విలియమ్స్‌కు చిన్నప్పటి నుంచి మొసళ్లంటే ఇష్టం. వాటి వల్ల చాలా అవకాశాలు ఉన్నాయని ఆయన నమ్ముతారు.'పదేళ్లలో పర్యటకుల సంఖ్య బాగా పెరిగింది" అన్నారాయన.మొసళ్ల వేటపై నిషేధం విధించడంతో వాటిని పెంచడం అనేది ఆర్థికంగా లాభసాటి అంశంగా మారింది. నార్తర్న్ టెరిటరీలో ప్రస్తుతం లక్షన్నర మొసళ్లను పెంచుతున్నట్లు అంచనా.లూయి విటన్, హెర్మిస్ లాంటి ఫ్యాషన్ సంస్థలు మొసళ్ల పెంపకంలో పెట్టుబడులు పెట్టాయి. హెర్మిస్ తయారు చేసిన బిర్కిన్ 35 క్రాక్ హ్యాండ్ బ్యాగ్ 4.26 కోట్ల రూపాయల వరకు ఉంటుంది."మొసళ్లను పెంచేందుకు ప్రభుత్వం వాణిజ్యపరమైన ప్రోత్సహకాలు ఇస్తోంది" అని మిక్ బర్న్స్ చెప్పారు.నార్తర్న్ టెరిటరీలో ఆయన విలాసవంతమైన బ్రాండ్లకు చెందిన సంస్థలతో కలిసి పని చేస్తుంటారు.డార్విన్ శివార్లలో ఆయన ఆఫీసు ఉంది. మొసళ్ల చర్మంతో ఆయన ఒక ఫ్లోర్ మొత్తాన్ని అలంకరించారు.

బర్న్స్‌కు డార్విన్ నుంచి 500 కిలోమీటర్ల దూరంలో అర్న్‌హెమ్ ల్యాండ్ వద్ద వ్యవసాయ క్షేత్రం ఉంది. అక్కడ ఆయన స్థానిక మూలవాసీ రేంజర్లతో కలిసి మొసలి గుడ్లను పొదిగిస్తారు. ఆ మొసళ్ల చర్మాన్ని విలాసవస్తువుల పరిశ్రమకు అమ్ముతుంటారు.

మొసళ్లను వ్యవసాయ క్షేత్రాల్లో బందించి పెంచడంపై జంతు ప్రేమికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.




## పిచ్చికి పరాకాష్ట.. న్యూ ఇయర్ వేడుకలను ఏకాంతంగా జరుపుకోవాలని ఏం చేశాడంటే..



ప్రపంచంలోని అనేక దేశాలు కొత్త సంవత్సరానికి భిన్నమైన పద్ధతిలో స్వాగతం చెప్పాయి. ద్రాక్ష తింటూ, బకెట్ తో నీరు విసురుతూ ఇలా రకరకాల పద్దతిలో కొత్త సంవత్సరానికి వెల్కం చెప్పారు. అయితే రష్యాకు చెందిన ఒక వ్యక్తి భిన్నమైన పద్దతిలో కొత్త సంవత్సర వేడుకలను జరుపుకున్నాడు. కారుని సమాధి చేసి కొత్త ఏడాదికి వెల్కం చెప్పాడు. ఇందుకు సంబంధించిన వీడియో వైరల్ గా మారింది.ప్రపంచంలో న్యూ ఇయర్ వేడుకలను భిన్నమైన పద్దతిలో జరుపుకున్నారు. అయితే రష్యాలో జరుపుకున్న న్యూ ఇయర్ వేడుకలకు సంబంధించిన వీడియో వైరల్‌గా మారింది. ఈ ఘటన నిజంగా షాకింగ్‌గా ఉంది. ఎవ్జెనీ చెబోటరేవ్ అనే వ్యక్తి తన కారుతో పాటు సజీవ సమాధి అయ్యాడు. ఈ స్టంట్ చేసి ఇంటర్నెట్ ప్రజలను ఆశ్చర్యపరిచాడు. ఈ ఘటనకు సంబంధించిన వీడియో చూసిన నెటిజన్లు ఖంగుతింటున్నారు. చాలా మంది దీనిని ప్రమాదకరం, బాధ్యతారాహిత్యం అని పేర్కొన్నారు. ఎందుకంటే ఇటువంటి విన్యాసాలు ప్రాణాంతకం ఒకొక్కసారి కావచ్చు.ఎవ్జెనీ చెబోటరేవ్ తన ఇన్‌స్టాగ్రామ్‌లో ప్రజలకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలుపుతూ ఒక వీడియో షేర్ చేశాడు. దీనిలో కొంతమంది తెల్ల కారుతో పాటు ఉన్న ఎవ్జెనీ చెబోటరేవ్ ని ఒక పొలంలో పాతిపెట్టడం కనిపిస్తుంది. తాను కారులో భూమిలో సమాధి అయినా కొంత ఇంటర్నెట్ పని చేస్తోంది.. గాలి కూడా వస్తుందని చెప్పాడు. అయితే తనను ఎక్కడ పాతిపెట్టారో చెప్పనన్నాడు.

కొత్త సంవత్సర వేడుకలు డిఫరెంట్ గా జరుపుకోవాలనుకున్న ఈ రష్యన్ వ్యక్తి ఈ ప్రమాదకరమైన స్టంట్ చేశాడు. ఈ వీడియో సోషల్ మీడియాలో షేర్ చేస్తూ తనకు కొంతకాలం ప్రజలకు దూరంగా జీవించాలని.. విరామం తీసుకోవాలని కోరుకుంటున్నట్లు చెప్పాడు.అనుసరిస్తున్నారు. ఇలాంటి ప్రమాదకరమైన విన్యాసాలు చేయడంలో ఫేమస్. జనవరి 1న షేర్ చేసిన అతని రీల్‌ను ఇప్పటివరకు 23 లక్షల మంది లైక్ చేశారు. అయితే ఈ సారి మాత్రం సజీవ సమాధి లాంటి విన్యాసాలు చేయడం చూసి అభిమానులు ఫిదా అవుతున్నారు. అదే సమయంలో ఈ స్టంట్ పట్ల భిన్నాభిప్రాయలను వ్యక్తం చేస్తున్నారు.కంటెంట్ చూసి ఒక నెటిజన్ ఇలాంటి స్టంట్స్ చేసి తమ జీవితాలను కోల్పోతున్నారని వ్యాఖ్యానించారు. ఇంకో యూజర్ .. అంతా బాగానే ఉంది కానీ బాత్రూమ్‌కి వెళ్ళాల్సి వస్తే ఎలా అంటూ సందేహాన్ని వెల్లడించాడు.

## రష్యా గ్యాస్ బంద్‌తో చలికాలంలో ఈయూ గజగజ వణకాల్సిందేనా? ఈ చర్చ ఎవరికి నష్టం, ఎవరికి లాభం...



యుక్రెయిన్ మీదుగా యూరప్‌కు రష్యా గ్యాస్ సరఫరాకు తెరపడింది. అయిదేళ్ల ఒప్పందం ముగిసిపోవడంతో రష్యా గ్యాస్ సరఫరా నిలిపేయాల్సి వచ్చింది. దీంతో దశాబ్దాలుగా సాగిన ఈ అంకం ముగిసింది.ఈ విషయంపై యుక్రెయిన్ అధ్యక్షుడు వొలొదిమిర్ జెలియెన్‌స్కీ మాట్లాడుతూ, 'మా రక్తం మీద మరిన్ని కోట్లు సంపాదించే అవకాశాన్ని మేం రష్యాకు ఇవ్వబోం' అన్నారు.ఇది రష్యాపై సాధించిన మరో విజయమని పోలాండ్ ప్రభుత్వం వ్యాఖ్యానించింది.ఈ మార్పుకు తాము సిద్ధంగా ఉన్నట్లు యూరోపియన్ యూనియన్ ప్రకటించింది. ఈయూలోని సభ్య దేశాలు ఈ మార్పును తట్టుకోగలవని యూనియన్ అంటోంది.అయితే, యూరోపియన్ యూనియన్‌లో భాగంగా లేని దేశమైన మోల్డోవా ఇప్పటికే గ్యాస్ కొరతతో ఇబ్బందులు పడుతోంది.రష్యా ఇప్పటికీ నల్ల సముద్ర మార్గాన టర్క్ స్ట్రీమ్ ద్వారా హంగరీ, తుర్కియే, సెర్బియా వంటి దేశాలకు గ్యాస్ సరఫరా చేసే అవకాశం ఉంది.

రష్యా 1991 నుంచి యుక్రెయిన్ మార్గాన యూరప్‌కు గ్యాస్ సరఫరా చేస్తోంది

బుధవారం ఉదయం 8 గంటల నుంచి యుక్రెయిన్ మార్గాన యూరప్‌కు రష్యా గ్యాస్ ఎగుమతులు నిలిచిపోయాయని రష్యా కంపెనీ గాజ్ ప్రామ్ ప్రకటించింది.ఈ నిలిపివేత వల్ల తక్షణ పరిణామాలు అంత తీవ్రంగా లేకపోయినప్పటికీ, భవిష్యత్‌లో యూరప్‌పై తీవ్ర ప్రభావం పడనుంది.రష్యా ఒక కీలక మార్కెట్‌ను కోల్పోయింది. కానీ, ఈ మార్పు వల్ల ఎక్కువగా నష్టపోయేది ఈయూ దేశాలేనని రష్యా అధ్యక్షుడు పుతిన్ అన్నారు.రష్యా 2022లో పూర్తిస్థాయిలో యుక్రెయిన్‌పై దండయాత్ర మొదలుపెట్టినప్పటి నుంచి రష్యా నుంచి గ్యాస్ దిగుమతులను ఈయూ గణనీయంగా తగ్గించింది.

అయితే, యూరోపియన్ యూనియన్‌లోని పలు సభ్య దేశాలు గ్యాస్ కోసం రష్యా పైనే అధికంగా ఆధారపడటంతో రష్యా ఏటా దాదాపు 5 బిలియన్ యూరోల ( రూ. 43,000 కోట్లు) ఆదాయం ఆర్జించింది.ఈయూ గ్యాస్ దిగుమతుల్లో రష్యా నుంచి 2023లో వచ్చినది కేవలం 10 శాతమే. 2021లో ఈ దిగుమతులు 40% ఉండేవి.స్లోవేకియా, ఆస్ట్రియా వంటి ఈయూ సభ్య దేశాలు మాత్రం గ్యాస్ కోసం రష్యా మీదే ఎక్కువగా ఆధారపడుతున్నాయి.ఈ గ్యాప్‌ను ఎదుర్కొనేందుకు తమ దగ్గర గ్యాస్ నిల్వలు సిద్ధంగా ఉన్నాయని, ఇతర మాధ్యమాలనుంచి కూడా తమకు గ్యాస్ సరఫరా అవుతుందని ఆస్ట్రియా ఎనర్జీ రెగ్యులేటర్ వెల్లడించింది.మరోవైపు, ఈ ఒప్పందం ముగియడంతో స్లోవేకియా ఇబ్బందుల్లో పడింది.రష్యా నుంచి యూరప్‌కు గ్యాస్ పంపేందుకు స్లోవేకియా ఎంట్రీ పాయింట్ దేశంగా వ్యవహరిస్తోంది. ఇందుకుగాను రవాణ రుసుముల రూపంలో ఆదాయాన్ని పొందింది.గ్యాస్ దిగుమతి చేసుకోడానికి ఇతర మార్గాలను కనుక్కుంటామని స్లోవేకియా అంటోంది. 2025లో గ్యాస్ ధరలు పెరగనున్నాయని తమ వినియోగదారులను ఉద్దేశించి డిసెంబర్‌లో స్లోవేకియా ఎనర్జీ రెగ్యులేటర్ ప్రకటించింది.ఈ ఒప్పందం ముగిసిపోవడం వల్ల ఈయూలోని సభ్య దేశాలు తీవ్ర పరిణామాలను ఎదుర్కోవాల్సి ఉంటుందని, రష్యాపై దీని ప్రభావం ఏమీ ఉండదని స్లోవేకియా ప్రధాని రాబర్ట్ ఫికోను ఉటంకిస్తూ వార్తాసంస్థ రాయిటర్స్ వెల్లడించింది.పుతిన్‌తో చర్చలు జరిపేందుకు శుక్రవారం మాస్కోను సందర్శించిన ఫికో, యుక్రెయిన్‌కు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తామని హెచ్చరించారు.ఈ నేపథ్యంలో పుతిన్‌కు ఆర్థిక బలాన్ని అందిస్తూ, యుక్రెయిన్‌ను బలహీనపర్చేందుకు స్లోవేకియా ప్రయత్నిస్తోందంటూ యుక్రెయిన్ అధ్యక్షుడు జెలియన్‌స్కీ ఆరోపించారు.యుక్రెయిన్ ప్రజల్ని మరింత ఇబ్బందులు పెట్టేందుకు పుతిన్ చేస్తోన్న ప్రయత్నాల్లోకి స్లోవేకియాను కూడా ఫికో భాగం చేస్తున్నారని ఆయన అన్నారు.స్లోవేకియా నుంచి వచ్చే విద్యుత్, యుక్రెయిన్‌కు చాల కీలకం. ఒకవేళ స్లోవేకియా విద్యుత్ సరఫరా నిలిపివేస్తే యుక్రెయిన్‌కు తాము అండగా నిలబడేందుకు సిద్ధమని పోలాండ్ ప్రకటించింది."అంతర్జాతీయ మార్కెట్ల నుంచి గ్యాస్ సరఫరాకు ప్రత్యమ్నాయ మార్గాలు కూడా ఉన్నాయి. ప్రపంచ దేశాలు ఈ మార్గాలని ఎంచుకొని యూరప్‌కు గ్యాస్ సరఫరా చేస్తూ, కోట్లు సంపాదించే అవకాశాన్ని రష్యాకు ఇవ్వకూడదు" అని పోలాండ్ విదేశాంగ మంత్రి రాడోస్లావ్ సిరోర్స్కి అన్నారు.అందుకే అమెరికా, ఖతార్, నార్త్ సీ నుంచి పోలాండ్ గ్యాస్‌ను దిగుమతి చేసుకుంటోందని ఆయన చెప్పారు.అయితే, రష్యా నుంచి గ్యాస్‌ను నిలిపేయడం వల్ల తీవ్రంగా నష్టపోయే దేశం మోల్డోవా.రష్యా గ్యాస్ ఆధారంగానే ఈ దేశంలోని ఒక పవర్ స్టేషన్ ద్వారా అధిక భాగం విద్యుత్ ఉత్పత్తి అవుతుంది.ఈ ఆరోపణలను మోల్డోవా అధ్యక్షుడు కొట్టిపారేశారు.ఇంధనాన్ని రష్యా ఒక రాజకీయ అస్త్రంగా వాడుతోందని ఆయన ఆరోపించారు.రష్యా చేపడుతున్న చర్యల వల్ల చలికాలం వేళ వేడి, కాంతి లేకుండా ట్రాన్స్‌నిస్ట్రియా అల్లాడుతుందని ఆయన అన్నారు.స్థానిక కాలమానం ప్రకారం 07:00 గంటలకు గ్యాస్ సరఫరా తాత్కాలికంగా నిలిపివేయడం వల్ల ట్రాన్స్‌నిస్ట్రియాకు హీట్, వేడి నీటి సరఫరా ఆగిపోయింది.ప్రజలంతా వెచ్చని దుస్తులు ధరించాలని, కుటుంబ సభ్యులంతా ఒకే గదిలో ఉండాలని, కిటికీలకు దుప్పట్లు లేదా మందపాటి కర్టెన్లను వేలాడదీయాలని, ఎలక్ట్రిక్ హీటర్లను ఉపయోగించాలని ఎనర్జీ సంస్థ తిరస్తెప్లోఎంఎర్గో సూచించింది.2025లో సాధారణ ఎన్నికలకు ముందు తమ దేశాన్ని అస్థిరపరిచే లక్ష్యంతో క్రెమ్లిన్ "బ్లాక్ మెయిల్" చేస్తోందని మోల్డోవా అధ్యక్షుడు మైయా సాండు ఆరోపించారు.